# ఆంధ్రభూమి ప్రకటనలు

[రేట్లు వలయువారు 'ఆంధ్రభూమి' కార్యాలయమునకు వ్రాయునది.]

| నెం | ప్రకటించినవారు. | | ప్రకటించినవస్తువు. | | పుట |
|---|---|---|---|---|---|
| 1. | ది డెక్కన్ అస్యూరెన్సుకంపెనీవారు | ... | ది డెక్కన్ అస్యూరెన్సు | కవరుపుట | 2 |
| 2. | లాల్ జి గోధు అండ్ కంపెని | ... | రోలు కృష్ణమార్కు ఇంగువ | ... | 1 |
| 3. | ఆర్యరసాయనశాల | ... | సువర్ణసుందరరసము అభ్రకభస్మము | .. | 2 |
| 4. | ఆయుర్వేదాశ్రమము | ... | జీవామృతము | ... | 3 |
| 5. | శ్రీ యర్రమిల్లి మంగయ్యపంతులుగారు | ... | ఆంధ్ర ఇన్సూరెన్సు | ... | 4 |
| 6. | యస్. సి. అప్పాసామిచెట్టి అండు కో | . | ట్రైకలర్ ప్రాసెస్ బ్లాకులు | ... | 6 |
| 7. | తాత కృష్ణమూర్తిగారు | .. | రామప్రియ | ... | 6 |
| 8. | ది క్లిక్ అండు కో | ... | లైన్, ఆఫ్‌టోన్, పోస్టరు బ్లాకులు | ... | 6 |
| 9. | రత్నా అండు కో | ... | రత్నా ఫవుంటెన్ పెన్ | ... | 7 |
| 10. | ది పేరమాంటు కాంపిటీషనులు | ... | పోటీబహుమానము | ... | 8 |
| 11. | శ్రీ యం. కె. శ్రీనివాసన్ గారు | ... | ది యునైటెడ్ ఇండియా లైఫ్ అస్యూరెన్సు | | 8 |
| 12. | మద్రాసు వర్డ్సు బీరో | ... | పోటీబహుమానము | .. | 8 |
| 13. | శ్రీ దత్తాత్రేయ అజీర్ణమాత్రలఫార్మసీ | ... | దత్తాత్రేయ అజీర్ణమాత్రలు | ... | 10 |
| 14. | గంధర్వఫార్మసీ | ... | గంధర్వకళ | ... | 10 |
| 15. | భారత భైషజ్యనిలయము | ... | శిశుపోషణి | ... | 10 |
| 16. | భవానీ ఫార్మసీ | ... | స్వర్ణమాలిని | ... | 10 |
| 17. | పి కోదండరామ్‌పిళ్లె | ... | ఉత్తమతరగతి కర్రసామగ్రిలు | ... | 12 |
| 18 | అమృతాంజనము డిపో | .. | అమృతాంజనము | కవరు పుట | 3 |
| 19. | డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారు | ... | లీవర్ అండ్ స్ల్పీన్ స్పెసిఫిక్ | కవరు పుట | 4 |




## పి. కోదండరాంపిళ్లె

(లేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లెవారి కుమారులు)

1854-వ సంవత్సరమున స్థాపితము.

ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు

(పి. యస్. పొన్నుసామిపిళ్లె భవనములు)

మీ భవనమును అలంకరించుటకును, దానిని ఆకర్షణీయముగ చేయుటకును కర్రసామగ్రులు కావలయును. త్వరగా చేసియిత్తుము. నమ్మకమైన పనితనము.

కర్రసామగ్రులను కొనుటకు పూర్వము మాతో సంప్రదింపుడు. పురాతనమైన, ప్రఖ్యాతిగల కంపెనీ.

39-44, ఎస్ల్పనేడ్ వెస్టు; బెత్తాలంగడి వీధి, మద్రాసు.

ఈ సంచికలో పోటీబహుమానము కలదు

# విషయసూచిక


౧. రాలినపూవులు ... .... ౫౭
—వఝ్ఝుల కాళిదాసు

౨ పెళ్ళినాడిచ్చిన కట్నం .... ౫౮
—కొడవటిగంటి కుటుంబరావు

౩. అంతరము ... .... ౬౧
—అయినంపూడి గురునాథరావు
(ఉభయభాషాప్రవీణ)

౪. చుక్క ... .... ౬౨
—బొడ్డు బాపిరాజు

౫. ఒలింపియన్ .... ... ౬౩
—త్రిపురనేని గోపీచందు, బి.ఏ.

౬. డాక్టరు ఆనిబిసెంటు ... ౬౯
—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

౭. సుశీల .... ... ౭౧
—తిరుమూరు రంగారెడ్డి

౮. కుమార్పణ .... ... ౭౬
—కొత్త సూర్యనారాయణ చౌదరి

౯. భిక్షుక బాలుడు ... ౭౭
—కర్రా చంద్రశేఖరము

౧౦. అశ్రుగీతి .... ... ౭౯
—ఓలేటి సీతారామమూర్తి

౧౧. ఆశ ... ... ... ౮౦
—చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదు, బి.ఏ.

౧౨. ఆడబిడ్డ మగబిడ్డగుట ... ౮౧
—నాయని శేషాచలరావు

౧౩. కవిసాధన ... ... ౮౪
—కొడాలి వేంకటరాజారావు

౧౪. రైతుపాట .... ... ౮౭
—శెట్టిపల్లి వెంకటరత్నం చౌదరి
—శ్రీగిరిరాజు రామారావు

౧౫. కోడికూత .... ... ౮౮
—కొండపల్లి గోపాలరావు,
—హరి రామలింగశాస్త్రి.

౧౬. నోబెల్ వాఙ్మయ బహుమానములు ... ౮౯
—సురపూరు కోదండరామరెడ్డి

౧౭. హిట్లరు .... .... ౯౧
—ధీరం వేంకటనాధశాస్త్రి, బి. ఏ.

౧౮. ఇన్నూరెన్ను విషయములు.... ౯౩

౧౯. వివేకానందుడు : స్త్రీసమస్యలు. ౯౭

౨౦ ఆరోగ్యవిజ్ఞానము ... ౯౯

౨౧ గ్రంథాలయోద్యమము - పతాకము.... .... ౧౦౧
—ఊటుకూరు వేంకటసుబ్బారావు శ్రేష్ఠి.

౨౨ విడూరములు .... ౧౦౩

౨౩. అరబదేశమునందలి యాంధ్రులు ౧౦౫

౨౪. ఆంధ్రభూమి పుస్తకపీఠము .... ౧౦౭

౨౫. ఆంధ్రుని డైరి .... .... ౧౧౦

౨౬. సంపాదకీయ సమాలోచన .... ౧౧౨




'నాగస్వరం పట్టితే నాగులకు ఆట'

—చిత్రకారుడు: శ్రీపాద దుర్గారావుగారు, రామారావు ఆర్టు సొసైటీ.

# రాలినపూవులు

✠

కవికుమారుఁడు కల్యాణగీతము లాలపించుచుండ నానందభరంబున మల్లీకుమారి పులకాంకితయై నేలకు రాలిపోయినది. రాలినపూరేకులఁ దీసి యశ్రుమాలికాకలితాత్ముఁడగు నాకుమారప్రణయమూర్తి గాటముగ నదిమి కౌఁగిలించుకొనెను. ఆకుమారుని నిర్మలప్రేమగీతామరంద బిందువులు తదీయరహఃకంఠస్థలంబుల నిక్షేపింపఁబడినవి.

♦ ♦ ♦

"మల్లెపూ లమ్మా మల్లెపూలు!" అని యతఁడు చీఁకటిలో నడచుచుండెను. అప్పుడే మల్లెపూలు కొనుమని పంతముపట్టిన తన రెండేండ్లతనయను వీధిలోఁ బెట్టి యొకగృహస్థుతలుపు గడవైచెను. అట్టి యేడుపుమాని యాపసిపిల్ల పువ్వులదెస కంటినీరుతో చూచుచు "నాకు పువ్వులిస్తా?" అనెను. స్మృతికందని పరిచయకంఠమువిన్నవానివలె నాతఁడన్నిదండలను ఆమెచేతఁ బెట్టెను. తలుపువారనుండి యిదిచూచిన యజమాని చరచర వీధిలోనికివచ్చి "ఛీదొంగా! పిల్లను మంచిచేసి వస్తువులు దొంగిలింప యత్నించుచుంటివా?" యనుచు నాదండలు పిల్లచేతినుండి లాగి విసరివైచెను.

✠

—వఝ్ఝల కాళిదాసు.



# పెళ్లినాడిచ్చిన కట్నం

నేను మొదటినించీ ఇట్లా లేను. మొన్న 1920లో గ్రాంధీమహాత్ముడు ఆసహాయోద్యమం మొదలుపెట్టాడు చూడండి! అప్పుడు నా కొకవిధమైన ఆవేశం బయల్దేరింది. ఎవరికి బయల్దేరదుకనక! ఈరాజ్యతంత్ర మేమిటి? ఈలోకం ఏమిటి? ఈజీవిత మేమిటికదా అని ఆలోచించటం మొదలుపెట్టాను. చూశారో లేదో! ఈసమాసాలు చాలాఘట్టివి. వీటినిగురించి తవ్వినకొద్దీ ఉంది. ఆలోచించినకొద్దీ ఉంది. మనం జీవితంలో ఎంత అన్యాయంచేస్తున్నామో ఆలోచించండి. మన కింత ఉపకారంచేస్తున్న బ్రిటీషుగవర్నమెంటుమీదనే గ్రాంధీమహాత్ములు సహాయనిరాకరణం ప్రయోగిస్తున్నప్పుడు—అంటే చూశారో లేదో! గ్రాంధీగారి కెదురుచెప్పటానికి నే నేపాటివాణ్ణికాని, బ్రిటీషువారు మనకు చేసినలాభాలు ఒకటీరొండు కావు! పోస్టాఫీసులు పెట్టారా? ఉద్యోగా లిస్తున్నారా? కాలవలు తవ్వారా? అన్నిటి కన్నా ముఖ్యం, రైళ్ళు వేశారా?- రైళ్ళంటే చెబుతా! నాపెళ్ళయినకొత్తలో మామామగారూరు పోవాలంటే అయిదుకోసులు రొండెడ్లబళ్ళు కట్టించుకొని తెల్లవారటాని కింకాపదిఘడియలుపాఉండగా బయలుదేరితేకాని తెల్లవారి చేరేవాళ్ళం కాము. ఇప్పుడో? గబగబా నాలుగుమెతుకులు నోట్లో వేసుకుని బయల్దేరితే స్టేషను ఒకమైలు. ఆస్టేషనులోనే ఒకగంట నడుం వాలిస్తే రైలొస్తుంది. టేడా టిక్కెట్టు కన్నుమూసి కన్ను తెరిచేటప్పటికి అవతలస్టేషను చేరతాం. అవతల మామామగారిఊరు కాలవకట్టనేపోతే రొండుకోసులు. ఆడుతూపాడుతూ పోవచ్చు. ఎంత ఉసులో చూడండి. ఈరైలు వేసేటప్పు డింకోచిత్రం జరిగింది. మామామగారిభూమిలో అయిదెకరాలు మాన్యం రైలుకింద పడ్డది. దానికోసరం అర్జీలు పెట్టుకుంటే గవర్నమెంటువారు అయిదువందల రూపాయలు అక్షరాలా ఇప్పించారు. "మీకోసం వేసినరైలేకదా, ఏదోపొలం దానికింద పడదా? మే మేమీఇచ్చుకోం" అంటే మామామగా రేంచెయ్యగలడు? చెప్పండి!— ఇన్నిచేసిన బ్రిటీషుగవర్నమెంటునే గ్రాంధీమహాత్ముడు అసహాయోద్యమం చేస్తుంటే, మామామగారిదగ్గిరనించి నేను పెళ్ళినాడు అయిదువందలు కట్నరూపేణా తీసుకోటం ఎంతఅన్యాయం! అందులో ఆయనతాలూకు అయిదెకరాలు రైలుకింద పడికూడా పోయినప్పుడు. నావి అయిదెకరా లేమైనా ఆయన రైలుకింద పడ్డయి కనకనా!

ఆయనా ఎక్కువ స్థితిలో ఉన్నవాడేం కాదు. రైలుకిందపడ్డ అయిదెకరాలూ కూతురిపెళ్ళికి అమ్మిన రొండెకరాలూ పోగా మిగిలిన నాలుగెకరాలచిల్లరా మామామగారు కోర్ట్లవెంట తిరిగి ఖర్చుచేసేవాడు. అయితే ఏం? ఆయనకు వ్రతంచెడ్డా ఫలందక్కింది. వాళ్ళఊళ్ళో ఆయనంతప్రయివేటు లేడన్నారా లేదా? మాబావమరిదేమో చదువుకింద డబ్బుతగలేసి తగలేసి చివరకు ఉద్యోగమైనాచెయ్యక జేబులో ఉత్తమనీపాకు వేసుకుని కాఫీహోటళ్ళచుట్టూ తిరుగుచున్నాడు. ఇటువంటి స్తితుల్లో నేను కట్నంబాపతుడబ్బు మామగారికి తిరిగిఇవ్వటం న్యాయమేకాక ధర్మంగా కూడాకనపడ్డది.

ఇప్పు డింకొకచిక్కు వచ్చిపడ్డది. ఆన 1917 ది 7 జనేవరితారీఖున్న నాపెళ్ళయిం దనుకోండి. ఆనాడు

నాకు వెండిచెంబులూ పట్టుతాపితాలూ వగయిరాల కింద మిగిలినది రొక్కంగాను యిచ్చిన మొత్తం వెరసి అక్షరాలా అయిదువంద లనుకోండి. యిందుక్కి వడ్డీ నెల 1-కి? వడ్డీ కట్టనద్దా? 16-సంవత్సరాలకింద తీసుకున్న అయిదువందలు ఇప్పుడింకా అయిదువందలుగానే ఉండవుగా! మనుష్యులూ, పశుపక్ష్యాదులూ, చివరకు గోళ్ళూ, జుట్టూ కూడా పెరుగుతున్నప్పుడు—వెధవదిగడ్డంవంటిది పెరుగుతున్నప్పుడు—డబ్బు పెరగదంటే ఎవడు నమ్ముతాడు? అయితే ఏ రేటున వడ్డీ కట్టాలి. మూడురూపాయలబేడా మార్వాడీ వడ్డీ దగ్గిరనించి పావలా బ్యాంకీవడ్డీవరకూ ఉండునున్నది వడ్డీరేటు. నే నందులో ఏరేటు తీసుకోవాలి? మా మామగారు ఈడబ్బు ఏవిధంగా ఉపయోగించి ఉండేవాడు? వడ్డీ కిచ్చాడనుకుందాం. ఈయనవగ్గిర మూడురూపాయలబేడాకు ఎవ డప్పు తీసుకుంటాడు? పెళ్ళాంపుస్తె తాకట్టన్నా పెట్టి మార్వాడీల దగ్గిరే తీసుకొంటారుకాని? ఆడబ్బాయన బ్యాంకీలో వేసి ఉండేవా డనుకుని తక్కువవడ్డీ ఇవ్వటంకూడా న్యాయంకాదు. పైగా అంతవరకూ ఊహించుచున్న తరవాత ఆబ్యాంకీ దివాలా ఎత్తిందనుకోటంకూడా చాలా తేలి కవుతుంది. చఛ్! ఇది బాగాలేదు. అదీకాక ఈడబ్బు మామామగారికిస్తే శతవిధాల జరిగే దేమిటంటే ఆ కాస్తా మాబావమరిది తనఖాళీమనీపాకెట్లో వేసుకుని కాఫీహోటళ్ళచుట్టూ తిరగటానికి బదులు కాఫీహోటళ్ళనే ఇంటికి పిలిపిస్తాడు. ఇదంతా ఎందుకు? మనకు కంపెనీరేటు ఉండనే ఉంది. నెల 1-కి నూటికి ఒకరూపాయి మనకూ చాలా తేలికగా ఉంటుంది. వినేవాళ్ళకూ చాలా సౌమ్యంగా ఉంటుంది అనుకున్నాను.

కాని లెక్కవేసి చూసినమీదట మనసు తేలికగా ఉంటుందన్న భ్రమ వదిలింది. నేను నా ఏకాంతాన లెక్కచూసుకోగా నేను మామామగారికి ఇవ్వ తేల్సిన బాకీ ఒక్కదమ్మిడీ తక్కువ లేకుండా రెండుసంచులు! నాగుండె బద్దలయింది. ఇదెట్లాగురా భగవంతుడా! నేను మామామగారి ఋణాన పోవలిసిందేనా అనుకుంటుండగా ఇంకోవిషయంకూడా జ్ఞాపకం వచ్చింది. నేను కట్టింది బారువడ్డీ. మూడుసంవత్సరాల కొకసారి తిరగరాస్తేకాని చెల్లి చావదాయె! దేవుడాఅంటూ మూడేళ్ళ కోసారి తిరగరాతలతో లెక్కచూశాను. అసలు నోటేదంటారేమో? న్యాయానికి బద్ధకంకణం కట్టుకున్నవాడికి నోటుతో ఏంపని? ఈసారి నే నివ్వ తేలిన మొత్తం వందో రెండొందలో తక్కువగా నాలుగువేలయింది!

ఇం కొకడైతే ఇక్కడే వెనక్కితిరిగిపోవలిసిందే! నే నట్లా చెయ్యలేదు. సావిత్రి యముడివెంటపోతూ ముళ్ళకు భయపడ్డదా? నా తెలివితేటలన్నీ ఉపయోగించి న్యాయానికి భంగంలేకుండా ఈమొత్తాన్ని తగ్గించే ఉపాయం ఏదాఅని ఆలోచించాను.

నామనసులో వడ్డీ న్యాయశాస్త్రంలో చెప్పబడలే దేమో అని ఒకఆశ ఉంటూవచ్చింది. అందువల్ల అది కాస్తా తేల్చుకుందామని ఒకప్లీడరుగారిని వెళ్ళి అడిగాను. ఆయన నావంక చిత్రంగా చూసి, "వడ్డీ ఇవ్వటం న్యాయమాఅని అడుగుతున్నారూ? న్యాయశాస్త్రంలో అత్రిమహాముని చెప్పినప్రకారం వడ్డీయిస్తే ఒక్కక్షణంలో మనం దివాలా ఎత్తిపోముటండీ?" అన్నాడు. అస లందాకా ఎందుకు? వడ్డీ ఇవ్వటం తీసుకోటం అన్యాయమే అయితే ఇంతమంది ప్రతిరోజూ నోట్లు రాసి చివరకు "యిది సమ్మతించి వ్రాసి యిచ్చిన ప్రాంశరీనోటు" అని ఎందుకంటున్నారు?

ఇప్పు డేంచెయ్యాలి? ఇంతలో ఒకభేషయిన ఆలోచన తట్టింది మేధావి కేదీ అసంభవం కాదనుకోండి! పెళ్ళి కిచ్చినమొత్తంలో లాంఛనాలకింద రెండువందలయాభై దాకా పోయినై రొక్కం రెండొందలయాభై మాత్రమే. లాంఛనాలు బాకీ ఎట్లా అవుతై? అల్లుడుగదా అని ఇచ్చినవస్తువులు బాకీకింద రావని రూఢిచేసుకున్నాను. ఎటుపోయి ఎటువచ్చినా అడిగి కనుక్కుందామని నాభార్యను కదిలించాను.

"మీరు గొంతుమీదకూర్చుంటే ఇచ్చాడు కాని ఆయన కొక్కకానీ ఇవ్వటం ఇష్టంలేదు. మానాన్న

పట్టుబట్టల దగ్గర్నించీ మాబలవంతంమీదే ఇచ్చాడు" అంది నాభార్య.

దానిమాటలకేంకాని లాంఛనాలు బాకీకింద రావు. పోగానే నివ్వతేలిన అసలు రొండువందలయాభై. అందుకు వడ్డీ! బారువడ్డీఅయితే కొంత తేలికగా పోను. ఎంతో ఆలోచించినమీదట ఒకఉపాయం తోచింది. మూడేళ్ళూ గడువు దాటుతున్నదనంగా నోటుమీద ఓ అయిదురూపాయలు చెల్లువేస్తే నోటుప్రాణం నిలుస్తుంది. నేనుకూడా అయిదయిదులుచెల్లువేస్తే బారువడ్డీతో సరిపోతుంది. ఈఉపాయం చాలాబాగుంది. ఈప్రకారం లెక్కవేసి బాకీ పాతికతక్కువ వెయ్యిరూపాయలకు దించాను. ఇంతవరకు నాన్యాయదీక్షకు భంగంలేదు. కాని ఈకరువుకాలం వెయ్యిరూపాయలెక్కడదొరుకుతై? దీనికూడా ఒక్కటేఉపాయం ఉంది. ఈమొత్తం అయిదారుకిస్తీలుగా కడితేసరి.

అయితే ఇప్పుడు రొండువందలరూపాయలు కావాలి. అంతమొత్తం ఏట్లా పుట్టిద్దామా అని ఆలోచన చేశాను. వచ్చేసంవత్సరంనించీ పంటలోనించి ఇవ్వవచ్చును. ప్రస్తుతం ఇల్లాలిమెళ్ళో నగ ఏదైనా అమ్మి ఇప్పటికి సరిపెడదా మనుకున్నాను. అందుకని నాభార్యను మెళ్ళోకంటె ఇయ్యమన్నాను. వాళ్ళనాన్న బాకీ తీర్చటానికేగనక తప్పకుండా ఇస్తుం దనుకున్నాను. కాని ఇవ్వనంది. ఎట్లా గన్నాను. సోదడగమంది. నాకు మండి- మర్నాడు నగలుతీసి పెట్టెలోపెట్టి ఆవిడ దొడ్లో తలంటిపోసుకుంటున్నసమయంలో కంటెకాస్తా తీసి ఒకకంసాలిదగ్గిరికి తీసికెళ్ళి అమ్మజూపాను. వాడు దాన్ని అన్నిపరీక్షలూచేసి నూటయాభై ఇస్తానన్నాడు. మూడొందలుపెట్టి చేయించిన గట్టికంటెను నూటయాభైఏమిటి? నే నమ్మనన్నాను. పోలీసునుపిలవనా అన్నాడు. ఇప్పుడు పోలీసును పిలిస్తే ఈసంగతికాస్తా వాడు నాభార్యకు తెలియచేస్తాడేమో, అమ్మినతరవాత ఎవరేంచేసేదిలేదులే అని నూటయాభై తీసుకుని ఈసారి క్విటే మనియార్డరు చేద్దామని ఆ డబ్బుపట్టుకుని పోస్టాఫీసుకువెళ్ళి చాతయినవాళ్ళచేత అదిమామగారికి టపాచేయించి ఆరోజునే ఈవిధంగా ఉత్తరంరాశాను. ఆయన పెద్ద హైరివేటుకనక సంతోషిస్తాడని నాలుగువ్యవహారంముక్కలుకూడా విసిరాను.

"బ్రహ్మశ్రీ వేదమూర్తులైన శంకరయ్యమామగారి దివ్యసముఖమునకు మీఅల్లుడు పదివేలనమస్కారములు చేసి వ్రాసుకున్న ఉత్తరం. లోగడ నేను మీవద్ద ఆన 1917 వ 7 జనేవరితారీఖ్ను మూజువాణీగా అప్పు పుచ్చుకున్నరొక్కం రు 250 లు అక్షరాల రొండువందల యాభైరూపాయలు ఇందుకువడ్డీ నెల 1 కి నూటికి ఒకరూపాయిచొప్పున చెల్లలు పాతికరూపాయలుపోను ఈనాటికి నేను మీకు ఇవ్వతేలినబాకీ యావత్తూ కలిసి వెరశిమొత్తం రు 975 లు అక్షరాల తొమ్మిదివందల డెబ్భైఅయిదు రూపాయలు అయిదు సంవత్సరాలమీద దఫాలుగా ఇవ్వడానికి ఒప్పుకున్నాను గనుక యీదఫాకు దామాషాగా రు 150 లు మింజుమలె ఈరోజున నేను మీపేర మనియార్డరు చేయించినాను గనుక అది అందినసంగతి వెంటనే తెలియచేయవలెనని ప్రార్థించుచున్నాను. ఇంతే సంగతులు. ఇక్కడ అంతా క్షేమం మీక్షేమం. తరుచు వ్రాయించగలందులకు ప్రార్థించుచూ యున్నాను. మీఅమ్మాయి క్షేమముగా నే యున్నది. అత్తగారిని అడిగినానని చెప్పవలెను. ఇట్లు, విధేయుడు..."

మూడోరోజున మామగారిదగ్గిరనించి ఉత్తరం వచ్చింది. దాన్లో డబ్బందినట్టు రాయలేదుకాని తనకు నేను బాకీఉన్నమొత్తం 1500 అన్నట్టు జ్ఞాపకం అనిమాత్రం రాశాడు మరి ఆయన ఏలెక్కప్రకారం వేశాడో!

ఈలోపల — ఈలోప లేమిటి? ఆరోజునే — నాభార్య నగసంగతి కనుక్కున్నది. వాళ్ళనాన్నకు ఉత్తరం రాశిందికాబోలు, నాలుగోరోజున ఆయన మళ్ళీ ఇంకోఉత్తరం రాశాడు. ఈసారి మాటలు చాలాఘాటుగా దొర్లినై. "ఇదేమి టయ్యా! నీసుంపతెగ! మాపిల్లకంటె కాస్తా అమ్మేశావుట. అక్కంటె వెంటనే కక్కుతావా? నీమీదదావా వెయ్యమన్నావా?"

నాకు దావాలంటే భయమేకదా! ఏంచెయ్యను. ఒకవడ్డీ వ్యాపారంచేసే ఆయనదగ్గిరికిపోయి నూట యాభైరూపాయ లప్పియ్య మన్నాను. ఇందుకు వడ్డీ నెల 1 కి అనేచోట రూపాయి తొమ్మిదణాలు వెయ్య మన్నాడు. ఆశ్చర్యపడి ఎందుకన్నాను. నెలకు రూపాయికి కానీ అన్నాడు. సరేకదా అని ఆప్రకారమే రాసి రూపాయలుతీసుకుని కంసాలిదగ్గిరికి వెళ్ళాను. వాడు కంటె అప్పుడే పోయిందన్నాడు. నాకు కళ్ళనీళ్ళుపర్యంతమైంది. వాడు జాలిపడి రెండొందలిస్తే ఇస్తానన్నాడు. లేకపోతే పోలీసుకు చెబుతాడని నేనే గ్రహించుకుని మళ్ళీ అప్పిచ్చినాయనదగ్గిరికి పరిగెత్తాను. ఇంకో యాభై రూపాయ లియ్యమన్నాను. నోటు రాయమన్నాడు. వడ్డీ ఈసారి రూపాయి పద్నాలుగణాలన్నాడు ఏలెక్కప్రకారం అన్నాను. ఆయన నవ్వి రోజుకు నూటికి అణా అన్నాడు. సరే తెమ్మన్నాను. ఆడబ్బుకూడాతీసుకుని కంసాలిదగ్గిరికి పోయినాను. వాడాడబ్బు జాగ్రత్తగా లెక్కపెట్టి దాచి నాచేతికి కంటె ఇచ్చాడు. అనగ చూడగానే నాదుఃఖం ఆగలేదు. బంగారమంటికంటె పదిముక్కలై ఉంది!

—కొడవటిగంటి కుటుంబరావు.



# అంతరము

విగతమోహోజ్జ్వలస్నృతి వీథియందు
దృష్టి నిగుడించి కాంచ యత్నించు నీదు
లలితతేజఃప్రభావ సంకలితమూర్తి
నాటికిని నేటి కెంతయంతరము కలదొ!

* * *

ప్రవిమలోషస్సుకంటెను బ్రవిమలమ్ము
మాతృవాత్సల్యమునకంటె మాన్యతరము
అచలధ్రువతారకంటెను నచలమైన
యామహామూర్తితో సామ్యమగునె నీకు?

* * *

అఖిల రాజన్యమూర్ధ విన్యస్త పాద
పంకజోద్యద్యశోమోదభరితదిఙ్ని
చయుఁడవగు నీకు నీకృష్టవ్యవస్థ
సంభవించుట మిగుల లజ్జాప్రదమ్ము

* * *

దవ్వుదవ్వుల నుత్కృష్టతరవికాస
భాసురంబైన దివ్యవిభాప్రతతికి
దోసిలి ఘటించి యొక్క కదుష్ణబాష్ప
కణము విడిచిన ధన్యతఁ గాంచఁగలవు.

* * *

ఆమహార్చిస్సునుండియే ఆంధ్రపుత్ర!
కిరణమొక్కటి నీపై వికీర్ణమగును
గాన నీ వొకవ్యక్తివై కానుపింతు
వింతకును నీయుపజ్ఞ యావంత లేదు.

—అయినంపూడి గురునాధరావు.
(ఉభయభాషాప్రవీణ)

# చుక్క

౧

తాలిమిపట్టుదప్పి పరదాలయి గప్పిన నీలిమబ్బు బం
దాలను ద్రోచివచ్చి యెడదన్ బెనవైచిన రాగదీప్తులం
గ్రోలిన నీకటాక్షములలో తళుకుల్ గురిపింతు, వీ యనం
తాలయవీధి వ్యర్థమిది ఆతడు లేని యమాసచీకటిన్ !

౨

కాటుక పుక్కిలించి మనకల్ మునుగుల్ గొనియున్న యీనభో
వాటిక ప్రాణముల్ కనులబట్టి నిరీక్షణలోన; ఆతడే
పాటునదగ్గరించి చలువల్ విదిలించెడి మొల్కనవ్వు వ
న్నీట గరంచునంచు గమనించితి ? ఎంతటి ముద్దరాలవే !

౩

తెలియవుగాసినీవు ; పలుతెర్వుల నాతని గాచియున్న, క
ల్వలపయి మోజు మిక్కుటము వానికి; చక్కనివాడె, యైననున్
నెలనెల గండ మట్టిమగనిన్ బడిమాటికి దేవురించినం
గలదె ఫలమ్ము ? నీమనసునచ్చినవాని వరింపు మన్యునిన్ !

౪

వలపు నిండిన యెడద మబ్బులమరుంగు
జిక్కుకొనవేల ? చక్కని చుక్కవవని
నెందరెందరో కలరు ప్రేమించువారు
ప్రకృతి లలితసౌందర్యలాలసులు కవులు !

—బొడ్డు బాపిరాజు.

# ఒలింపియస్

## ౧

"నాయనా, అలెగ్జాండర్, నీతండ్రి నేటికి తిరిగి ఇంటికివచ్చినాడు. నానాదేశములను జయించి, ధనము దోచుకుని కీర్తిచంద్రికలు త్రోవజూప పురప్రవేశముగావించినాడు. అలెగ్జాండర్, సంతోషించుచుంటివా? ఎంతటివెర్రివాడవోయి! తండ్రి దిగ్విజయములను విని సంతోషించుచుంటివి. కాని అతని విజయములు నీమరణ చిహ్నములని నీవు తెలిసికొనలేకున్నావు."

"తల్లీ అదేట్లు? యుద్ధముచేయుట వీరపురుషోచితము. నాతండ్రి వీరుడు. యుద్ధములందు గెలుపొంది జయలక్ష్మినిగైకొని వచ్చుచున్నాడు."

"నాచిట్టి తండ్రీ, ఎంతటి అమాయకుడవు! కనుకనే నీతండ్రినిన్నింత సులభముగ నాశనముచేయదలచినాడు. అలెగ్జాండర్, నీవింకను పసికూనవుకాదు. కండ్లువిప్పి చూడుము. నీతండ్రి దేశదేశములను జయించుచున్నాడని విర్రవీగుచున్నావు. దేశములన్నియు జయింపబడినపిదప నీవు రాజువై ఏమిచేసెదవు? నీకు దండెత్తుటకు దేశములుండవు. జయించుటకు రాజ్యములుండవు. ధైర్యస్థైర్యములను చూపుటకు యుద్ధములుండవు. చేతులు ముడుచుకొని అబలలాగు రాజ్యము చేయనెంచితివా? కుమారా; కన్నకడుపగుటచేత ఇంతగ చెప్పుచుంటిని. నీతండ్రి నిన్నేమిచేయుచున్నాడో నీవు తెలిసికొనలేకున్నావు. నిన్నతడు అరిస్టాటిలు వశమునందుంచిన దెందుకో తెలిసికొంటివా? ఒక శుష్కపండితునిగ తయారుజేసి రాజ్యానర్హునిగచేసి మూలకూర్చుండబెట్టుటకు క్లియోపాత్రా కుమారుడైన ఆ చంటివెధవకు రాజ్యమును ధారపోసి ఒలింపియస్ కుమారునిట్లు చేసితినిగదాయని కులుకుటకు. ఈమాత్రము గ్రహించలేవా? నీవు ఒలింపియస్ కుమారుడవు కాదా?"

"తల్లీ చెప్పుము, చెప్పుము. మేఘములు విచ్చిపోవుచున్నవి. నాతండ్రి దురంతములు నాకిప్పుడు గోచరించుచున్నవి."

"గోచరించి లాభమేమి. ముందు నీతండ్రి జయప్రవాహము నాపవలెను. లేనియెడల నీజీవితమే వ్యర్థమగును సుమా"

"తల్లీ బాలుడను. ప్రబలసైన్యసమేతుడయిన ఫిలిప్పు కాలి గోనగోటికైన తాకగలనా? ఏమిచేయువాడ?"

"కుమారా సామాన్యునివలె మాటలాడుచుంటివి: నీవు ఒలింపియస్ కుమారుడవుసుమా. ఏమిచేయగలవా? నీకు నీతల్లిబాసటయై నిలువ నీవేమి చేయలేవు? అలెగ్జాండర్, నీతండ్రి నన్నెన్ని యిడుముల గుడువజేసెనో నీవెరుగవు. వివాహమయినదివెందలింతవరకును ఇంటిపట్టున పట్టుమని పదినాళ్ళయిన ఉండియెరుగడు. ప్రథమావస్థయందు తనరాజ్యాభివృద్ధికై కాలమునుగడిపెను. ఇప్పుడితర రాజ్యముల నాక్రమించుకొనుటలో గడుపుచున్నాడు. ఈ జయించుటయందున్న సంతోషమేమో! ఇల్లనిలేదు; వాకిలనిలేదు; భార్యయనిలేదు; బిడ్డలనిలేదు. చీమచిటుక్కుమన్న దండయాత్రకు తయారు. తిరిగి యేనాలుగయిదు సంవత్సరములకో పునర్దర్శనము కుటుంబము మాటయే తలపునకురాదు. కుమారా, అధికారతృష్ణగల మనిషినిచెట్టబట్టుట శోకదేవత నాలింగనము చేసికొనుటయే! నీతండ్రిని వివాహమాడి నాజీవితమును దుర్భరతరదుఃఖ సాగరముగ జేసికొంటిని ఎందులకీగాంపత్యము? ఏమిటి. దీనివలన నేపొందెడిసుఖము? కాని నన్నిట్లు కష్టపెట్టుచున్న యీ దుర్మార్గుడు ప్రతిఫలము అనుభవించక పోరాదు. ఈ స్త్రీ తనసుఖము నితరులకొరకు ధారపోయునంతటి పిచ్చిదికాదు. తనజీవిత తంత్రులను తెగగొట్టినక్రూరుని క్షమించునంతటివెర్రిదికాదు. నాహృదయమునందు చెలరేగుచున్న యీభయంకరాగ్ని జ్వాలలు నీతండ్రిని దహించకమానవు."

"తల్లీ, తల్లీ, యేమనుచుంటివి? ఔను, ఔను. ఎంతటిదుర్మార్గుడు నాతండ్రి! మనలనిద్దర నొకే బాణమున గురిచేయుచున్నాడు. చూడుము తల్లీ, నన్ని అరిస్టాటిలు బానిపడవేసి తనదారిని తానుపోయెను. ఇతడు నాపాలిట యమదూతవలె ప్రవర్తించుచున్నవాడు. కాలుకదుపుటకు వీలులేదు. పుస్తకములమధ్య బుర్ర బ్రద్దల గొట్టుకొనుచు కూర్చుండవలెను. సైనికుల మధ్య కూర్చుండి, వారికోలాహలములను వినుచు, ఆనందించవచ్చును గానిఈ మూగపుస్తకములమధ్య మూగనై నే కూర్చుండలేను. కాని కూర్చుండకతప్పదు. తల్లీ, నాతండ్రియుద్దేశము నన్నొక శుష్కపండితునిగ చేయవలయుననిగదా! నాకర్మను నిర్ణయించుట కితడెవ్వడు? నాపాలిట దైవమా? మృత్యువా? చూచెదనుగాక!" అలెగ్జాండరు ఆవేశము నాపుకొనలేక గుప్పిళ్ళను బిగబట్టి మాటాడజొచ్చెను. ఇనుము ఎర్రగకాలినప్పుడే సమ్మెటదెబ్బ పడవలయునని నిశ్చయించి ఒలింపియస్ యిట్లనెను.

"తండ్రీ శాంతివహించుము. జయాభిలాషులు శాంతియుతులై యుండవలెను. త్వరపడినవారికి జయము లభించనేరదు. కాని మనము సమయమునకై వేచియుండవలెను. నాకు సహాయముచేయుటకు నీవు సదా సంసిద్ధుడవై యుండుము. యశస్కాముడవైనచో ప్రథమమున నీదారినుండి నీతండ్రిని తొలగించుకొనుము. లేదేని నీకు భావిభాగ్యోదయము సున్న. సూర్యుడు తేజోమయుడై వెలుగుచున్నంతవరకు నక్షత్రములు ప్రకాశింప నేరవు. సూర్యుడస్తమించి నప్పుడు గదా వాటి విలువతెలిసెడిది."

తల్లీ నాకంతయు విశదమైనది. నాతండ్రి నన్ను సింహాసనమునుండి పడద్రోయుటకై చేయుచున్న ప్రయత్నములన్నియు నాకన్నులకుకట్టి నట్లగపడుచున్నవి. అతడు నాకుతండ్రికాడు. నీకుభర్తగాడు. మృత్యువే మనుష్యరూపమున మనలనుపట్టుకొని వేధించుచున్నది. తల్లీ నేను సిద్ధముగనున్నాను. అన్నిటికిని సిద్ధము. ఆజ్ఞనిమ్ము. "ఎందుకు"; అని ప్రశ్నించకుండ నెరవేర్చెదను."

"కుమారా, అట్లుండవలెను. తండ్రిని నమ్మి చెడినవారుందురు కాని తల్లిని నమ్మి చెడినవారెందయిన గలరా? నీకు నేటికిబాగుపడు లక్షణములబ్బినవి. నేను వలపన్నెదను. నీవు నాకు బాసటగా నిలువుము, పిట్ట చిక్కక యేమవునో చూచెదనుగాక!"

ఫిలిప్పు మాసడోనియా దేశపురాజు. పేరెన్నికగన్న రాజులలో కెల్ల శ్రేష్ఠుడు. అరిస్టాటిలుతో చెలిమిచేసి అతనిని తనకొలువు నందుంచుకొని అతని సలహాలపై తన రాజ్యాంగ నిర్మాణమును గావించినాడు, హీన మానవ సంవాసితమైన మాసడోనియా దేశమును పైకి తీసుకొనివచ్చి పేరుపెందినవాడు ఫిలిప్పు. ఇతడు తన రాజ్యాంగ విషయమేగాక తన కుమారుడును, తన తరువాత సింహాసనమధిష్టింపవలసిన వాడునైన అలెగ్జాండరు విషయముకూడ కడుశ్రద్ధ వహించియుండెను. అరిస్టాటిలువంటి మేధావులచే అతనికి చదువు చెప్పించెను. అతనికి 16-సంవత్సరములు వచ్చునప్పటికె చిన్న చిన్న సైనికదళము కధిపతినిగాజేసి, యుద్ధపరిచయము గావించినాడు.

ఇట్టివాడైన ఫిలిప్పునకు సహితము దుర్గుణములు లేకపోలేదు. అతడు త్రాగుబోతు వీలుచిక్కినపుడెల్ల త్రాగి తందనాలాడెడివాడు. ఒకానొక త్రాగుబోతు పార్టీయందు తనస్నేహితుని దూషించిన అలెగ్జాండరుపైకి కత్తిదూసి, సారాయిమత్తువలన నిలువలేక తూలిపడిన తండ్రినిగాంచి, అలెగ్జాండరు యిట్లువచరినాడు. "ఓ మాసడోనియదేశస్థులారా? యూరోపునుండి ఆసియావరకు తనజయదుందుభిని మ్రోగింప జూచుచున్న మీసర్దారు నాయకుడడుగో? చూడుడు. ఒకమనుష్యుని దగ్గరనుండి మరియొక మనుష్యునికడకు ప్రయాణము చేయలేక క్రిందపడి మన్ను తినుచున్నవాడు."

## ౨

ఫిలిప్పు భార్యయైన ఒలింపియస్ రాజప్రాసాదములోని తనగదియందు కూర్చుండి దీర్ఘముగ నాలోచించుచుండెను. ఆమె ఇపిరస్ దేశపురాజు కుమార్తె. ఆమె మాంత్రికురాలు. ఆమెచుట్టును పెంపుడు పాములనేకములు బుసలుగొట్టుచు తిరుగుచుండెను. పైకెగ

బ్రాకీ ఆనాగములు ఆయొలనాగను తమ రెండురెండు నాలుకలతో మాటిమాటికి ముద్దిడుకొనుచున్నవి. ఆమెయు, తనయొక్రని పెదిమలపై చిరునవ్వు చిందులాడ ఆపాములను తనచేతులతో నిమిరి ముచ్చటలాడు చుండెను. ఇట్టి దృశ్యములను చూచియే ఫిలిప్పు ఒలింపియస్ ని యేవగించుకొనుచుండెడివాడు. అతడా చైదములుచూచి భయకంపితగాత్రుడై, ఆమె దగ్గరకు పోవుటకే కంపించిపోవుచుండెను. అతడేకాదు. అతని ప్రజలయం దెక్కువభాగము ఒలింపియస్ పేరుచెప్పినంతనే హడలిపోవుచుండిరి. ఆమాంత్రికురాలు మాసిడోనియా దేశస్థులపాలిట మృత్యువై తమరాజును పట్టుకొని పీల్చి పిప్పిచేయుచున్నదని వారిభయము. ఆమె సర్పములరాణియనియు, రాత్రులయందామె సర్పవేషధారిణియై సర్పములతో సయ్యాటములు సల్పునని యు, వారుకట్టుకథలను కల్పించి చెప్పుకొనుచుందురు.

ఈ కట్టుకథలుకూడ ఫిలిప్పుచెవులను సోకినవి. అతనికామె కాలసర్పమువోలె కనబడజొచ్చెను. తనప్రాసాదమంతయు పాముల మయమైనట్లును, అవి తన్ను చుట్టుముట్టి కాటువేయ కాచుకొని యున్నట్లును అతడు కలలను గాంచుచుండెను. శత్రుబలములను గడగడలాడించగల్గిన యీవీరుడు తనభార్యపేరు విన్నంతనే వడకి పోవుచుండెను. చాటుమాటుగ ఆమెనుదూషించినను యెదుటబడి యేకార్యమును చేయజాలకుండెను. ఆమెకోరిన ప్రతికోర్కెను నెరవేర్చ అతడుసుద్యుక్తుడగుచుండెను. కాని అతని హృదయము నందొకశక్తి మాత్రము ఒలింపియస్ నుండి తొలగిపొమ్మని బలవంతపెట్టుచున్నది. అందుచేతనే అతడు క్లియోపాత్రాయను నామెను వివాహమాడెను. అప్పటినుండి యీ భార్యభర్తలమధ్య విరోధము మరింత ప్రబలమాయెను.

ఫిలిప్పు తనను ప్రేమించుటలేదని తెలిసికొనినప్పుడే ఒలింపియస్ తనకు పనికిరాని భర్త నీలోకమునుండి సాగనంప సమకట్టెను. అతనిమీద లేనిపోని కొండెములను అలెగ్జాండరుతో జెప్పి ఆ తనిమనస్సును త్రిరుగదీసి తన స్వాధీనము జేసుకొనెను. ఫిలిప్పు దేశాంతరగతుడై నప్పుడు ప్రజల కతనిమీదనున్న గాఢవిశ్వాసమును పోగొట్టుటకై నానావిధ ప్రయత్నములను జేసెను. చాటుమాటుగ యింటి గుట్టంతయు తన కన్నవారింటికి పంపి వారిని తనభర్తప్రాణములను హరింప ప్రేరేచెను. పూర్ణజయాభిలాషుడైతిరుగు ఫిలిప్పు యీ కుట్రలను కనిపెట్ట లేకపోయెను.

## 3

"ఒలింపియస్, నీకింకను యీపాములగోల వదల లేదుగదా! నామాటలు వినవుగా? ఎందుకు నీకీపాములతో?" సుఖాసీనయైయున్న ఒలింపియస్ యెదురుగనున్న కుర్చీపై ఆసీనుడగుచు అనెను ఫిలిప్పు. ఒలింపియస్ తన తీవ్రకోపమును మరుగుపరుచుటకై మందస్మితయగుచు ఇట్లనెను

"ఫిలిప్, నీకీయుద్ధములగోల యెప్పుడువదలునో నాకీ పాములగోల అప్పుడు వదలును. గదియందడుగు పెట్టితివోలేదో అప్పుడే నాపాములనాడి పోసుకొనుచుంటివి! అవి నిన్నేమిచేసినవి? నీజోలికి రాలేదే! నీ వూసైనయెత్తలేదే"

"కాని అవి భయంకరములైనవి."

"నీ ఆయుధములకంటెనా? తోటి మానవునిరక్తమునకై నాలుకలు బారలుజాచు నీయాయుధముల కంటెనా? నాథా, యుద్ధరంగమున ధరించవలసిన యీ యాయుధములు భార్యదగ్గరకు వచ్చునప్పుడైన తీసి దూరముగనుంచి రాగూడదా? వాటిని నాముందు ప్రదర్శింపవచ్చితివా, లేక నాతో యుద్ధమాడ వచ్చితివా? ఆహా! ఎంతనిర్దయ." కన్నులనిండ నీరుంచి గద్గదస్వరముతో మాట్లాడెను. ఫిలిప్పు ఆదిచూచెను గాని అతనికి దయయుద్భవింపలేదు. అతడిట్లనెను.

"తన్వీ, కాలయాపనమగుచున్నది. నేనిప్పుడు సైన్యసమేతముగ గ్రీసుదేశమునకు దండెత్తిపోవుచుంటిని. ఒకగంట ఆలస్యమగుచో నాతలపులన్నియు వ్యర్థములౌను. నేనింతవరకు చేసినపనులన్నియు నాశనమౌను. నీవేల కబురంపితివో త్వరగ జెప్పిన వినిపోయెదను. సత్వరముగ తెలియజెప్పుము."

ఒలింపియస్ కోపమునటించుచు కనుబొమ్మలు బిగించి యిట్లనెను.

"నాథా, నీకేకాదు నాకును తొందరపనులున్నవి. నాపాపములు నాకొరకై యెట్లు నిరీక్షించుచున్నవో చూడుము. అవెట్లు నన్నురమ్మని మాటిమాటికి నాలు కలుచాచి పిలుచుచున్నవో! నేను చెప్పదలచినది మూడు మాటలలో ముగించెదను. పిమ్మట నీదారిని నీవు పోయెదవుగాని; నాదారిని నేను పోయెదను. మరణమున కెన్నిదారులున్నవో కాలమును వెళ్ళబుచ్చుటకు నాకన్ని దారులున్నవి."

ఫిలిప్పు భయకంపిత గాత్రుడై సర్పములను తదేక ధ్యానముతో జూచుచు నిలబడెను. యుద్ధరంగమున శత్రుసేనలమధ్య ప్రళయ తాండవమాడు వీరుడీ వనితముందు నీరవుడై, నిశ్చేష్టుడై, నిలబడెను. ఒలింపియస్ అతని నోరగంటగాంచి తన సంభాషణమును సాగించెను.

"ఫిలిప్పు, నేజెప్పబోవునది నీకంత అవసరమైనది కాదు. అదియునుగాక నేనీ సంగతి యిదివరకే నీతోడ ముచ్చటించియుంటిని. మనకుమార్తెను నాతమ్మునకీయ నిశ్చయించుకొంటిమిగదా! అతడిప్పుడు నన్ను త్వర పెట్టుచున్నాడు. ఆతడు వీరుడు. అతనిపేరు విన్నంతనే మాదేశమంతయు గడగడలాడి పోవును. అట్టి వానికి—"

"ఒలింపియస్, దీనికింతయుపోద్ఘాతమేల? నేను నీతమ్ముని, నీకుటుంబమును ఎరుగనివాడనుగాను. నీ మాట కడ్డుచెప్పువాడను కాను. ఈసంబంధము నాకు పూర్తిగా యిష్టము. ఈసంగతి చెప్పుటకేగదా నీవు నన్ను పిలిపించినది? సరే మంచిది. నాకిప్పుడు తొందర పనులున్నవని చెప్పితినిగదా! నీవు సుముహూర్తము నిశ్చయించి కబురంపుము. నేనానాటికి వచ్చెదను." ఫిలిప్పు ఆమెచెంతనుండి తొలగిపోవ నుద్యుక్తుడాయెను.

"అదియే నేకోరునది. మిగిలిన సంభారములన్నియు నేను చేసుకొనియెదను. ఆనాటికిమాత్రము నీవుతప్పక రావలెను. మరువవలదు. ఆనాడురాక, యేవో సాకులు చెప్పజూచిన నేను సహించను తెలిసెనా?" ఆమె చూడ్కులు దుర్మార్గమును వెల్లడించెను. మాటలు హాస్యరస ప్రధానముగ నుండెను. ముఖము తీవ్రరూపమును దాల్చెను ఫిలిప్పు ఇట్లనెను.

"తప్పకవచ్చెదను. లక్షపనులుండుగాక, రాక తప్పను! కాని నేనిక్కడ పెక్కుదినములుండ వీలులేదు. వివాహమయిన మరునాడే తిరిగి పోయెదను. గ్రీసుదేశమునందలి నాపనులన్నియు అప్పటికి పూర్తిగావు."

"అట్టులనే; వివాహదినమునందిచటనున్న చాలును. తరువాత నీయిష్టము ఎల్లప్పుడును యిల్లుకనిపెట్టుకొని యుండుమని అడుగునంతటి చాదస్తురాలను గాదు నేను."

"సరే, నేను వెళ్లుచుంటిని. సైన్యములు నాకొరకై వేచియుండును."

"మాటతప్పుట మాయింటియందు లేదని నీవు విర్రవీగుచుందువు. ప్రజలందరు మీకుటుంబమునందు నీవు సత్యసంధుడవని చెప్పుకొనుచుందురు."

"అవును, నేను మాసడోనియాదేశపురాజును."

"చూచెదము గదా!"

పులినోటినుండి బయటపడిన లేడివలె అతడా గది నుండి బయటపడెను. వెనుదిరిగి చూడక ఆ ప్రాసాదమును విడిచిపోయెను.

వెంటనే ఒలింపియస్ తనకుమారుడైన అలెగ్జాండరు కొరకు కబురంపెను. దీర్ఘముగ నాలోచించుచున్న ఆమెదరికి సర్పములు పోవెరచి దూరమునుండియే గ్రుక్కిళ్లు మ్రింగుచు ఆమెవైపు చూచుచుండెను. పదిపది హేను నిమిషములకు అలెగ్జాండరు వచ్చెను. అతనిపదముల చప్పుడువిని ఆమె మేల్కాంచి ఇట్లాదరించెను

"అలెగ్జాండర్, ఇటురమ్ము; ఇటుకూర్చుండుము. సంతోషవార్త యొకటిచెప్పెద వినుము. ఏర్పాటులన్నియు సక్రమముగా జేసితిని. నీసోదరి వివాహమునకు ముహూర్తము నిశ్చయించుటయే మిగిలియున్నది. ఆనాడే ఆముహూర్తముకూడ, ఆనాడుతప్పక వచ్చెదనని నీతండ్రి బాసజేసిపోయెను. అతడాడిన మాట తప్పడు. ఆనాటి సందడిసమయమున మనము మనపనిని నిర్వర్తించవలెను. ఈసంగతి యీదినమే మీ మేనమామలకు కబురెళ్ళవలెను. వారితో అన్నియు నిదివరకే విశదముగ చెప్పియుంచితిని. నీవు సిద్ధముగ నుండుము. తీరా సమయమునకు తండ్రిగదాయని దయచూపవుగదా!"

"తండ్రియా? ఎవ్వడునాతండ్రి? తనకై నన్ను

నాతల్లిని నాశనముజేయువాడా నాతండ్రి? తన సుఖమునకై నన్ను దుర్భరదుఃఖమున ముంచువాడా నా తండ్రి? నా భుజబలమునుచూప వీలులేకుండ అన్ని దేశములను జయింపదలచినవాడా నాతండ్రి? కాదు; కాదు; ముమ్మాటికినికాదు. అతడు నాతండ్రి కానేరడు. అతని నాశనమునకై నేనెట్టిపనినైన చేయబూనెదను తల్లీ ఆజ్ఞనిమ్ము. నీయాజ్ఞను తలదాల్చి నెరవేర్చెదను. నాకీప్రపంచమున నీకంటె కావలసినవారెవ్వరున్నారు?"

"నాయనా, నన్నుద్ధరించుటకు పుట్టుకొని వచ్చిన బంగారపుకొండవు. అవును. నీతండ్రి తనసుఖమునకు నిన్నాహుతి చేయ ననుమానించవప్పుడు నీసుఖమునకై నీ వాతనిని మట్టుపెట్ట వెరచుటకు పిరికిపందవా? నీకు మాత్రము మానాభిమానములులేవా? నీకుమాత్రము అధికారతృష్ణ, జయాభిలాష, లేదా? నీలోప్రవహించు రక్తముమాత్రము అతనిలోప్రవహించురక్తము కాదా? ఆమాత్రము, ఆమనిషి ఆలోచించుకొనలేడా?"

"తల్లీ, అవును. నాశరీరము భగ్గుభగ్గున మండుచున్నది. నేనిది భరించలేను. నీయాజ్ఞకై వేచియున్నవాడను, ఏమిచేయుటకైనను సంసిద్ధుడను."

"నాయనా, అలెగ్జాండర్, నేటికి నేను వీరమాతనైతిని. నేటికి నాజన్మసార్థకమైనది. నీవు తక్షణము పోయి నీ మేనమామలను కలుసుకొనుము. పెండ్లి ఇక పదిహేనురోజులకనుము. పెండ్లినాటిముందు రాత్రి యుద్ధసన్నద్ధులై నగరమున ప్రవేశింపుమనుము. మిగిలిన కార్యమును నెరవేర్చుటకు నేనుంటినిగదా! ఆరాత్రియే మనము విషయనిర్ధారణ చేసికొందము. నీవు తక్షణము పోవలయును."

"శలవు. నీయాజ్ఞను శిరసావహించెదను. నన్ను నీయిష్టము వచ్చినట్లుపయోగించుకొనుము."

"నాయనా యెంతమాట! నేపడు యీకష్టములన్నియు నీకొరకేగదా." మేను నిమురును.

అలెగ్జాండరు నిష్క్రమించెను. ఆ నారీపిశాచి వికటాట్ట హాసముచేసెను. సర్పములన్నియు బిరాన అరుగుదెంచి తమస్నేహితురాలను చుట్టుముట్టినవి. "కార్యముగట్టెక్కినదా? విషము తలకెక్కినదా," యని ప్రశ్నించుచున్నవి కాబోలు!

## ౪

వివాహము అతివైభవముగ జరిగెను. మద్యపానమునందు మునిగితేలుచు, చుట్టపక్కములా రోజుగడపిరి. ఫిలిప్పు ఆనాడు తనభార్యయొక్క దివ్యమంగళసుందర విగ్రహమునుజూచి అమితానందమును బొందెను. "ఆమె ఫిలిప్పుగారిభార్య," అని చెప్పుకొను వారినిగాంచి అత డున్మత్తుడయ్యెను. కాని అతని కాదినమునందొక సారైనను అలెగ్జాండరు అగుపడలేదు. కుమారుని కొరకు రాజుగారు రెండుమూడు పర్యాయములు కబురంపెను "అలెగ్జాండరేమయినాడ"ని, అరిస్టాటిలు నడిగెను. అతడు, "రాజా, కొద్దిరోజులనుండి నీకుమారుడు మతిభ్రమించినట్లు తిరుగుచున్నాడు," అని చెప్పెను. తండ్రి, "పిల్లవానికి తిరుగుడెక్కువయినది" ని మనస్సునందనుకొనెను.

ఫిలిప్పు ఆనాటిరాత్రి నాటకశాలకు వెళ్ళవలెనని క్లియోపాత్రాతో చెప్పెను. ఈమాటలకామె యుల్లము తల్లడిల్ల, యిట్లనెను. "నాథా, నేడు నేను చెడుకలలను గంటిని నన్ను, మిమ్ములను, మనచంటివానిని శత్రువులు చంపివేసిరి. అదృశ్యమునకు నామనస్సు చెదిరిపోయినది. ఈరాత్రి మీరెక్కడికిని పోవలదని నేను కోరుచున్నాను. వివాహమైనదాది మిమ్ముల నెట్టి కోర్కెను కోరియెరుగను. ఈ నాకోర్కె, పిచ్చిదోమంచిదో, నెరవేర్చరా?" భార్యమాటలను త్రోసివేయజాలక అతడా నాటికేయి యింటివద్దనే గడుప నిశ్చయించుకొనెను. అదిచూచి అచటనేయున్న ఒలింపియస్ యిట్లనెను. "క్లియోపాత్రా నీదంతయు విపరీతము నాటకశాలకు పోయివచ్చునప్పటికి నీభర్తగారరిగిపోదురు కాబోలు! లేక యీలోపుగనే ఆయనను శత్రుసైన్యములు ముట్టడించునాయేమి? నీకంతభయముగనున్న ఆయనవెంటనే జని అపాయములనుండి కాపాడెదను లెమ్ము' సరియేనా?" అనిచిరునవ్వుతోడ, సంతోషమును పురికొల్పురీతిని, మాటలాడెను. "క్లియోపాత్రా, యీసంగతి ప్రజలువిన్న ఫిలిప్పు పిరికి

పంద; భార్యమాటలను విని బైటకు రావెరచినాడు. ఈ వీరాగ్రేసరుడా, మారాజ్యము నభివృద్ధిచేయునది అని హేళనచేయురా? అదియునుగాక యిపుడు ఫిలిప్పునకు రాగల ఆపదయెద్ది? ఆయనను పొడగాంచినంతనె ప్రతివాడును భయభక్తులతో మోకరించును. అట్టి యెడ యెవరాయనకు కీడొనర్పతల పెట్టెదరు? ఒకవేళ అట్టిది సంభవించిన ఫిలిప్పు చేతగానివాడా, యెవ్వరో యేమో చేయుదురని వెరచుటకు? ఇంతకు నాకుమార్తె వివాహముచూచి ఆయనసంతోషించుట నీకిష్టములేదు.''

క్లియోపాత్రా మరుమాట నుడువనేరక మౌనము వహించెను. కన్నులనిండ నీరుంచి ఒలింపియస్ ఫిలిప్పునకు వినబడునట్లు యిట్లు Soliloquy మొదలిడెను. ''ఫిలిప్పా, జగదేకవీరుడవు! ప్రపంచమునంత నుజ్జ్వాతజూపగల శక్తి సామర్థ్యములుగలవాడవు. ఒక్కస్త్రీ చేతులయందుపడి యెట్టివాడవైనావు! అహా, స్త్రీలబలలని వ్రాసినవారెట్టిమూర్ఖులు!'' ఒలింపియస్ మాటలకు సిగ్గుపడి ఫిలిప్పు, ''ఫిలిప్పు భయపడినాడు; భార్యమాటలను వినినాడు,'' అని తన్నుతాను నిందించుకుని నాటకశాలకు పోవ నుద్యుక్తుడాయెను.

సుఖసల్లాపముతో కాలముగడపుచున్న అతడు తనకు రాబోవు కీడును పసికట్టలేకపోయెను మిత్రులతోను, అనుచరులతోను, నాటకశాలకు బోవు సమయమున రాణిచే ప్రేరేపించబడిన సైనికుడొక డతనిని పొడిచివైచెను. అతడు నేలగూలుచు ''అలెగ్జాండర్'' అని కేకవేసెను. ప్రక్కనే పొంచియున్న అలెగ్జాండరు, ''ఇచ్చటనే యున్నాను; సమయమునకైవేచియున్నాన''ని చెప్పితనతండ్రిని తానొక పోటుపొడచెను. ''నీవుకూడనా—?'' అని ఫిలిప్పు ఆశ్చర్యమును వెలిబుచ్చెను. మరుక్షణమున అతని శరీరమునందు ఇరువది ముప్పది బాకులు దిగెను. విప్లవకారులు ''స్వేచ్ఛ, స్వాతంత్ర్యము, నిరంకుశ ప్రభుత్వము నశించినది,'' యని కేకలువేసిరి. అప్పుడట సమావేశమైన ప్రజలకు అలెగ్జాండ రిట్లుపన్యసించెను. ''మాసడోనియా దేశస్థులారా, నేటితో మీకంటకములు గట్టెక్కినవి. మీకొరకై నేను నాతండ్రిని బలి గావించితిని, నేటితో మీపాలిటి మృత్యుదేవతయైన ఫిలిప్పు అంతరించెను. మీకు సంపూర్ణ స్వాతంత్ర్యము చేకూరినది. అలెగ్జాండరు ప్రజాహితాభిలాషి. మీరునన్ను చూచి పారిపోకుడు. నేనీపని మీకొరకే చేసితినని చెప్పితినిగదా!''

అప్పుడచటకు ఒలింపియస్ ప్రవేశించెను. ఆమె వెనుక, ఆమెయనుచరులు క్లియోపాత్రాను, ఆమెచంటిబిడ్డతోడ యీడ్చుకొని వచ్చుచుండిరి. చంకనున్న చంటిబిడ్డ నొక పోటుసైనికుడు గుంజుచుండ, త్వరగ రమ్మని వేరొకసైనికుడు ''విడివడి వ్రేలాడుచున్న'' కేశములను బట్టి యీడ్చుచుండ, భోరుభోరున విలపించు క్లియోపాత్రావిగ్రహము గుండెలను చెదరగొట్టుచుండెను. అట్టియామెను ప్రజలకు చూపి, ఒలింపియస్ యిట్లనుడివెను. ''ప్రజలారా, మిమ్ములను నానా కష్టములకు గురిచేసిన ఫిలిప్పును సాగనంపితిమి. అతని నీదుర్మార్గమునకు పురికొల్పిన యీనారీపిశాచమీ భువినుండ మీకు మనశ్శాంతి కలుగబోదు. కాన యీదుర్మార్గురాలను, దుష్టుడైన ఫిలిప్పుయొక్క చిహ్నమైన యీబిడ్డతోడ, మట్టుబెట్ట నేను నాసైనికుల నాజ్ఞాపించుచున్నాను. (ప్రజలయందు కోలాహలముద్భవించును) ఓప్రజలారా, మేమీ పనులన్నియు చేయునది మీకొరకేయని మీరు విశ్వసింపవలయును. నేను నాభర్తను, నాకుమారు డతనితండ్రిని, పొగొట్టుకొన్నది మీకొరకేయని మరింకొకసారి చెప్పుచున్నాను. మీరు నాయాజ్ఞలకులోనై, ప్రవర్తించిన సుఖములు పడయగల్గుదురు. లేనియెడల మీరుకూడ నాకోపాగ్నికి గురికాగలరు. ఒలింపియస్ అన్న సామాన్యురాలని తలంచుచున్నారా కాబోలు! చూచితిరా, నాప్రబలసైన్యమును నాకు కావలసిన యిట్టి సైన్యములను లక్షలకొలది సృష్టించగలను. ఒక్కత్రుటిలో మిమ్ములను, మీపట్టణమును, భస్మీపటలము గావించగలను జాగ్రత్త'' ప్రజలకు ఆమె మాంత్రికురాలన్నమాట జ్ఞప్తికివచ్చెను. వారు నిశ్చేష్టులై నిలబడిరి; మిన్నకుండి వినుచుండిరి.

—త్రిపురనేని గోపీచందు, బి. ఏ.



# డాక్టరు ఆనిబిసెంటు

మిగలముగ్గిన పండు, బిసెంటుదొరసాని జర్జరిత దేహం విడిచిపెట్టింది. ఆమె అస్థికలను డి. కె. తెలాంగుగారు కాశీలో గంగలో కలిపారు. ఆభౌతిక దేహం యొక్క శేషం యిక లేశమైనా లేదు.

జీవన్ముక్తులే వొకరిద్దరో తప్ప తతిమ్మా గిట్టినవారంతా మళ్లీ పుట్టవలసిందే; కాని వారికి కాలనిర్ణయం చెయ్యలేము. అవ్వాడే కావచ్చు. కొంచెం నిడివి మీద కావచ్చు. వేల యేళ్లకు కవచ్చు. బిసెంటు మాత్రం యిప్పటికే యేభాగ్యవతి గర్భం లోనో ప్రవేశించి వుంటుంది. ఎంచేతనంటే? క్షణక్షణమూ ఆమె చెయ్యవలసిన పని చాలా వుంది. ఆపని ఆమే చెయ్యాలి; గాని మరి వొకరివల్ల కాదు. ప్రవర్థమానమైన మరో దేహం సంపాదించుకోడానికే ఆమె యీ బడుగు మేను విడిచిపెట్టింది; కాని మోక్షం కోసం కాదు. యముడికి లొంగిపోయి కూడా కాదు.

ఇంగ్లండులో పుట్టడం యిండియాలో గిట్టడం పుణ్యం వల్లనో, పాపం వల్లనో పాశ్చాత్యులకు అనేకులకు తటస్థించవచ్చు; కాని బిసెంటు మాత్రం యిండియాలో గిట్టడానికే యింగ్లండులో పుటింది. ఆపుట్టడం కూడా యిక్కడే కాగూడదా అంటే అవడం వస్తే యిలా జరగడం తటస్థించకే పోవును. ఏమంటే? ఇప్పటి హైందవ రక్తంలో పాశ్చాత్యరక్తంలో వున్నంత దార్ఢ్యమూ, పెంకితనమూ, కార్యదీక్షా, ఏకాగ్రతా లేవు. అవి వుంటేగాని యిప్పట్లో యిక్కడ కార్యక్రమం జరగదు.

1916 దాకా మనవారనేకులు రాజకీయోద్యమం సాగించారు. అయితే: విద్యాధికులు మాత్రమే ఏకొద్దిమందో అందులో చేరారు; కాని బిసెంటు రాజకీయరంగంలో ప్రవేశించి హోమ్‌రూలు మూవ్మెంటు లేవనెత్తింది. దానితో సేతువు మొదలు శీతాచలం దాకా పల్లెపల్లెకూ ఉప్పొందింది. దృఢమైన ఆపునాది వుంది కనకనే తరవాత తప్పుదారిలోనైనా గాంధిగారు వొక అంతస్థు వెయ్యగలిగారు.

బిసెంటు కాశీలో వేసిన సెంట్రలు హిందూకాలేజీ పునాది మీద మాళవీయ పండితుడు బ్రహ్మాండమైన హిందూయూనివర్సిటీని లేవనెత్తినాడు. ఆమె మన మదనపల్లెలో గూడా అలాంటి కాలేజీ నెలకొల్పింది. అయితే: దాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయంగా తయారు చేసుకోలేకపోవడం అలా వుండగా ఆరూపంలో నేనా మనం దానికి వికాసం కలిగించలేక పోయాం.

బిసెంటు ఉత్తరదేశంలో స్థిరపడి వుంటే ఔత్తరాహు లామె చేయూత మీద ఇంకా ఎంతెంతపను లేనా చేసి వుందురు. నిజానికి దాక్షిణాత్యులు ఆమెకి తగిన అనుచరులు కారు.

అయితే, ఆమె మద్రాసులో యెందుకు స్థిరపడిందీ అంటే ఆమె స్థిరపడింది కనకనే మద్రాసు యీస్థితికేనా రాగలిగింది. ఆమే యిక్కడ వుండకపోతే ప్రపంచకంలో అన్ని ఖండాలలోనూ, అన్ని దేశాలలోనూ వున్న గొప్పగొప్ప విద్వాంసుల దృష్టీ, సాధకుల ఆశలూ ప్రసరించడానికి మద్రాసులో యేం విశేషం వుందీ?


పోనీ: బిసెంటు సాహచర్యం వల్ల మద్రాసులో ముందుకు వచ్చిం దెవరు? మొదబట్టి మనల నెవరూ వెనక్కి పడగెంట లేదు. ప్రత్యేకంగా బొట్టుపెట్టి ఆమె కూడా యెవర్నీ పిలవలేదు; కాని సహజమైన ప్రగమనశీలతవల్ల అరవ లామె చాపిన చెయ్యి పట్టుకొని ప్రయోజకులైనారు. ఎక్కణ్ణుంచో వచ్చి మహారాష్ట్రులు కూడా అడయారులో ఉత్కర్ష పొందారు; కాని మన కేమీ అంట లేదు.

అయితే, వొకటుంది. మద్రాసు ప్రభుత్వం తనకి ప్రవాసశిక్ష విధించినపుడు న్యూయిండియాపత్రిక నడపడానికి అరవలలో ఆమెకి అర్హుడు కనపడ లేదు. ఇందుకోసం ఆమె డి. కె. తెలాంగు గారిని పనిబూని బొంబయినుంచి రప్పించింది.

అందులో ఆమె విశ్వాసం అపాత్రన్యస్తం కాలేదు. తెలాంగుగారి సంపాదకత్వంలో న్యూయిండియాకి పాఠకవలయం పెద్ద దయింది. పదవి అతిశయించింది. గౌరవం హెచ్చింది; కాని యే లోటూ రాలేదు. చూశారు కాదూ, గాంధిగారి చేతిలో వున్నప్పుడు యాభైవేల చందాదార్లున్న యంగిండియాపత్రిక రాజగోపాలాచారిగారి చేతిలో పడి నాలుగువేల చందాదార్లలోకి తగ్గి కుండలోకి వచ్చిందీ?

మనలో ముందుజన్మలో ఇంగ్లండులో పుట్టతగ్గవారు కొందరున్నారు; కాని వారి వల్ల యింగ్లండు కేమీ మేలుకలగదు. సంఖ్య మాత్రం పెరుగుతుంది. అంతే. అయితే బిసెంటు సంగతి అలాంటిది కాదు. ఆమె తత్వానికి హిందూదేశం సరిపడినట్లు పాశ్చాత్యదేశాలు సరిపడవు. కనక ఆమె యిక్కడే పుడుతుంది. హిందూదేశానికి ఆమె వల్ల మాత్రమే కలిగే ఉన్నతి యింకా చాలా వుంది.

నిజానికి బిసెంటు జీవితం వొక మహాసముద్రం. అందులో భీమకాంతాలైన యాదోరత్నాలు పుష్కలంగా వున్నాయి. అందుచేత అది అధృష్యమూ, అభిగమ్యమూ కూడానూ.



# సుశీల

## ౧

" సుశీలా! "

" ఆఁ "

"నన్ను క్షమింపుము" అనుచు భువనేశబాబు తన వ్యథిత నేత్రదృష్టిని సుశీలముఖమున బరపెను— తన దుర్బలహస్తముల నామె చేతియందుంచి పట్టుకొనెను. సుశీల తనముఖము నొకవైపునకు ద్రిప్పికొని చేతులను తిన్నతిన్నగా విడిపించికొని విసనకఱ్ఱతో విసరుచు "మీ రూరకుండుడు కొంచెము శాంతముగా నిద్రించుటకు ప్రయత్నించుడు" అనెను.

"సుశీలా! శాంతముగా నుండజాలకున్నాను" అని భువనేశబాబు దీర్ఘనిశ్వాసము విడిచెను.

"మీరు మాట్లాడుటయే కూడదని డాక్టరుగారు చెప్పిరిగదా!"

"మనస్సు శాంతమగుమందు వారివ్వలేకున్నారు. రెండు నోటిమాటలు—"

"ఊరకుండుడు— తల మరల వేడియెక్కును." అని యొకచేతితో తొందరగా విసరుచూ, సుశీల తన రెండవచేతిని భువనేశబాబుతలయం దుంచెను.

స్నిగ్ధకోమలహస్తస్పర్శచే భువనేశబాబునకు మధురసుఖానుభవము కలిగెను.

"ఇప్పుడు కొంచెము నిద్ర పొండి" అని సుశీల పలికెను.

"నిద్రించుటయా! మొదట మనస్సును శాంతకరము చెప్పు—నన్ను క్షమించెదవా?"

సుశీల నేత్రములందు నీరునిండెను. మిక్కిలికష్టముతో ఆమె తనదుఃఖము నాపుకొని "మీ రేమి యపరాధము చేసితిరి? —నేను దేనిని క్షమించుట?" అనెను.

"ఈవయస్సునందు— జీర్ణశరీరుడనయ్యు, రూపముగ్ధుడనై, నిన్ను వివాహమాడితిని—"

"అయినను పెండ్లిచేసినది నాతండ్రిగారుగదా!"

"అవును—నాకంటెను వారియపరాధ మధికము—చాల నధికము! కాని నేనే— కోరియుంటిని—గొప్పమొత్త మిచ్చుటచే వారు నిన్ను నాకు కట్టిపెట్టిరి—"

"ఊరకుండుడు. ఇప్పు డావిషయమేల? అదంతయు నాలోచింపకుడు. మిక్కిలి అస్వస్థత గలుగును."

అస్వస్థత! — అధిక మింకేమిగలుగగలదు? నేను పోబోవుచున్నాను. ఒకటిరెండురోజుల ముందుగనో వెనుకనో— ఇందువలన నేమగును!"

"లేదు, లేదు, మీరు బాగగుదురు—"

"బాగగుదునా! లేదు ఇక స్వస్థతగలుగదు—ఎవరును నన్ను బాగుచేయజాలరు—పోవుటకుముందు మనస్సుయొక్క పరితాపమును కొంచెము నివారించుకొని పోగోరుచున్నాను."

కడపటిమాటలు నోటినుండి మెల్లగా వెలువడెను. రెండుకండ్లును మూతపడెను. ఈ ఉద్రేకపూరితసంభాషణవలన భువనేశబాబుకు స్మృతితప్పెను. సుశీల అతని శిరస్సున నీరు జల్లి తొందరగా విసరదొడగెను. కొంచెము సేపు దేవిధముగా భువనేశుడు పడియుండెను. శ్వాస క్షీణముగా నుండినను నియమితరూపమున నే జరుగుచుండెను. శిథిలదృష్టితో నాత డొకసారి కన్నెత్తి చూచెను. అతడు క్షీణకంఠముతో "అబ్బా, కొంచెము నీరు." అనెను.

సుశీల కొన్నిగరిటెల నీరు బాబునోటిలో బోసెను. తర్వాత గడియారమువైపు చూచి "మందుపుచ్చుకొను సమయ మైనది, పుచ్చుకొందురా?" అనెను.

"ఇమ్ము"

సుశీల లేచి మందుదెచ్చి, రోగినోటిలో కొంచెము కొంచెముగా బోసెను. జలపాన, ఔషధసేవలవలన భువనేశబాబునకు కొంచెము బలముగలిగినట్లు తోచెను. కొంచెముసేపు నిశ్శబ్దముగా నుండి శక్తిదెచ్చికొని యిట్లుచెప్పదొడగెను: "అవును, నీతండ్రిది గొప్ప అపరాధము."

"ఊరకుండుము, దేహమున కొంచెము స్వస్థత యగు పడుచున్నట్లున్నది."

"అవును, అందువలననే కొంచెము మాట్లాడవలయు నని కోరిక పుట్టినది! ఇక నింతకన్న బాగుగాదు! —వలదు, అడ్డగించవలదు, నిషేధించవలదు, సుశీలా! ఇప్పుడు —"

మాట్లాడుచుండగనే హఠాత్తుగ మాటనిలిచిపోయెను. కొంచెము సేపటికితర్వాత "అబ్బా! కొంచెముగూడ మాట్లాడనియ్యవా? కాలుడా! —తీసికొనిపొమ్ము — తీసికొనిపొమ్ము — ఇప్పుడే. మనస్సు చాలభారముగ నున్నది—కొంచెము తేలిక చేసికొననియ్యవా?—"

తలమీదనీళ్ళుచల్లి సుశీల తొందరతొందరగా విసరజొచ్చెను — హఠాత్తుగా భువనేశబాబు కండ్లుతెఱచి చూచెను, —చేయియెత్తి సుశీలచేతి నందుంచెను, — "ఊరకుండుము, మాట్లాడవద్దు, — ఆటంకపరచవలదు, —నన్నుమాట్లాడనిమ్ము. నీతండ్రిది చాలయపరాధము. అతడు చాల తప్పులు చేసియుండెను— అంతయుపోయియుండెను, తాను జైలుకు పోయియుండును— కాని యీవిధముగా జీర్ణశరీరుడనగు, నాకు, —లంపటుడనగు, నాకు—నిన్ను ముడిపెట్టుటకు నాతని కేయధికారమును లేదు."

సుశీల నేత్రములనుండి అశ్రుకణములు రాలెను. ఆమె తనముఖమును మరలించికొని "నేనే నేమియు ఆటంకపరుపలేదు."

"అది నీమహత్వగుణము నిర్దయుడగు నీతండ్రి స్వార్థపరుడై, దేవలోకబాలికవగు నిన్ను, నాకు బలియొనర్చినాడు. ఏలనో నేనాబలికి కారణభూతుడనైతిని— నేడో, రేపో నే నన్నియు విడిచి వెళ్లిపోవుచున్నాను— ధనమును, భోగమును, అన్నిటిని!— నేను తీసికొనివెళ్ళునది— అబ్బా! చెప్పజాలను, చెప్పలేను, అనేకపాపముల జేసితిని— అన్నిటిని—. ఆలోచించలేను! కాని అంత్యమునగూడ ఈమహాపాతకమును.—"

"నేత్రముల మూసికొని భగవంతుని ధ్యానింపుడు— అతడు శాంతినొసగును."

"ఒసగునా!—ఒసగగలడా? సుశీలా! నీవు చెప్పుచున్నావుగాని శాంతినొసగగలడా? అబ్బా!"

మాట్లాడుచుండగనే భువనేశబాబునకు మరల మైకముగ్రమ్మినట్లాయెను. కొంచెముకాలము గడచెను. అతడు మరల కండ్లుతెఱచెను. "అబ్బా", అనెను,— సుశీల అతనినోటిలో పాలుబోయ దొడగెను. భువనేశబాబు తలకదలించెను; సుశీల నీరుపోసెను, —అతడు కొన్నిగరిటెలనీరు ద్రాగెను. అతని కనుకొననంతటి బలము గలిగినట్లాయెను. మెల్లగా సుశీల అతనిని "మీ బిడ్డలకు జెప్పి పంపుదునా?" అని ప్రశ్నించెను.

"వలదు"

"పంపించిననే బాగుండును."

"ఇప్పుడు వలదు."

"అయిన నెప్పుడు?"

"తర్వాత.— వారు వచ్చినయెడల మంచిదే, లేనిపక్షమున, కొంచెము నిప్పును— నీవే అంటించుము."

"వారిని చూడవలయుననుకోరిక లేదా?"

రెండునేత్రములనుండి రెండు అశ్రుకణములు రాలెను. సుశీల తనకోమలహస్తములతో వాటిని తుడిచెను. మరల నశ్రువులు రాలెను. మరల ఆమె తుడిచివైచెను మరల రాలెను!

"ఎవరు వలదనిరి? వారికి సమాచార మంపించెదను. వారు వచ్చిచేరుదురు." అని సుశీల తెలిపెను.

"వద్దు, యీముఖమును వారికి చూపింపను! చూపింపజాలను!"

"ఏల? ఏమైనబాధ యుండినయెడల తీర్చివైచికొనుడు. ఇంకను సమయమున్నది."

"సమయ మేమోయున్నదికాని అధికారము లేదు. నేను ప్రతిజ్ఞాబద్ధుడను. వలదు, ఇప్పుడామాటలన్నియు వలదు. సుశీలా! వలదు. ఇంకేయానందమును వలదు శాంతి! శాంతి! కొంచెము శాంతియే!—

అతడు మరల మైకముగ్రమ్మినట్లు పడిపోయెను. కొంచెముసేపు సుశీల అతనివైపు దృష్టినిలిపి చూచుచుండెను. హఠాత్తుగా నామె కెందులకో భయము దోచెను. ఆమె మెల్లగాలేచి ప్రక్కవైపునుండు ఒ

తలుపును తెఱచెను. డాక్టరును మఱిముగ్గురు మనుష్యులును నచ్చట కూర్చొనియుండిరి. సంజ్ఞచేసి సుశీల డాక్టరుగారిని పిలచెను. మునివ్రేళ్ళమీద నడచుచు నతఁడు గృహమధ్యమున బ్రవేశించెను. రోగిముఖమును వీక్షించెను. శ్వాసను, నాడిని, శరీరోష్ణమును నతఁడు పరీక్షించెను. అతనిలలాటమున బొమముడివడెను. శీఘ్ర చరణక్షేపముతో మరల నత డక్కప్రక్కగదిని బ్రవేశించెను కొన్నిసీసాలను బైటికితీసి ఒకమందును తయారుచేసి తీసికొనివచ్చెను. మందు నందుకొని సుశీల మెల్లమెల్లగా రోగినోటిలో బోసెను.

ఆపైని రోగికి కొంచెము స్వస్థత అగుపడెను ద్వారపు వెలుపలివైపున రఘునాధుఁడనునొక పురాతన భృత్యుఁడు వేచియుండెను. వానిని రోగిదగ్గఱనిలబడి విసరుమని సంజ్ఞచేసి సుశీల ప్రక్కగదిని ప్రవేశించెను.

## ౨

"డాక్టరుగారూ!"

"మీ రలాకూర్చొనుడు. మీరు భయపడనవసరము లేదు. కాని— చాలరాత్రి అయినది. ఇం కెంతసే పుండగలరు? పోయి మీరు కొంచెము విశ్రమింపుడు. ఇం కెవరైనను రోగివద్ద కూర్చొనెదరు'—'

సుశీల తలనాడించి "లేదు, నాకు కొంచెముకూడ దుఃఖములేదు— వారు మేల్కొనినప్పుడు నన్నే పిలచెదరు!"

"అది సరే— అది సరే—అయినను—"

"వారిస్థితి యిప్పు డెట్లున్నది?"

"స్థితికేమి— మీరు భయపడవలదు. రాత్రియంతయు బాగుగనే గడిచిపోవును—"

"ఏమైన యనుమానమున్నదా?"

డాక్టరు సందేహముతో "అదంతయు భగవదాధీనము" అనెను.

"నే నీసమాచారము వారిసంతానమునకు తెల్లము జేయవలయునని కోరుచున్నాను.—"

సమీపముననే నొకపురుషు డాసీనుడైయుండెను. అతనిపేరు ప్రఫుల్లచంద్రబాబు. అత డాగృహకార్యనిర్వాహకుడై యుండెను. "అమ్మా! సమాచార మంపుట వారి కిష్టములేదా?" అని యత డడిగెను.

"అట్లే యగుపడుచున్నది. అయినను వారికి సమాచార మంపవలయునని నాయిష్టము."

"తమరు చెప్పినయెడల—"

"అవును. మీ రిప్పుడే వారి కీసమాచార మంపుడు. జబ్బుసంగతిగూడ వారికి తెలియదు. ఇప్పుడే యొక జాబు వ్రాయుడు. 'వారు మృతప్రాయులుగా నున్నారు. తత్క్షణమే ప్రయాణమగుడు' అని వ్రాయుడు. మోటారు సంసిద్ధముగా నున్నది. ఇప్పుడే ఎవరినైన జాబు తీసికొనిపొమ్మనుడు."

ప్రఫుల్లచంద్రబాబు అచ్చటినుండి లేచి వెళ్ళి, జాబు వ్రాయుటకై కూర్చొనెను. కాగితము, పేనా తీసికొని వెనుకకు తిరిగి "తమతండ్రిగారికిగూడ జాబు వ్రాయుదునా?" అని యడిగెను.

"వలదు"

"వా రేమందురు?"

"వలదు, అవసరములేదు, వారికి జాబు వ్రాయవలదు. సుశీలముఖమునుండి ఉత్తేజపూరితమగు నొక వేడినిట్టూర్పు వెలువడెను. ఆమె దానినణచి ధీరముగా "వలదు, ఇం కెవరికిని సమాచార మంపనవసరములేదు. కేవలము వారిబిడ్డల కిప్పుడే సమాచారమంపుడు."

ఇట్లుచెప్పి సుశీల మరల రోగియుండుగదిలో బ్రవేశించెను. ఆమె భృత్యునిచేతినుండి విసనకఱ్ఱను తీసికొనెను. రఘునాథు డటుతొలగి నిలుచుండెను.

ఒకగంటకాలము గడిచిపోయెను. బైట వరాండాలోనికి ఘుంయ్‌ఘుంయ్ శబ్దములతో కొన్ని మోటారులు రాదొడగెను. సుశీల శరీరమంతయు గడగడ వణకజొచ్చెను. ఆమె మిక్కిలిప్రయత్నముచేసి మనస్సు శాంతపరచుకొని శక్తిదెచ్చుకొని నిలబడెను! రఘునాథుండు, కండ్లనిండుగ నీరుదెచ్చుకొని రోదనారంభించెను.

మెట్లమీద చాలపాదధ్వనులు వినబడెను. వచ్చినవారందఱు ప్రక్కగదిని ప్రవేశించిరి. సుశీలయు తలుపు తెఱచి వారికెదురుగా బోయి నిలబడెను. ఇల్లు నిండిపోయెను,— ఇద్దఱు పుత్త్రులు, ఇద్దఱు కోడండ్రు, ఒక

కూతురు, మనుమడు, మనుమరాళ్ళతో ఇల్లు ఒకేతూరి నిండిపోయెను. సుశీల వారి నొకతూరి కన్నెత్తిచూచెను. ఆమె దుఃఖముతోడను, సిగ్గుతోడను, తలను వంచుకొనెను.

అహా! ఏమి ఏలోభమున నామె వాని నాశ్రయించియుండును. వీరిమధ్య నామెయే అపరాధినివలె నగపడుచుండెను. అమె ఒకసారి కన్నెత్తిచూచి తలవంచుకొనెను. మరల ఆమె కన్నెత్తి చూడజాలకపోయెను. ఆగంతకులు నిశ్శబ్దముగా సుశీల ముఖమువైపు చూచుచుండిరి. ఈమోహినియే యాతని కింద్రజాలముగదా!—కాదు. ఈమె మోహినిగాదు, ఈమె మహామహిమాదేవి! సామాన్యమనుష్యస్త్రీయగుపక్షమున, అబ్బా! ఇంతటి దురదృష్టవంతురాలగునా? ప్రేమ, కరుణ కలసిన దృష్టితో నందఱును నీమె ముఖమువైపు చూచుచుండిరి. ఇప్పటివఱకును నీమెపేరు విననంతనే లెక్కలేని శాపముల బెట్టుచుండెడివారు!

సుశీల వంచినముఖముతో డాక్టరువద్దకు వెళ్ళి "వీరిప్పు డాయింటిలోనికి వెళ్ళవచ్చునా?" అని యడిగెను.

డాక్టరు తలను ఊపి సమ్మతిని తెలియపరచెను.

తలుపుతెఱచి సుశీల ప్రక్కకు జరిగి నిలుచుండెను. నిశ్శబ్దముగా నందఱు గృహమధ్యమున ప్రవేశించిరి. అందఱును శయ్యాగతుడైన రోగికి నాల్గువైపుల నిలుచుండిరి.

పదునైదునిముషములు గడచియుండును. ఇంతలో భువనేశబాబు కదలెను క్షీణకంఠముతో మెల్లగా "వీరెవరు? అందఱువచ్చిరి! అబ్బా!" అనెను.

సుశీల కొంచెము దగ్గఱకువచ్చి తలవంచి "కన్నెత్తి ఒకసారి వీరిని చూడుడు" అనెను.

భువనేశబాబు కండ్లుతెఱచి చూచెను. అతని ముఖమునం దొకసారి ఆనందదీప్తి వెలిగెను. తత్క్షణమే నిష్ప్రభకొంది పాంశువర్ణము బొందెను. అతని శిథిల నయనములు రెండును మూతపడెను. రెండుకన్నీటిబొట్లు బైలువెడలెను. ఈవ్యథితవిశ్రాంతజీవికి ఉత్తరలోకమునసైన శాంతి సంప్రాప్తించియుండునా!— ఆవిషయము మాలోకాధిష్ఠాతయు, కర్మఫలదాతయు నగు ధర్మునికే తెలియవలయు!

## 3

"తమరు మమ్ముల బిలచితిరా?"

"అవును, కూర్చొనుడు—" సంభ్రమముతో, సుశీల లేచి, భువనేశబాబుకుమారులగు నరేంద్రబాబు, ధీరేంద్రబాబులకు కూర్చొనుటకై స్థానమిచ్చెను.— వారు నిశ్శబ్దముగా కూర్చొనిరి.

"సరి— మమ్ముల నేలపిలచితిరి?"

"వారు చాలసంపత్తి నుంచిపోయిరి" అని సుశీల మిక్కిలి నిర్లిప్తభావముతో నుడివెను.

"వింటిమి, అంతియేనా?"

"వారి వీలునామాసంగతిగూడ వింటిరా?"

"వింటిమి, ఆస్తినంతయు తమ కిచ్చి పోయిరి గదా?"

"వివాహసమయమునందు మాతండ్రిగారివద్ద యీ విధమగు ప్రతిజ్ఞయే వారు చేసియుండిరి—"

"[illegible]వద్ద అవిషయములగుఱించి ఆలోచించుట కేమైనఅవసర మున్నదా?"

"నా రీప్రపంచమునువిడిచి వెళ్ళిపోయిరి. ఏమైనను సరే మీ రాఆస్తివిషయమై ఆలోచించవలయును."

"తమయాస్తివిషయమైగదా! దానిన్ని తమరు మీయిష్టమువచ్చినట్లు చేసికొనవచ్చును. ఈఉపదేశ మిచ్చుటకొఱకేనా మమ్ముల బిలుచుట?" అని ధీరేంద్రబాబు పలికెను.

"కాదు, ఆ ఆస్తివిషయమై నా కేమియధికారమున్నది? కాని నాకొఱకై వారు తలచిన అంత్యకర్తవ్యమును వారు చేసిపోయిరి. ఇప్పుడు నేను నాకర్తవ్యమును చేయవలసియున్నది. ఇది వారివీలునామా" అని ఆవీలునామాను ఆసవతిబిడ్డల యిరువురియెదుట పడవైచెను.

"సరే, దానినిచూచి మే మిప్పుడు చేయునదేమి?" అని నరేంద్రబాబు వాక్రుచ్చెను.

సుశీల ఆవీలునామాను మరల యెత్తుకొనెను,—

రెండుభాగములుగా జింపి, అగ్గిపుల్లను వెలిగించి వాటి కంటించెను. భగ్ ,భగ్ మనుచు నాచినిగినకాగిత ముక్కలు మండజొచ్చెను. చూచుచుండగనే అవి భస్మీభూతము లాయెను.

"వీలునామా— అదిగో మండిపోయినది,— మీతండ్రిసొత్తుకు హక్కుదారులు మీరలే!"

ఇద్దఱు సోదరులును విస్మయముజెంది అట్లే చూచు చుండిరి. కడపట "తమ రిప్పు డేమిపనిచేసితిరి?" అని నరేంద్రబాబు పలికెను.

"మంచిపనియే చేసితిని మీరు వారివంశస్థులు— వారిసంపత్తికి మీరు హక్కుదారులు!— ఈవిపుల సంపత్తిని స్వాధీనపఱచుకొనుటకు నే నెవతెన?"

"తమరు వారిపత్నులుగదా!"

"ఏమైననుసరే, నా కొకయధికారమున్నదని నే దలుచను"

"ఏల తలచరు? స్వతంత్రముగానే తమరు జీవింప గలరు ఎట్లైనను దీనికి కడపట అధికారులుతమరే — వీలునామాను తమరు కాల్చివేసితిరి, అయినను యింకేమైన వ్రాతమూలకముగా నుండెన—"

"నాకు తెలియదు. తెలిసికొనవలసిన అవసరమును నాకు లేదు. అధికారిని! వలదు, అధికారి నను మాట లింక యెత్తవలదు. — అధికారము కావలయునని నేను కోరలేదు. నేను కోరను. నాకు నగలు చాల యిచ్చియున్నారు. వాటిని యీనాకోడండ్ర కిచ్చివేయుదును. వారుధరించిన నేను సంతోషించెదను.—" చెప్పుచుండగనే ఆమె నోటిమాట నిలచిపోయెను.

నరేంద్రబాబు "అయిన తమజీవనము—"

"జీవనము! నే నొకయాడుదానను— విధవను. రెండుపిడికెళ్ళబియ్యము, రెండుగుడ్డలు— ఇందుల కేమిఖర్చగును? మాతండ్రినన్ను చదివించుటలో లోపము చేయలేదని మీకు తెలియునుగదా?—"

"తమరు సుశిక్షితులని నాకుతెలియును;— తమ కీదుర్భాగ్యము ఘటించెను. ఏమైననుగానీ తమరు విద్యాలాభము బొందియున్నారు. ఆవిద్యచే నార్జించిన ధనముచే తమ కొక్కరికేకాదు యింకనలుగురినిగూడ పోషింపగలుగుదురు. కాని తమరిట్లేలచేయవలయును. తండ్రిగారిసంపత్తిని తమరు కొంచెముగూడ స్వప్రయోజనముకై యుంచుకొనుటలేదు. కాన తల్లీ! నీవు మా తల్లివి! మేము మీబిడ్డలము మాఅధికారిణి—"

సుశీల యేడ్చుచు తనరెండుచేతులతో ముఖమును గప్పికొనెను. నరేంద్రబాబు నోటిలోనిమాటలు హఠాత్తుగా నిలబడిపోయెను. కొంచెముసేపటితర్వాత వాని స్నేహకోమలకంఠమున "తల్లీ!" అనిపిలువబడెను.

రుద్ధప్రాయమున "బిడ్డా" అని సుశీలకంఠమున వెలువడెను.


"బిడ్డల ప్రార్థన నుపేక్షించి వెళ్ళిపోయెదవా తల్లీ!"

సుశీల బిగ్గరగానేడ్చుచు "తల్లీ' తల్లీ ! నేను తల్లినా? మీరు మీసంతానాధికారమును గోరుచున్నారా?"

"అవును. తమరు తల్లులు, మేము బిడ్డలము— బిడ్డల అధికారమునే మేము తమరి నడుగుచున్నాము. తల్లివలె, దేవివలె, తమరు తమబిడ్డలసంసారముననే యుందురుగాక"—

"ఉండెదను — అట్లైన నుండెదను. నేను చాల చిన్నదానను, —తల్లియగుటెట్లో నాకుతెలియదు. కూతురువలె మీవద్దనుండెదను,—మీరు తండ్రులరు— పుత్రికవలె మీలో నా కొకస్నేహస్థాన మిందు— నే కృతార్థురాల నయ్యెదను!" (అనువాదము).

—తిరుమూరు రంగారెడ్డి.



# క్షమార్పణ

తారకాగణమువలె    వికసించింది. ఆమాలతీపుష్పపరిమళమిళితవాతపరంపరలు నన్ను తమవంకకు త్రిప్పుకోఁగలిగాయి. అదిమొదలు ప్రతిమునిమాపున దానిదరిఁజేరి తచ్ఛాయల విహరింపుచు దానిసౌరభము నాఘ్రాణింపుచు ఆనందవార్నిధిమగ్నుడనై ప్రకృతిసర్వస్వమును మఱచునంతటితన్మయత్వము పొందేవాణ్ని. కొన్నాళ్లదాక నా కదే భూలోకనాకమైపోయింది. అలా యెంతకాలం గడచిందో నాకే తెలియదు.

అభ్యంగనానంతరమున సఘటితకేశయగు విలాసినివలెఁ గన్పట్టు నామాలతీలత, శిరోముండనముఁ గావించుకొన్న సన్యాసివలెఁ గన్పట్టిం దొకనాడు. నాహృదయము బ్రద్దలైంది. ఇంటిమీదిపెంకులు అదరునంతటి ఆర్తనాదముఁ గావించాను. దాని కదరి భయకంపితస్వాంతముతో మాచిట్టి నామ్రోల ప్రత్యక్షమైనాడు.

"నాన్నా? భయపడకు, దీన్నిలా పాఁడుచేసిం దెవరురా?'' అని అడిగాను.

''నేనేనే. మంచిపూలని కఱ్ఱతో కోచుకోబోతే యిరిగిపోయిందే". అన్నాడు అవ్యక్తమధురకంఠధ్వనితో మాచిట్టి

''నాన్నా? మంచిపూలని యిలా పాఁడుచేయవచ్చునా? మంచివస్తువులను యిలా పాఁడుచేస్తే ప్రకృతిఅంతా స్మశానముగా మారదా?'' అన్నాను నేను.

శోకపూరితనయనాలతో నాచిట్టి ''నాకు తెల్లేదే. సమించాలి.'' అని అన్నాడు.

ఆపలుకులకు నా కనుకంపావిషాదము లొక్కుమ్మడి పెనవైచి ముగ్ధునిఁ జేసివైచాయి. నాటితో మామాలతీలతకు నాశనము, మాచిట్టి సత్యవృక్షమునకు బీజప్రదానము.

—కొత్త సూర్యనారాయణచౌదరి.



# భిక్షుక బాలుడు

[ఆకాశాన్నిఅంటే మేడ. వీధిద్వారంమాత్రం ఎంచేతో బూజుపట్టిఉంది. లోపల మనుష్యులసందడి అట్టే ఉన్నట్టు కనబడదు. వాలకంబట్టిచూస్తే ఆయింట్లో ఇద్దరు ముగ్గురుకన్న యెక్కువఉన్నట్లు కనపడదు. పెరటి ద్వారంలోంచి ఎంగిలివిస్తరాకులు పట్టుకొనివచ్చి అవతల గిరవాటేసి ఎక్కణ్నుంచో 'అమ్మా' అను పిలుపు వినబడడంచే గుమ్మంలోనే నిలబడింది ఆమె. సుమారు ముప్ఫయిసంవత్సరముల వయస్సు. ముఖంలో మార్దవరసం ప్రవహిస్తోన్నట్టు కనుపిస్తుంది. చూపుల్లో కరుణ వరదలై పారుతోంది. మొత్తంమీద పరిమళహృదయమే. పట్టుచీర కట్టుకుంది. అలా నిలబడి చూస్తుంటే కరడుకట్టిన కరుణమూర్తిలాఉంది ఇంతలో చిల్లిపింగాణీకంచం నెత్తిమీద బోర్లించుకొని వచ్చాడో పిల్లాడు. మెళ్ళో నాలుగువరుసల వేరుపూసల దండలు, తైలసంస్కారం లేకపోవడంచేత మొహంమీదికి పడే ఎర్రనిముంగురులు, చేతులకి రాగిమురుగులు, జబ్బలదగ్గర వేరుపూసలకడియాలు, కోలనిముక్కు, చిన్నగోచీ పెట్టుకున్నాడు వెనకపక్కకు ఒదిలిన గోచీ కొంగు పీలికలై ఉంది వాలకంబట్టి చూస్తే వాడో భిక్షుకకుటుంబానికి చెందిన పిల్లాడని తెలుస్తుంది. ముష్టి అడగడంతెలియదు. ప్రపంచకాన్నిమాత్రం స్వాతంత్ర్య దృష్టితో చూస్తున్నాడు. ప్రపంచకంఅంతా ఒకఇల్లు. అది తనదీ అని వాడిభావన. ఆకలేసేసమయాన్కి ఏ ఇల్లాలినిఅడిగినా తల్లిలా ఆదరించి ఇంతఅన్నం పెట్టుతుందని వాడిభావం. తనగుడిసెలోఉండే తల్లిదండ్రులంటెంత ప్రేమో తనకి లోకంలోఉండే స్త్రీపురుషాదులందుకూడ అంతేప్రేమ. తనగుడిసెలోతనకి ఎంత స్వాతంత్ర్యమో ఇతరులఇంట్లోకూడా తనకి అంతేస్వాతంత్ర్యంఉందని వాడనుకునేవాడు. తనతల్లి తనని ఎల్లా చూస్తోందో లోకంకూడా అల్లా చూస్తుందని వాడి పెర్రి ఉద్దేశం. ఇంకా లేతమనస్సుకొబట్టి కలుషప్రపంచకంలో ఉండే దుర్గంధం వీడి కేంతెలుసు? గబగబా పరుగెత్తుకొనివెళ్ళి కంచం కిందపడేసి కాళ్ళు చాపుకొని కూచుని 'అమ్మా నా కాకలేస్తోందే' అన్నాడు.]

ఆమె—(జాలిగా వాడికేసి చూసి) ఎవరమ్మా నువ్వు?

బాలుడు—నేను.

ఆమె—నీపేరేరమ్మా?

బాలుడు—నాపేరు పాప?

ఆమె—మీయింటి పేరు?

బాలుడు—మాయిల్లు కొబ్బరాకులది.

ఆమె—అదికాదమ్మా! మీయింటిపేరు?

బాలుడు—అహ! అదా! బిచ్చమెత్తుకొనే ఇల్లు.

ఆమె—అయ్యో! పాప! నీ కన్నే ల్లుంటాయి! నీకు సరిగ్గా మాటలు రావూ, నాయనా?

బాలుడు—ఆఁ! నేచెప్పను. నాకు ముందన్నం పెట్టు. నా కాక లేస్తోంది.

ఆమె—పోనీలే అన్నంతిన్నాక చెబుదుగానిలే. ఇక్కడే కూచో. అన్నం పట్టుకొస్తా. [లోపలికి వెళ్లితోంది].

బాలుడు—[స్వతంత్రంగా ఆమె వెనక్కాలే వెళ్ళి ఆమెకొంగు పట్టుకొని వెనక్కాల నడుస్తున్నాడు.

పాపం వాళ్ళు బ్రాహ్మలనీ ఆమెది అంటచెయ్యికాబట్టి ముట్టుకోకూడదనీ తెలియదు] అమ్మా! ఏంవేసి పెడ తావు అన్నంలో?

ఆమె—[చటుక్కున వెనక్కి తిరిగి చూసి] అయ్యో! పాప! ముట్టుకున్నావా? పోనీ స్నానం చేస్తాలే. నిన్ను వాకట్లో ఉండమంటే ఇలావచ్చావేం? [శాంతంగా] వాకట్లో ఉండు. అన్నం పట్టుకొస్తా

బాలుడు—ఏం ముట్టుకుంటేను?

ఆమె—మేం బ్రాహ్మలం. నాది అంటచెయ్యి...

బాలుడు—బ్రాహ్మలంటే? ఏం ఆచెయ్యి ఆ బట్టతో తుడుచుకోకూడదు?

ఆమె—అబ్బే! పాప! అల్లా తుడుచుకోకూడదు. కడుక్కోవాలి.

బాలుడు—అయితే మాఅమ్మ బట్టతో తుడుచు కొంటుందేం రోజూను.

[లోపల్నుంచి "ఎవరితోటే ఆవెధవకబుర్లు" అంటూ ఓఏభైఏళ్ళమనిషి వచ్చాడు. కళ్ళు చాలాక్రూరంగా ఉన్నాయి. ముఖంలోంచి ఒకనల్లనిరాక్షసకళ పైకి అప్రయత్నంగా చిమ్ముకొస్తుంది.] ఆముష్టివెధవ ఎవరు?

అమె— ........

ఆతడు—ఆవెధవ ఎవరే లోపలి కొచ్చేస్తున్నాడు?

ఆమె—వాడు ముష్టివాడే. అన్నంలేక పడకొట్టి వీథిలోపడిపోతే తీసుకొచ్చాను గుప్పెడుఅన్నం పెడ దామని.

బాలుడు—[కంచం నెత్తిమీద బోర్లించుకొని రెండుచేతులతోటి నొక్కుకొంటూ ఆవెర్రికేకలకి నవ్వుతో ఆతనికేసి అమెకేసి దీనంగా చూస్తూంటాడు.]

ఆతడు—ఎక్కడుంది అన్నం. అంతమిగిలేట్లా వండా వేమిటి?

ఆమె—అబ్బే! లేదు. నే నింకా భోంచెయ్యలేదు కామా దాల్లోది కొంచెం పెడదామని.

ఆతడు—ఇల్లాటి వైధవపనులు ఎప్పుడూ చెయ్యకు. ఆవెధవని వీథిలోకి గెంటి తలుపేసి రా.

బాలుడు—ఆఁ! నేవెళ్ళను. నిన్నే గెంటేస్తా.

ఆతడు—ఓరివెధవా! [అని కోపంతో గభీల్ని దగ్గరకి వస్తాడు కొట్టటానికి.

[కుర్రాడు ఆమెవెనక్కాలికివెళ్ళి ఆమెకొంగు నెత్తి మీద ముసుకేసు కొని] 'అమ్మా! చూ డెల్లాకొడుతు న్నాడో? అన్నాడు.]

ఆతడు—ఓరివెధవా దాన్ని ముట్టుకొని తగలేశావు కళ్ళు పీకేస్తాను వెధవా.

ఆమె—అబ్బా మీ కెందుకండి ఇన్నిగొడవలు. [శాంతంగా.] చిన్నపిల్లవాడు. కడుపుమండుతోందని ఏడుస్తుంటే ఇంతఅన్నం పెట్టొద్దంటారు. నాదాల్లోది పెడతానంటే మీకేం?

ఆతడు—కోతమూసి ఆవెధవని వీథిలో పారేసి తలు పేసిరా. తరవాత నీసని చెపుతా. ఇల్లా దెబ్బలాటలు వస్తాయనే వీథితలుపు వాడకం మానిపించేను. పెరటి దారిని ఈవెధవవర్తకం ప్రారంభించావూ? ఓసి .....

ఆమె—మనింటివీథితలుపు వాడకం మానేశాక యాయివారబ్రాహ్మడేనా రానటం మానేశాడు కదా? ఎప్పుడోవచ్చిన ఈకుర్రాడికి ఇంతఅన్నం పెడితే నేం? కుర్రాడు. తెలియదు. పెరటిదారిని వచ్చాడు.

ఆతడు—ఛీ! ఇంక ఇల్లాకాదు. ఒరేయి వెధవా—

బాలుడు—నీతో మాటాడను ఫో.

ఆతడు—ఓరి కొంటివెధవా అవతలికి పోతావా పోవా.........

బాలుడు—[కంచం కింద పారేసి కిందపడి దొల్లుతూ] నా కాకలే స్తుందోయి. నాకడుపుమండిపో తోందోయి. [అని ఏడ్చును]

ఆతడు—ఒక్కలెంపకాయ కొడతా వెధవా? దొంగ ఏడుపు ఏడిచావంటే.

బాలుడు—[ఏడ్చును]... .....

ఆతడు—పోనీ ఆ అంటగిన్నెలం తోముతావా? ఇంతగంజి పోస్తాం?

బాలుడు—[కోపంతో] నే తోమను ఫో......

ఆతడు—[ఆచిన్నబుగ్గమీద లెంపకాయ కొట్టును]

ఆమె—పెట్టకపోతే అవతలికి పంపించేయండి. కుర్రాణ్ని బుగ్గమీద కొడతా రేమిటి? [అని ముఖం

అటుతిప్పుకొని కొంగుతో కన్నీళ్ళు తుడుచుకొనును.]

బాలుడు—బాబో... అయ్యో... ఆకలి ..

అతడు—అంటగిన్నెలు తోముతావా? పోతావా?

బాలుడు—[ఏడుస్తూ] గిన్నెలు తోముతే నా చేతులు రక్తం వొస్తుంది. [అయ్యో ఆకలి అని దొల్లును]

అతడు—[పిల్లవాడిచెవిపట్టుకొని లేవతీసి] కొంటి వెధవా ఏమి టీతెగసాగు [రెండులెంపకాయలుకొట్టి] [గుమ్మంమీంచి కిందకి తోసేసి అటుకేసి చూడకుండా తలుపువేసేసి వెనకచాటునే వచ్చి 'దొంగముండా! ముష్టివెధవల్ని లోపలికి తీసుకొనివచ్చి అదీ ఇదీ పెడుతున్నావా' అని నడ్డిమీద ఒక్కతన్ను తన్నును.]

[ఆమె అయ్యో అని ఎదటి పడిమీద పడిపోవును.]

* * *

[పెరటిగుమ్మందగ్గర రెండువందలమంది మరాఠీవాళ్ళు నిలబడిఉన్నారు విచ్చుకత్తుల్తో. వాళ్ళమధ్యని పిల్లవాడొకడు స్మృతిలేకుండా పడుంటాడు. ఏమిటో ఏదో భాషలో పెద్దగందరగోళం జరుగుతోంది. మేడమీంచి చూస్తున్నాడు మన 'అతడు' అనేవాడు. ఒళ్ళంతా కంపంబయలుదేరింది. గాభరా అయిపోతున్నాడు. వాళ్ళంతా ఒక్కమాటు నిశ్శబ్దంగా ఆగిపోయారు. పెద్దగడ్డంగల ఓమనిషి బహుశ వాళ్ళ గూడెంపెద్ద అయిఉండవచ్చు ఎదటికివచ్చి వాళ్ళ భాషలో ఏదో వాళ్ళమతాచారాన్ని చెప్పి చివర్ని తెనుగులోమాత్రం "సంపి రండి" అని ఆడవాళ్ళని తీసుకొని వెళ్ళిపోయాడు. మేడమీద నిల్చున్న అతడు ఈ 'సంపి రండి' అనే ముక్కవిని కిందికి గబగబా పరుగెత్తుకు వచ్చాడు. కళ్ళు జిగేలు మనే దృశ్యం భయంకరంగా ఉంది. ఎదుట భార్య చచ్చి పడినట్టుంది. పక్కనిసాన. దానిప్రక్కని ముత్యాలహారం. ముత్యాలహారంలో ఉండే వజ్రము సగంఅరిగి పొడిఅయిపోయి ఉంది. ఇంతట్లోకి పెరటిగోడ పెకిల్ని విరిగి పడిపోతుంది. బిలబిల మరాఠీలు లోపల ప్రవేసిస్తారు

అతడు బిక్కమొకంవేసుకొని నిల్చుని ధైర్యంగా 'పోలీసు. పోలీసు' అని కేకవేసి 'ఒరే రిహాల్దారు ఇల్లా పట్రా' అంటాడు అంతే నడినెత్తిమీద ముష్ఠాయి కర్రదెబ్బ లొక్కమాటు పడతాయి.

కుర్రాణ్ణి గూడాన్కి తీసుకుపోయి వాళ్ళమతానుసారంగా చెయ్యవలసిన అంత్యకర్మలుచేసి పాతిపెట్టి దానిపైన పెద్దగోరీ కట్టించారు.

—కర్రా చంద్రశేఖరము.

## అశ్రుగీతి

గుబురుకొన్న వేసటతోడఁ గుములుచున్న
నన్ను వీక్షింప దోకప్రేమనయన మేని;
నావిషాదతప్తాక్రందనమ్ము వినియుఁ,
గురియ దురుబాష్ప మొకజాలిగుండెయేని!

తమమె నెలకొను నాజీవితమ్ములోన
తేమలపుచుమారము గుబాళింపఁబోదు;
సురవిలాససుషమరేఖ సాగయఁబోదు;
ఇంత వలవంతబ్రతుకు సాగించు టెట్లు?

ప్రేమభిక్షుకై శర్వరీవీథులఁబడి
దీనగళమెత్తి విలపించినాను కాని—
తెరువలేదు కవాట మొక్కరును గూడ
భౌతికక్లేశ కృపణ ప్రపంచమందు.

కష్టసౌఖ్యదమ్మంచు లోకమ్ము కనుల
నీడ నాసించి యిటు వచ్చి నిలచినాఁడ;
ప్రజ్వలోన్మేష హాలహాలప్రవృద్ధ
నృత్తధూమం బటంచు నూహింపలేక.

దివ్యపిచ్ఛిల పరిమళదీపితంబు
మామకీన జీవితకుసుమమ్మునందు
ప్రబల నిశ్వాస విషవహ్ని రగులుకొలిపి
నవ్వుచున్నది జగము రంగైనమోవి!

—ఓలేటి సీతారామమూర్తి.

# ఆశ

భావోద్రేకమున పొంగిపొరలుచున్న ఆలోచనా సంద్రమున కంతులేదా? ఇందుద్భవించుచున్న చిరుతరంగము లేవిధముననైన లోకకల్యాణమునకు సాయపడునా?—ఈ చిరుతరంగములే పొంగి పొరలి లోకమునకపకార మొనరించునేమొ!—ఇది రత్నగర్భ యందువా! పరాత్పరా! ఇందును తిమింగిలములున్నవి!—అవి కార్యరూపమునుదాల్చిన లోకమున కమంగళము చేకూర్చును.

కట్టుబాట్లనియెడి గట్లనొరసికొని ప్రవహించుచున్న దీప్రవాహము. ఈగట్టు తెగెనా! దీని ప్రతాప మనివార్యము, దుస్సహము.—ఈయుద్రేకము నణచివేయును, ఇందున్న తిమింగిలముల నాశన మొనరింపును....అలలమాటున, అడుగుభాగము నందణగియున్నవి, రత్నములు; బయల్పరపును; సహజకాంతుల వెలిజిమ్మునట్లు వానిని శుభ్రపరచును—లోకము వానిని శిరమునదాల్చును; వానికై లోక ముపరితపించును, అట్టివానిని తానును సనుకూర్ప నుద్యమించును. నీవు మిన్నకుండినచో ఈజల మగాధకూపములలో బడిపోవును ఇందలిరత్నములు కాలమహాస్రవంతిలోనికి కొట్టుకొనిపోవును........మిగిలి యుండునవి తిమింగిలములే,...క్రూరమగు తిమింగిలములె! సర్వవ్యాపీ! విజ్ఞానచంద్రు డెప్పుడుదయించును? ఈసాగర మాతని వెలుగున త్రుళ్ళిపడున దెప్పుడు? ఈయజ్ఞానమేఘముల గములుతొలగిపోవా? చంద్రుని దర్శన మేనాటికైన చేకూరకుండునా? ఈసాగర మేనాటికైన రత్నముల వెలువరింపదా? తిమింగిలములు నాశనమైపోవా?

—చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదు, బి. ఏ.




ఆకాశదీపము

—చిత్రకారుడు : శ్రీపాద దుర్గారావుగారు, రామారావు ఆర్టు సొసైటి.



# ఆడబిడ్డ మగబిడ్డగుట

కాఫీహోటల్లు మరగినవానికి పంచభక్ష్య పరమాన్నాలుపెట్టినా వాడు కాఫీహోటలుకు వెళ్లడం మానడు; సానులమరగినవానికి స్వర్గలోకంనుండి చక్కని చుక్కను తీసుకునివచ్చి పెండ్లిచేసినావాడు సానివీధులు తిరక్క మానడు. ప్రకాశరావుకు ఎట్లా సంపర్క మయిందో 'జాము' అనే సానిపొందు. ఎప్పుడైతే దఫేదారు పుల్లయ్య, 'ఇడ్డిన' కూతురు 'జాము' సానివాడలలో కెల్ల చక్కనిచుక్కని చెప్పాడో, నాటినుంచి అతని బుద్ధి అశోకులసానిపై పోయింది. చూడట మేమిటి, చూచినవెంటనే ప్రేమించడ మేమిటి, ఒక్కసారి తటస్థించింది. నిప్పురవ్వ తాటాకింటిపైబడి ఎంతక్షణములో ప్రజ్వరిల్లుతుందో, అంతక్షణములో ప్రజ్వరిల్లింది అతని ప్రేమ సానులలో ప్రసిద్ధికెక్కిన 'జాము'ను సానిపై. మొదట దొంగతనముగా సానింటి కెళ్లడమలవాటు పడ్డాడు. దొంగతనము దొరతన మయింది. ఇప్పుడు ప్రకాశరావు భార్యఎవరయ్యా అంటే గుడివీధిలో రంగులమేడలో నున్న జామంటారు కాని, అతడు అగ్నిసాక్షిగ పెండ్లాడిన సత్యకాలపు సరళని అనరు. సరళ ఎంతచక్కగావుంటేనేమి, ప్రకాశరావు మోహమంత యిప్పుడు జాముపైవుంది. పిండిమెఱుగులు, క్రాపింగు ముంగురులు, కనుకిటుకులు, తీపిమాటలు గల సానిముందు, సహజలావణ్యము, నమ్రత, వినయవిధేయతనుగల వనితలు మెఱుపుతీగెలవలెనున్న రుచింపదు, సన్నజాజిలాగవున్నా వులియపరు. గాజురాళ్లను జూచి వజ్రాలను విసర్జించేవాళ్లెంతమంది వున్నారు కారు. కాఫీకుండను అమృతభాండములో పోల్చేవాళ్లెంతమందివున్నారు కారు. అందులో మన ప్రకాశరావొకడు. మెఱుగులసాని మెఱుపుతీగనవమానించిన తన భార్యకన్న వేయిరెట్లెక్కువనుకున్నాడు.

ఇట్లా కొంతకాలము గడిచింది. అతనికేమి, 'గువ్వ గూడెక్కె, రాజు మేడెక్కె' అన్నట్టు అతడు సాని మేడజేరి సర్వసుఖాలు అనుభవిస్తున్నాడు. కాని నది పొంగి వూరును ముంచేసినట్టు, సర్వకష్టాలు అతని భార్యయగు సరళను చుట్టుకున్నాయి.

ఒకరోజున విశాల సరళయింటికి వచ్చింది. విశాల ఎవరంటారేమో. ఆవిడ ప్రకాశరావుకు పినతండ్రి కూతురు. అన్నను చూసి పోదాముకదాఅని యీ వూరొచ్చింది. వచ్చి మూడురోజులయింది. కాని అన్నెక్కడ సానిల్లే స్వర్గమని దానియింటనే పగలు రాత్రులు గడుపుతున్నాడు.

విశాల:—వదినా! యీ పోకడ లెంతకాలముబట్టి?

సరళ:—సుమారొక సంవత్సరము బట్టి.

విశాల:—అబ్బా. ఇంతకాలంబట్టి వూరుకున్నారూ!

సరళ:—మరేమి చెయ్యమంటారు ? ఎంతకాలమో అంతకాలం అనుభవించాలె.

విశాల:—నాకొక మార్గం కనబడుతూ వుంది.

సరళ:—దేని?

విశాల:—సాహసముంటే అది కానసాగవచ్చు. ఆలోచిస్తాము.

## ౨

ప్రపంచకములోని జనులు నూటికి తొంభైతొమ్మిది పాళ్ళు వేషంబట్టి భ్రమసిపోతున్నారు. కుచ్చులు వచ్చేలాగ జరీపాగా చుట్టుకుని, చెమికీకోటు వేసుకుని, మీసాలు దువ్వుకుంటూ గౌరయ్యన్న సరే డాబుగా పోతూవుంటే, ఏ మహారాజు బిడ్డో అని మనము అడలి తప్పుకుంటాము. కాకిరంగు సాన్సుతో, కాకిరంగు సార్టుతో, కాకిరంగు వర్దుతో ముస్తాబయి, ఒక తోలుపట్కా పొట్టకడ్డంగా బిగించుకుని, మరిరెండు తోలుపట్కాలు, బెత్తెడు వెడల్పువి, యజ్ఞోపవీతంలాగ ఒకటి యీమూలనుంచి, ఒకటి ఆ మూలనుంచి ధరించుకుని, ఫ్రెంచికట్టు మీసాలతో ఎవడన్నా, టకటకలాడుతూ, వస్తూవుంటే, వాడ్ని ఏ సార్జెంటుఅన్నకోదుకో అనుకుని అపుడ దూరానికిపోయి బెదురుతూచూస్తాము. అనుకరణాలుంటే వేషాలెంతలో వెయ్యాలె. చూస్తూచూస్తూ వుండగనే సంజీవరావు సావిత్రి వూరుకునేవాడు. విగ్గుపెట్టుకుని, కోకకట్టుకుని క్షణంలో నాటకరంగమున పురుషులు స్త్రీలకింద మారిపోతున్నారు. భ్రమింపజేయడానికి వేషాలెంత సార్థకమనుకున్నారు. ఇక స్త్రీ, క్షణంలో. పురుషుడుగా మారిపోగలదు. అంటే సహజలక్షణాలలో కాదు. వేషంలోమూరెడు తోకగల కుచ్చులపాగా పెట్టుకుని, బందోబస్తయి సిల్కువర్టు తొడిగి, పరకాలా యిజారుతో స్త్రీతయారయిందా ఒక జమీందారుని ముస్తాలకొడుకులాగ తయారవుతుంది. విశాల కీసూత్రం తెలుసు.

వూళ్ళో ఒకవదంతి ప్రాకిపోయింది. అది అందరికి తెలుసునో తెలియదో కాని అసలువారికి మాత్రం తెలియదు. దఫేదారు పుల్లయ్యమట్టుకు సాని చెవులో అరహస్యం వూదాడు. అదేదో కొంచము సేపటిలో భోధపడుతుంది.

కొంచము చీకటి పడుతుంది. ప్రకాశరావు, అతని సాని మేడమీద హాలులోని వుయ్యాల పలకపై కులాసాగా వూగుతూ కవురులు చెప్పుకుంటున్నారు. వారి ప్రసంగ మీక్రింది విధముగాజరిగింది.

జాము:—సానిదేమిచెప్పినా బూటకము. సానిదెంతనిజాయితిగా వున్న నాటకము.

ప్రకా:—ఇప్పుడేమొచ్చింది?

జాము:—ఏమీలేదు. సానిదంటే లోకువ. సాని మాట బూటకం. ఎంతనిజాయితీగా వుంటేనేమి? ఎంత మనసిచ్చి తిరిగితేనేమి? సానిది విషసర్పమని, సాని బుద్ధి కార్చిచ్చని, సానిపొందు ప్రాణాంతకమని, యిలా లేనిపోనివి కల్పించి, మమ్మలను గడ్డిపరకలక్రింద తృణీకరిస్తున్నారు.

ప్రకా:—ఎవరు? సానుల సారమెఱుగని చవటలు.

జాము:—సంసారిదేమిచెప్పినా నిజమవుతుంది. అవిడెన్ని పోకడలుపోయినా మంచివే అవుతవి.

ప్రకా:—ఎందుకీదండకము

జాము:—ఎందుకూలేదు. అచ్చే మీకుమట్టుకు తెలియదా. ఏమిటి?

ప్రకా:—నాకేమి తెలియదు.

జాము:—(ఊయలనాపి) తెలియదూ?

ప్రకా:—తెలియదు.

జాము:—నిజంగా!!

ప్రకా:—నిజంగానే.

జాము:—అయితే పోనీలెండి.

ప్రకా:—(ఆత్రముతో) అదేదో చెప్పవు.

జాము:—అచ్చే ఏమీలేదు.

ప్రకా:—చెప్పకపోతే వొట్టు.

జాము:—ఒట్టూలేదు గిట్టూలేదు.

ప్రకా:—(కొంచము కోపముతో) అయితే చెప్పవన్నమాట.

జాము:—చెప్పడానికేముంది.

ప్రకా:—చెప్పేదవా? చెప్పవా? రెండేమాటలు,

జాము:—(ఆశ్చర్యమును సూచించుచు) మీకు తెలియదా ! తెలియనే తెలియదా !! నిజంగానేనా !!

ప్రకా:—అబ్బే తెలియదు. ఒట్టేసరి.

జాము:—ఒట్టే!

ప్రకా:—ఒట్టే (ఒట్టు వేయును).

జాము:—అయితే యిలారండి. (చెవిలో) మీఆవిడ ఎవరితోనో...

హృదయంలో యీమాటలు తేలుకొండై కుట్టేటప్పటికి ఒక్కగంతువేసి దిగాడు ప్రకాశరావు వుయ్యాలపలకనుండి. కోపముతో వణికిపోయాడతడు. ఒక్క నిమిష మేమి కనుపించలేదు. అతని వైఖరి చూసి సానిది భయపడి ఎటులకూర్చున్నది అటులనే కూర్చుంది.

జాము కాసేపటికి తెంపుచేసుకుని "ఏమిటీ ఆర్భాటం?" మన్నది.

ప్రకా:—ఆర్భాటములేదు గీర్భాటములేదు. నిజమేనా యీసంగతి?

జాము:—నిజమో అబద్ధమో నాకు తెలియదు. నేను విన్న సంగతది.

ప్రకాశరావు మారు మాట్లాడలేదు. చరచర మెట్లు దిగి యింటిమొహం పట్టాడు.

అతడు మెట్లుదిగిన వుత్తరక్షణాన్నే డఫేదారు పుల్లయ్య ఎవ్వరినో వెంటబెట్టుకుని హాలులోనికి ప్రత్యక్షమయాడు.

## 3

సర్వసుఖాలు సానితోటే వుందనుకునే వాళ్ళకు ప్రపంచకమంతా అంధకారమయి వుంటుంది. ఎందుకంత ప్రకాశరావు రయ్యిమని వస్తున్నాడనుకున్నారు: సరళ కనుబడినవెంటనే ఆవిడకు ప్రాయశ్చిత్తము జేసి మనోశాంతి నొందుదామని. మనోశైకల్యాని కంత కారణమేమో! సరళను అతనుఎటుగడా ఇట్టే సానిది చెప్పగనే నమ్మడమే? అవును. ప్రపంచక ధర్మమే అంత: ఎవ రేమిచెప్పిన ముందు నమ్మి పూరుకోవడం. ఇక సానిదిచెబితే మరింత.

ప్రకాశరావు యింటికి వచ్చి తలుపుతట్టేటప్పటికి ఒక ముసలిదాసి తలుపుతీసి, "బాబు! జాగ్రత్త ఇంట్లో ఎవడో మగవాడున్నాడని" చిరునవ్వు నవ్వింది. 'నాకు తెల్సునులే' అని ప్రకాశరావు దాన్ని ఒక త్రోపుత్రోసి లోపలజొరబడ్డాడు. హాలుతలుపులు తీసేవున్నాయి. ఒక్కగంతున హాలులోనికి జొరబడ్డాడతడు. హాలులో చూసేటప్పటికి, తిరిగిన మీసాలతోటి, తీర్చినపాగాతోటి కోటుతోటి మిరమిరలాడ్తూ మగవాడొకడు కనుపించాడు. 'సరళ అతనిచెంత సరసోక్తులాడుతూ వున్నట్టు కనుపించింది. మగవానికి యింతకన్న క్రోధాయుక్తమగు దృష్టి యింకొకటిలేదు. తానెన్ని సానిండ్లనన్న తిరుగవచ్చును కాని, తనభార్యమాత్రం పరపురుషుని కంటబడకూడదు.

నాడు హిరణ్యకశిపు సంహారసమయమందు నరసింహస్వామికి వచ్చినవుగ్రహామే వుగ్రహాం, నేడీ మగబిడ్డను చంపుటకు ప్రకాశరావుకు వచ్చినఆగ్రహామే ఆగ్రహాము. క్రోధమావేశమయితే సామాన్య పురుషుడైన రుద్రున్ని మించివుంటాడు. ఇక్కడే ప్రకాశరావుకు చెప్పరానంత కోపము వచ్చింది. ఆవేశ మెక్కువయి పోయింది. కండ్లు నిప్పులు చిమ్ముతున్నాయి. తలవెంట్రుకలు నిక్కబొడుచుకుని ఏదు పందిముండ్లలాగ నిలబడినవి.

కాని మగబిడ్డ జంకూగొంకూ లేకుండా మీసాల నదుముకుంటూ తీక్ష్ణంగా ప్రకాశరావును చూస్తూనే వుంది. సరళ కొకప్రక్క భయం, ఒకప్రక్క నవ్వు.

రెండు పెద్దపులులు ఎదురైతే గాండ్రింపులు వినబడుతవి; రెండుసింహాలు తారసిల్లితే గర్జనలు వెలువడుతవి. కాని యిద్దరు మనుష్యులు ఢీకొంటే సకిలింపులు ముందు బయలుదేరుతవి.

ప్రకా:—(సకిలించి గట్టిగా) ఎవరు నీవు ?

మగ:—(తిరుగ సకిలించి నిర్లక్ష్యముగా) నేను మనుష్యుణ్ణి.

ప్రకా:—మనిషివా పశువువా?

మగ:—మనిషి పశువేమో. పశువు మనిషి కాదు.

ప్రకా:—ఇక్కడి కెందుకొచ్చావు?

మగ:—నీ వెందుకొచ్చావు?

ప్రకా:—ఇది నా యిల్లు.

మగ:—ఇది మా వారియిల్లు.

ప్రకా:—ఏమిటి వెధవ పేలాపన. ఇంటిలో కాలుపెట్టడానికి ఎన్ని వేల గుండెలున్నాయి. అది నా భార్యని తెలియదా.

మగ:—నీ భార్య రంగులమేడలోని సాని. ఇది నాభార్య (అనిసరళను దగ్గరకు జేర్చుకొనుచు.)

ఇక ప్రకాశరావు చూచి వూరుకోలేక పోయాడు. అంగిలో దాచిన బాకు పైకితీసి, విశ్వరూపమెత్తి వాళ్ళవైపు కురికాడు. అతనికిజడిసి, గాలికి విరగబడ్డ చెట్టుకొమ్మలాగ సరళ స్పృహతప్పి నేలకొరిగింది విశాలకూ భయముపుట్టింది. ఏమిచేయుటకు ఆమెకు కాళ్ళాడలేదు చేతులాడలేదు. బాకు పరశురాముని గొడ్డలివలె తనప్రాణములను హరింపనున్నదని ఆవిడ గ్రహించింది. అయినను ఆవిడతొనకలేదు బెనకలేదు. కాని మనలో ఒక సహజగుణమున్నది. కంటిలో ఏదన్నా నలుసు పడబోతే గబుక్కుని కన్నుమూసుకుంటాము. తేలు మనప్రక్కన దడదడ ప్రాకుతూవుంటే ఒక్క గంతువేసి ఆమడదూరంలోపడ్తాము. ఇక్కడ విశాలా అంతే. బాకు తనమీద పడబోయే క్షణాన్న అవిడవంగి ప్రక్కకుతప్పుకుని మూలకు పరుగెత్తింది. కాని బాకు మాత్రం పౌరుషంతో బీరువా చెక్కతలుపుకు గ్రుచ్చుకుంది. ప్రకాశరావు బాకును లాగ ప్రయత్నిస్తున్నాడు. ఇవతల విశాల జారుచున్నపాగా నదుముకోలేక, "ఆడువారపైనన నీ ప్రతాపమున్నది." "నీవుకూడ ఆడుదానవా" అని ప్రకాశరావు తెల్లబోయిజూచాడు. ఇప్పటికావిడ తలపాగా జారి నల్లని పొడుగాటి వెంట్రుకలు ఆవిడ భుజముపై ప్రకాశిస్తున్నాయి. 'అవునని' ఆవిడ అంటించుకున్న మీసములను దీసివైచినది. ప్రకాశరావామెను గుర్తించి "విశాలా! విశాలా!..." అన్నాడు.

ప్రకా:—విశాలా! ఎంతసాహసము...ఆ బాకే గ్రుచ్చుకొన్నచో సమసియుందువే.

విశా:—(సరళను సేద దీర్చుచు) నీ చేష్టలే ఈవిడ హృదయమును బాణాలై గ్రుచ్చుకొన్నవి. ఈ బాకు గ్రుచ్చుకొన్న నా కంత...

సరళ:—(లేచి విశాలను ఉద్దేశించి) వదినా వి

## కవిసాధన

౧

తెగిన మాటకు
తడవు కొంటూ
ఎంతసేపో
యతుల కొఱకై

అతుకు కుదరక
ఆలకించి
వెదకుకొను నోయి!—

౨

ప్రాస కొఱకై
ధ్యాస పాఱక
గొంతు కందున
గొణగు కొంటూ

ఎంతసేపో ఆలకించి
పంతమున—దా
నంతు కనుగొనును—

—కొడాలి వేంకటరాజారావు.

కేమిటయిా దెబ్బతగుల లేదుకదా.

ప్రకా:—స్త్రీలు ఆడబిడ్డలను మగబిడ్డలుగ జేయగలరు.

విశా:—పురుషులు సానులను సంసారులక్రింద భావింపగలరు.

ప్రకా:—మా సాని అందరి వంటిది కాదు.

విశా:—కుమ్మరావమున యిత్తడి ముంతలుండునా?

ప్రకా:—దాని సంగతిసందర్భములు తెలియక అట్లనుచున్నావు.

విశా:—ఆలాగా ఆవిడను నేనొకసారి చూడవలెనని వున్నది, తీసుకుని వెళ్లెదవా?

ప్రకా:—అవశ్యం. ఎప్పుడు?

విశా:—ఇప్పుడే.

## ౪

ప్రపంచకములో అన్ని వస్తువులు అందరకు గనబడవు. దూరములోని వస్తువులు కనుబడువారికి దగ్గిరలోని వస్తువులు కనబడవు. దగ్గిరవస్తువులు కనబడువారికి దూరములోని వస్తువులు కనబడవు ఇటువంటి మాంద్యమే మనస్సుకుకూడా వుంది. అదేదంటే మంచి వస్తువులను వెగటుక్రింద భావించడం; వెగటువస్తువులను మంచిక్రింద గణించడం. ఈ మాంద్యములో సుగుణవతి దుర్గుణవతివలె కనుపిస్తుంది; దుర్గుణ సుగుణవలె కనుపిస్తుంది. దీనికంతా కారకం భ్రమ. ఎఱ్ఱద్దం పెట్టిచూస్తే ప్రపంచకమంతా ఎఱ్ఱగా కనిపిస్తుంది. పచ్చద్దంపెట్టిచూస్తే ప్రపంచకమంతా పచ్చగా కనుపిస్తుంది. ఇట్లాగే భ్రమఅనే తెరగుండా చూచిన ఏవస్తువన్నా మరలుకొల్పతవి. మన ప్రకాశరావుకు సానిపై భ్రమ వుండడంవల్ల ఆవిడ అతనికి సాధ్వీమణి అరుంధతివలె కనుపిస్తూవుంది. ఎందుచేతననగా 'వినగాని లోతుతెలియదను' తత్వం అతనికింకా బోధపడకపోవడంవల్ల.

విశాల ప్రకాశరావులు జాము యింటికివచ్చారు. 'ఇదే యిల్లన్నాడు' ప్రకాశరావు. 'అయితే దొడ్డిత్రోవ తియ్యమంది విశాల. రహస్యార్థమువచ్చేవారు ధారాళముగా రారు. దొడ్డిత్రోవనో, గోడగెంతో వస్తూవుంటారు. ప్రకాశరావు గోడగెంతి దొడ్డితలుపు తీసాడు. ఇద్దరు లోపలప్రవేశించారు. సద్దుచేయక మేడఎక్కారు. ఒకగదిలో ఒకడు మంచముకడ్డముగా పడున్నాడు. బ్రాందిబుడ్లు గ్లాసులు అతనిముందు, మేజాపై ప్రకాశిస్తూ, 'యిది మా మాహాత్మ్యమ'ని, చెబుతూవున్నట్టుగా వున్నవి.

విశా:—ఇత నెవరు?

ప్రకా:—ఏమో ' నాకు తెలియదు.

విశా:—ఇంతేనా అన్నది.

ప్రకా:—...... ........

హాలులో నడుస్తూవుంటే వీళ్లఅడుగుల చప్పుడుకు క్రిందనుంచి యొక ధ్వనివచ్చినది.

ధ్వని:—(మెల్లిగా) పంపించనా.

ప్రకా:—ఎవరిని.

విశా:—(ప్రకాశరావును ఆపి) కేకవెయ్యకు.

ప్రకా:—(విశాలతో మెల్లిగా) దానిఅర్థమేమిటి.

విశా:—(ప్రకాశరావుతో) ఇంకొకరిని ..(ధ్వనిని వుద్దేశించి మెల్లిగా) వద్దు.

ప్రకా:—చాలా ఆశ్చర్యముగావుందే.

విశా:—మరేమనుకున్నావు?

హాలునడచి యివతల పడకగదివద్దకు [illegible]రారు. తలుపు లోపలగడియ వేసివున్నది. ప్రకాశరావు తలుపుసందులగుండ చూసి విభ్రాంతితో వెనుకకు అడుగు పెట్టును.

విశా:—తప్పేమిటదనితెలిసిందా?

ప్రకా:—ఎవరిది. వికటచరిత్ర కపట పతివ్రత. దానిదే ఆ సానిదే. బొల్లిమాటలజెప్పి వొల్లనమ్మకొను జాతి కీబుద్ధికాక మరి యేబుద్ధివచ్చును.

విశా:—వూరక వారినేల దూషించెదవు. వేరుగతి లేక వారీవృత్తి నవలంబించిరి కాని వారికిమాత్ర మీ వృత్తివల్ల సుఖమా?

ప్రకా:—అవును వారి నననేల? సర్వమెఱింగియు సానివలలోజిక్కి సంసారమును జెడగొట్టుకొనుచున్న మూఢుడను. తప్పునాది కాక యింకెవరిది?

విశా:—ఇప్పటికైనను తెలిసినదా?

ప్రకా:—ఆహా! నేటి కీవిధమున నీవు తెలియ జేయకున్న యింకయూ నఘాతమునబడి, ఎంగిలికూటి కాసించు కుక్కవిధమున దీని యింటిచుట్టు నింకను తిరుగుచుండెడివాడను.

విశా:—సర్వము విశదమయినదా. ఇక పోవుదమా?

ప్రకా:—ఆహా! ఇక నొక అరనిమిషమైన నుండ జాలను.

ఇప్పటికి ప్రకాశరావుకు తెలసివచ్చింది: గాజురాయికి వజ్రానికి గలభేదము; కాఫీహోటలులోని సరకులకు యింటిలోచేసిన పంచభక్ష్య పరమాన్నాలకు ఆరోగ్యములో గలతేడా; సానికి సంసారికి గలతారతమ్యము. పరాయి మగవానితో తనస్త్రీ సంచరించుచున్నదన మగవాని కెంత ఆందోళనుండునో, అంతకు పదిరెట్లుఆందోళన తనభర్త పరస్త్రీల కాధీనమవ నుండునని గ్రహించాడతడు.

ఒకనాటిరాత్రి వెన్నెలలో ప్రకాశరావు మేడమీదను కూర్చుని నిండుచంద్రున్ని వినోదంగా చూస్తూ వున్నాడు. ప్రక్కనే సరళ కూర్చునివుంది. వారికి చెంతనున్న నీటితొట్టిలో చంద్రుని ప్రతిబింబము కదుల్తూవుంది. ప్రకాశరావు ఆ రెండిటిని పరకాయించి చూస్తూ వున్నాడు.

సరళ:—ఏమిటంత తీక్షణంగాచూస్తున్నా రన్నది.

ప్రకా:—చంద్రునికి, నీటితొట్టిలోని చంద్రునికి గలతేడా.

సరళ:—ఏమిటా తేడా?

ప్రకా:—శాశ్వతమైనది చంద్రబింబము చలించునది చంద్రునిప్రతిబింబము ఏది? కదుపు నీటితొట్టిని.


సరళ:—(తొట్టిని కదుపును. చంద్రుని ప్రతిబింబము మాయమగును.)

ప్రకా:—చూసితివా! మాయమైనది. భార్య మనుజునకు శాశ్వతమయినది. సాని చలించునది.

సరళ:—ఎప్పటినుంచి యీనీతి.

ప్రకా:—ఆడబిడ్డ మగబిడ్డయిన నాటినుంచి.

—నాయని శేషాచల రావు.



"వెన్నెలలో ప్రకాశరావు మేడమీదను కూర్చుని నిండుచంద్రున్ని వినోదంగా చూస్తూవున్నాడు. ప్రక్కనే సరళ కూర్చొనివుంది."

# రైతు పాట

౧

ఆగునా జీవాలు
సాగునా లోకాలు
రాజుగా మనమెంచి
రైతు చూడకపోతే
దేశాలు తలలెత్తునా—
దాస్యపున్—పాశాలు తావీడునా.

౨

ఆవు లంబాయంచు
అరచు రైతులఇండ్ల
కల్యాణలక్ష్మిన్
కనులజూడని నాడు
సౌభాగ్య మెతెంచునా—
దేశపున్—సౌందర్య మేనిల్చునా.

౩

పిల్ల పైరులమీద
చల్లతెమ్మెర వీవ
గాంచి యానందించు
ఘనుని గాంచకపోతె
సృష్టినైజము తేలునా—
ప్రకృతిని—భ్రష్టులై పోకుందుమా.

౪

పొలములో రైతుండి
పొలికేక బెట్టగాన్
జయభేరి మ్రోతలై
జగతి నిండకపోతె
వీరరక్తము పారునా—
నిలువెల్ల—శూరత్వ మడుగంటదా.

౫

రైతు చేదండంబు
రాణింప కోదండ
పాణియని భావించి
ప్రార్థింప కుంటేను
భక్తియే మనకబ్బునా—
నిర్వాణ—ముక్తియే లభియించునా.

౬

అధికారి యాతనల్
అంతలోనసె మ్రింగి
ఆదరించెడి రైతు
నాదరించక పోతె
భూతదయయె గల్గునా—
సౌభ్రాతృ—బుద్ధియే మనకబ్బునా.

౭

పగలు రాతిరి యనక
పాటుబడు నా రైతు
కడగండ్లలన్ గాంచి
కన్నీరు రాల్పమి
ఇల పరిశ్రమ లంతమై—
వాణిజ్య—మేమూలో యడుగంటదా.

౮

రైతె దేవుడు మనకు
దేవుడూ ఒకరైతే
రైతుదేవుడు మనల
రక్షింప కుంటేను
ప్రళయమే రాకుండునా—
భూదేవి—భగ్నమై పోకుందునా.

—శెట్టిపల్లి వెంకటరత్నంచౌదరి.
—శ్రీ గిరిరాజ రామారావు.



# కోడికూఁత

౧

అద్ది మాపద్మవెల్మశౌర్యానలంపు
చిటచిటార్భటితోఁ గొంత చెలిమిఁ జేసి
యాంధ్రదేశపరిశ్రుతమైన దకట
తెల్గులీనాటివారు గుర్తింపలేరు.

౨

విజయలక్ష్మీపరీరంభవిధికి వేగు
వెలమదొరల సమగ్రదోర్వీర్యమునకు
కప్పురపుటారతుల నెత్తు కన్నెపడుచు
కంఠనినదంబుతోఁ గృతి కల్పబడియె.

౩


కత్తులన్ జూచి మీసలు గడిపి కంటి
కొలకులఁ వెల్మ లెఱసంజ వలచునాడు
మంతుకెక్కిన యీకూఁతమహిమ నేడు
తలఁపునకునైన రా దెంతదైన్యమొక్కొ.

౪

అది గతప్రాణవీరభటాత్మకైన
స్వస్తివాక్కట, భీతివిహ్వలవరూథి
నీవిధాతల కంటకక్ష్వేడనంబు
అద్ది నాచెవిబడి యప్రయత్నరచిత
హృద్యకవనంబువలెనెంతో యింపుగూర్చె
మన్మనోవృత్తి కెట్టిసంబంధమొక్కొ
ఏపురాజన్మలో దీని నెఱిగినానొ
యోపికంబట్టివిందు నింకొక్కమాటు.

—కొండపల్లి గోపాలరావు,

—హరి రామలింగశాస్త్రి.



# నోబెల్ వాఙ్మయ బహుమానములు

నోబెల్ వాఙ్మయ బహూకరణముచే గౌరవింపబడిన విజ్ఞాని నేడు అంతర్జాతీయసారస్వతవియత్తలమున నింశుకళలతో వెలుగుచున్నాడు.

## బహుమతుల ఆది.

వాఙ్మయరాజ్యాభిషేకమో అను నట్లున్న యీ నోబెల్ మహుమతులు ౧౯౦౧లో స్వీడను దేశమున పుట్టువొందినవి. భాషాదేవి ఆరాధకులు, ఉదారాశయులు అల్‌ఫ్రెడ్ బెరన్‌హార్డు నోబెల్ గారు దీనికి జనకులు. వీరు స్వార్జితధనము నంతయు ఈ బహుమతులనిధికిగా ఇచ్చివేసినారు. నోబెల్ సంతతికి ధనమొసంగి, వారిని నిష్ప్రయోజకులుగా చేయరాదను విశ్వాసముగలవాడు; అందుచే తనధనమును సద్వినియోగపరుపవలయునని నైతికావేదనము బొందినాడు. ఈ ఉన్నతభావమును ప్యారిస్ నగరమందున్న స్నేహితురాలైన ఒకప్రభ్వికి (బ్యారనెస్ బెర్తావాన్ సట్‌నర్) వ్రాసినలేఖయందు ౧౮౯౩ సం॥ జనవరి ౭ తేది సూచింపబడినది. ఇటువిధముగ ౧౮౯౫ నవంబరు ౨౭ తేది మరణశాసనమును వ్రాసి ౧౮౯౬ డిసెంబరు ౧౦ తేది 'సాన్‌రిమో' నగరమున స్వర్గస్థులైనారు.

ధనాకాంక్షితులైన బంధువులుకొందరు యీఘనపరాభిమతమును భగ్నముచేయ యత్నించిరి కాని, నోబెల్ కుటుంబీకుడు ఎమాన్యుయల్ గారి నిరోధముచే తీవ్రవ్యాజ్యానంతరము యీమహాభావునిసంకల్పము రూపమునొంది నేడు మహాగౌరవసంస్థగా ఎన్నబడుచున్నది. తరువాత న్యాయశాస్త్రానుకూల్యమైన కొద్దిసవరణలతో ౧౯౦౦ జూను ౨౯ తేది స్వీడనురాజుచే అంగీకరింపబడినది. నోబెల్ గారిఆస్తి నంతయు ధనముగా మార్చి మూలధనమునకు వడ్డీని వారి యిచ్ఛానుసారము ప్రతిసంవత్సరము ఐదు శాఖలలో "మానవజాతికి సుస్థిరమైన గొప్పమేలునుగూర్చిన వారికి" ఒసంగుటకు నిర్ణయించిరి. బహుమతుల నొసంగుటయందు జాతిమతవివక్షతల పాటింపరాదని నోబెల్ తన 'విల్'నందు ప్రస్ఫుటముగ శాసించిరి.

## బహుమతుల వివరము.

ఐదుశాఖలందు బహుమతుల యేటేటా ఒసంగవలయునని నోబెల్ గారే నిర్ణయించిరి. బహూకరణములకు నిర్ణయింపబడినశాఖలు:—

౧. ఫిజిక్సు—అత్యంతప్రధానపరిశోధనమును గావించినవానికి

౨. రసాయనశాస్త్రము (కెమిస్ట్రీ)—

౩. శరీరశాస్త్రము, వైద్యశాస్త్రములు మానవజాతికి మేలుగూర్చగలిగిన నూతనాంశమును కనుగొనినవానికి

౪. వాఙ్మయము—మహోదారాశయపూర్ణకృతిని సృజించినవానికి

౫. దేశముల సౌభ్రాతృత్వముల పెంపొందజేసినవానికి; సమరశక్తుల తగ్గించ పాటుబడి శాంతిస్థాపనకై పాటుబడినవానికి

ఒకశాఖయందే యిద్దరుఅభ్యర్థులు అర్హులని తలంచబడిన ఆశాఖధనము యిద్దరికిని సమముగ పంచిపెట్టబడును. బహుమతి సుమారు లక్ష రూపాయ లుండును. అభ్యర్థులు ఫిబ్రవరిమాసమున దరఖాస్తులను, తమకృతులను స్వీడనునందలి పరిశోధికారులకు పంపవలయును బహుమతిబడసినవారిపేర్లు నవంబరులోనే తెలియుచున్నవి కాని, డిసెంబరు ౧౦ తేది—దాతవర్ధంతినాడు బహుమతిలాంఛనములు--ఒకబంగారుపతకము, అధికారపత్రము ఒసంగబడును.

బహుమతులబడసినవారు ఆరుమాసములలోపల ఆయావిషయములనుగూర్చి స్టాక్‌హోంనందు ఉపన్యసింపవలయును; శాంతిబహుమతివారు మాత్రము ఆస్‌లోనం దుపన్యసింపవలయు. ఫిజిక్సు, కెమిస్ట్రీలకు స్టాక్‌హోంనందలి "స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సు" వారును; శరీరశాస్త్రము, వైద్యములకు- "కరోలైన్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్" వారును; వాఙ్మయమునకు- "స్వీడిష్ అకాడిమి" వారును; శాంతికి-"నార్వే

జియర్జ్ స్టార్ థింగ్" వారిచే నియమింపబడిన ఐదుగురి ఉపసంఘమువారును నిర్ధారణ గావింతురు.

## నోబెల్ గారి జీవితాంశములు.

దాతతండ్రి ఎమాన్యుయల్ స్టాక్‌హోమునందు సైన్సు అధ్యాపకులు మొదట వీరు ప్రేలుడువస్తువులు మొదలగు మారణశక్తులందు పరిశోధనలు గావించుచుండి, శస్త్రచికిత్సలందు బాధలను తగ్గించు కొన్ని పరికరముల సృష్టించెను. కొద్దికాలము ఇటలీయందు నౌకానిర్మాణమున గడపిరి. వీరిపుత్రులుగూడ శాస్త్రపరిశోధకులే! ఎమాన్యుయల్ పెద్దకొమారుడు ఇంజనీరు. ౧౮౬౪లో పరిశోధనల సందర్భమున జరిగిన ఒకప్రేలుడు ప్రమాదమున కనిష్ఠపుత్రుడు మృతిజెందినాడు. తండ్రి వికలాంగుడైనాడు.

ఈబహుమతులజనకుడు ఆల్‌ఫ్రెడ్ బెరర్డ్ హార్డు నోబెల్ స్టాక్‌హోమునందు ౧౮౩౩లో జననమందినాడు. శరీరారోగ్యములేక మరణపర్యంతము తలనొప్పితో బాధపడుచు, సదా 'బ్యాండేజీలు' తలకు కట్టుకొనియే పరిశోధనలు గావించుచుండినాడు. తల్లి క్యారలైన్ ఎరియాట్ చాల అనురాగముతో పెంచినది: పెద్దపెద్ద పుస్తకములను చదివి కుమారునకు వినిపించుచుండినది. 'ఆల్‌ఫ్రెడ్ చాలగొప్పవాడగును' అని విశ్వాసముతో పలుకుచుండెడిది. తరుణవయస్సున ఆల్‌ఫ్రెడ్ ఒకర్తును ప్రేమించుచుండ ఆమె మరణించినది, అంత వైవాహికవైరాగ్యము గలిగి, పెండ్లిమానినాడు.

మొదటినుండియు కెమిస్ట్రీ, ఫిజిక్సు, మెకానికల్ ఇంజనీరింగు నందు అభిరుచిని జూపుచుండినాడు. ౧౭-వ ఏట నౌకానిర్మాణము నభ్యసింప అమెరికాకు వెడలినాడు. మాన్యకార్యములచే నడచునట్లు తనతండ్రి కనిపెట్టినయంత్రమును అభివృద్ధిగావించినాడు. ౧౮౫౯లో ఆల్‌ఫ్రెడ్ దగ్గర ౧౩౭ డాలర్లుమాత్రముండినవి ఆసంవత్సరాంతమునకు ౨౦౦౦ డాలర్ల సంచయపరుపు గలిగినాడు. రెండేండ్లలో ఇది ౮౮౦ అయినది తాను నిర్మించినవాటి 'పేటెంటు'లను చాలమందికి అమ్మినాడు. దీనితోగూడ ఈయనకీర్తి స్వదేశము స్వీడనుకు ప్రాకి రాజు అభినందనములబడసినాడు

## పరహితేచ్ఛకు బీజము.

౧౮౪౩ లో తానునిర్మించిన పడవను పరీక్షించుచుండ అది మునిగిపోయి ఐదులక్షలడాలర్ల నష్టము కలిగినది. దీనికి జంకిపోక మగలప్రయత్నించి కృతసంకల్పుడైనాడు.

ఈసంఘటనము— విఫలపరిశోధకులైన శాస్త్రజ్ఞుల మానసికవైకల్యమునుండి రక్షించి, ప్రోత్సహించుటకు ఒకనిధిని నెలకొల్పవలయునను ఘనసంకల్పమును ఈయనయందు మొలకెత్తించినది. తరువాత స్వదేశమున తండ్రినిచేరబోయినాడు. ౧౮౬౪-౬౬లో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పరిశోధనలుసలుపుచుండ అకస్మాత్తుగా 'డైనమైట్' అను ఒకప్రేలుడువస్తువును ఆనుషంగికముగ కనుగొనినాడు. ఇది దేశదేశములకు వ్యాపించి, ఫ్రాంసురాజు మూడవనెపోలియన్ ధనసహాయమును గూడ బొందినది. మరల అమెరికాకు పోయి, తండ్రి మిత్రుడు— డాక్టర్ బ్యాడ్‌మ్యాన్ గారి సహకారముతో లాస్ఏంజిల్సునందు డైనామైట్ కర్మాగారమును నెలకొల్పినాడు అచిరకాలములోనే యూరపునందు వివిధదేశములందు యిట్టికర్మాగారముల నిర్మించినాడు. చరమదశయందు సాన్‌రిమొయందు పరిశోధనాతత్పరుడై స్వర్గస్థుడైనాడు.

మొంటిశాంతిబహుమానము నోబెలుగారికి ప్రైవేటుసెక్రెటరిగా చాలకాలముపనిచేసిన బ్యారన్ ఫాన్ వాన్‌సల్‌నర్ అను నామెకు 'మీ ఆయుధముల విసర్జింపుడు' అను పుస్తకమున కొసంగబడినది. "నాగరికదేశములన్నియు తుదకు ఆయుధ విసర్జనము గావించు" నని ఆయన నమ్ముచుండినాడు. మానవజాతి అభివృద్ధిసహాయములకు గావలసిన ధనమునంతయు వినియోగముచేసినాడు. ఈయన సహేతుకసమాజవాది భాషావేది, తత్త్వవేత్త, మనోజ్ఞమైనప్రాసంగికుడు, అభిరుచులూర కథల జెప్పనేర్పరి, అన్నతహృదయుల లఘుమనస్కుల వీరుటయందుదిట్టడు

(బహుమతులబడిసిన వారిపేర్లు, వారిగ్రంథములను గూర్చిన కొద్దివివరములు పైమాసపుసంచికలో తెలుపుదును )

—మరుపూరు కోదండరామరెడ్డి

# హిట్లరు

## (నేటి జర్మను దేశపు నియంత)

"జన్మమున జర్మనీ" అను మాటలలోనే నేటి జర్మను దేశపు నియంతయగు హిట్లరు ముఖ్యాదేశము ఇమిడియున్నది. హిట్లరు మహావక్త. ఈతడు మిత్రులతో సంభాషించునపుడును, తనగృహమున మాట్లాడునపుడును ఏదోయొక మహాసభాస్థలిని ఉపన్యసించుచున్నట్లు బిగ్గరగాను ఆవేశముతోను మాట్లాడును. నెమ్మదిగా మాట్లాడుటకు ప్రారంభముచేసినప్పటికిని పోనుపోను తీవ్రముగా మాట్లాడుచు ఏగోడమూలకో లేక ఇంటికప్పువైపో చూచును; బల్లగ్రుద్దును; కేకలు వేయును.

ఈతడు నలువదియారు సంవత్సరములక్రిందట ఆస్ట్రియాదేశమున జన్మించెను. నల్లనివెంట్రుకలు; నీలివర్ణయుతములయి నిప్పువలె ప్రకాశించుచుండు నయనములు; ఆకారము వికృతము; అయినను ఆస్ట్రియా దేశపుసాంప్రదాయముల ననుసరించి సుందరుడనియే చెప్పవలయును. అత్యద్భుతనటనాధురీణుడగు నటుని ముఖలక్షణములవలె యెప్పుడును ఈతని ముఖము ఆవేశపూరితమై కనపట్టుచుండును.

ఈతనితండ్రి సుంకములశాఖోద్యోగి. హిట్లరును గూడ నేదోయొక యుద్యోగమున ప్రవేశపెట్టవలయునని యాతడుద్దేశించెను. హిట్లరున కది బొత్తుగా నిష్టము లేకపోయెను. ఈతడు చిత్రకారునిగనో లేక శిల్పిగనో జీవయాత్ర సాగింప నిశ్చయించి ప్రారంభమున నందుకొఱకై కృషి సలుపుచుండెను.

ఇట్టి [illegible] తెలిసికొనినప్పుడెల్ల ఈతడు చాలావిచారించుచుండును. అట్టిస్థితిలో తనకై పలుమఱు మాడి, తననోటికమికెడన్నమునుగూడ పుత్రుడగుతనకే పెట్టి పెంచిన తనతల్లిపై ఈతని కపారమగుప్రేమయుండుటలో నాశ్చర్యమేమి? బహువిధకష్టపరంపర నెదుర్కొని యున్నతపదవికి వచ్చెగనుకనే నాటి ఆదర్శములు నేటికిని ఈతని వివిధరంగములందలి ప్రవర్తనమున కనపట్టుచుండును. మధ్యమతరగతివారనిన ఈతనికి యభిమానము. వారి ఆర్భాటము, దర్పము ఈతని యందును కానవచ్చును, హీనస్థితియందున్నవారినిగాని హీనమైన ఆదర్శములుగలిగి హీనపుపనులుచేయువారిని గాని జూచిన ఈతనికి పరమాసహ్యము. అట్టిజాతిని జర్మనీలో ఉండనీయరాదని ఈతని యభిప్రాయము.

ఇతడాస్ట్రియానుడైనప్పటికిని, ఆస్ట్రియాసైన్యమున గాక బవేరియాసైన్యమున సైనికుడుగ చేరెను. చాల ధైర్యశాలి. అనేకయుద్ధరంగములందు పాల్గొనెను. ఒకసారి గాయపడెను. మఱియొకసారి విషవాయువుచే తాత్కాలిక నేత్రావరోధమునకు గుఱియయ్యెను. ఇప్పటికిని బహుబహువేడుకలప్పుడెల్ల ఈతనివక్షస్థలమున క్రాసుగుర్తు మెఱయుచునే యుండును. ఈతడు నిలుచున్నను కూర్చుండియున్నను సుశిక్షితుడగు జర్మను సైనికుడని గ్రహించుట సులభము.

"పశుబలమే బలము. ఆత్మశక్తి గొప్పదియే కాని ఆచరణయందుమాత్రము పశుబలమునకున్న ప్రచారము ఆత్మశక్తికిలేదు" అని ఈతడనును. గొప్ప పారిశ్రామికులతోగాని, వణిక్ప్రముఖులతోగాని పరిచయ మీతనికి తక్కువ. సామాన్యజనులు, డబ్బులేనిప్రజలు, వర్తకములేని వర్తకులు, పనిలేనియువకులు, ఋణములచే కృంగియున్నకృషీవలులు— వీరందఱును ఈతని మిత్రబృందము. ఈతడు రోమనుకాథలికు మతావలంబి. మతావేశము మెండు. ఇందులకు తల్లిశిక్షణమే కారణమని ఈతడొప్పుకొనును.

ఈతడు మ్యూనిచినగరమున నివసించును. ఈతనను చూచుట కెవ్వరైనను ఈతనియింటికిబోయి పిలిచిన స్వయముగా వచ్చి ద్వారము తెఱచి లోనికిగొంపోవును. అది యొకగది. జర్మను సాంప్రదాయానుసారముగ నుండును. నేలపైకంబళ్ళు పఱుపబడియుండును. [illegible]లపై వివిధములగు చిత్తరువులు. చిత్రకళ

ఈతనికి ప్రాణప్రదమైనది. ఆచిత్తరువులలో చాల భాగము ప్రకృతిదృశ్యములే. వానిని తిలకించును, తానుగూడ చిత్రకారుడను కాలేకపోయితినిగదా యని విచారించును. అది యొకలోపముగ భావించుకొను చుండును.

ఈతనిది నిష్కళంకమైనజీవితము. చుట్ట, త్రాగుడు మొదలగుదురభ్యాసము లేమియు లేవు. ఈతనిగృహావరణయందు పొగాకువాసనగూడ యుండదు. మిత భోజి. శాఖాహారి. ఆహారవిషయమున ఎంతమితముగ నుండునో, దుస్తులవిషయమునగూడ నీత డంతనిరాడంబరముగ నేయుండును. బయటకు బోవునప్పుడును అధికారరీత్యా ప్రవర్తించునపుడును ఈతడు ఉదారంగు కోటును ధరించుచుండును.

హిట్లరు బ్రహ్మచారి. ఇంతవఱకు వివాహమాడని కారణమున స్త్రీజాతియనిన ఈతనికి ద్వేషమని తలంపరాదు. వారికి సంబంధించిన వివిధసమస్యలను బహుజాగరూకతతో నీతడు విమర్శించుచుండును.

విరామసమయములం దీతడు సాధారణముగా చదువుచునేయుండును. పుస్తకములనిన ఈతనికి ప్రాణము. వాటిని చాలజాగ్రత్తగ నుంచును. తఱచు జర్మనుఫిలాసఫీగ్రంథములను, కార్లైలుమహాశయునిగ్రంథములను ఈతడు చదువును. కావున నవి యాతనిబల్లపై ఎప్పుడును నుండును.

చురుకుదనమున కీతడు పెట్టినది పేరు. యంత్రమువలె నొకదానివెంట నొకపనిని క్రమముతప్పక చేయును. అట్లుచేయుటయే ఈతనికి చాలయిష్టము. తనమోటారులో కూర్చొని మ్యూనిచిప్రాంతముల దిరుగుచుండును. సాధారణముగ నొంటరిగ బోవుచుండును. మోటారునకేదేని స్వల్పపుమరామత్తు అవసరమైనపుడు స్వయముగనే బాగుచేసికొనును. ఈయంత్రముల పరిజ్ఞానమున దనకుగల నిపుణతనుగూర్చి ఈతడనేకసార్లు చెప్పుచుండును.

సంగీతమునం దితనికి నభిరుచి మెండు. సినిమా ప్రదర్శనములనుగూడ బోవుచుండును. వేగ్నరు సినిమాలకు తఱచు బోవుచుండును. భావగర్భితములై భాషాసౌష్ఠవముగల వ్రాత లితనికి మిగులయిష్టము. తనబీదరికపుదినములలో సయితమీతడు వియన్నానగరములోని సినిమాలకు పోవుచుండెడివాడు. శరీరసౌఖ్యమునకై అంతలక్ష్యము చేయుచుండెడివాడు కాదు. ఈతని కేపనియు లేనప్పుడు బవేరియాకొండలలో తిరుగుచుండును. ఆనిమ్నోన్నతమగు కొండశిఖరములు, ఆశిఖరప్రాంతమందలి ప్రకృతిసౌందర్యము ఇతనికి చాల ఆకర్షణీయమైయుండును. తఱచుగా నీతడు తనవ్రాతబల్లయొద్దనే పనిచేయుచుండును. లేదా చిత్తరువులు వ్రాయుచుండును లేక గవాక్షద్వారముగుండ ప్రకృతిసౌందర్యమును తిలకించి ఆనందించుచుండును.

ఈతనికి స్వాభిమానము మెండు. దేశములోని వార్తాపత్రికల నన్నింటిని తనయదుపునం దుంచుకొనవలెనని ఈతని యుద్దేశ్యము. జర్మనీయుద్ధరణమునకుసంబంధించిన మంత్రాంగము లేవియుగూడ ప్రచురణమొనర్పగూడదని ఈతని యభిప్రాయము. విదేశీయులు ఎవరిచ్చవచ్చినట్లువారు తమనుగూర్చి యభిప్రాయములిచ్చుట ఇతని కిష్టముండదు.

మిత్రులనిన ఇతనికి విశ్వాసము చాలకలదు. ఎఱుకగల మిత్రు లెందరోయుండవచ్చును కాని వారి నందఱ లెక్కజేయడు. ఈతని నెఱిగినవారందఱీతడు ధృఢమనస్కుడనియే చెప్పుదురు. ఈతనిని లెక్కచేయని శత్రువులును పలువురు గలరు కాని నిజముగ నీతడంతధృఢమనస్కుడును గాడు, అంతచులకన చేయదగినవాడును గాడు.

ఈతనిహృదయము పాషాణమువంటిది గాడు. ఈతడు చూచినవాటి నందఱిని వలలోవైచికొనునంతటి స్ఫురద్రూపియు గాడు. ఈతడు గొప్పదేశాభిమాని. ఈతనికిగల ఆత్మవిశ్వాసమే ఈతనియందుగల యద్భుతమైన ఆకర్షణశక్తి.

ఇట్టి మహావ్యక్తి ప్రజ్ఞావంతుడు, ధీశాలి హిట్లరు జర్మనీదేశపు ఛాన్సలరుగనుండి ఆదేశపు పునరుద్ధరణకు బూనికొనియున్నాడు.

— ధేరం వేంకటనాథశాస్త్రి, బి. ఏ.

# ఇన్స్యూరెన్సు విషయములు

సుధీంద్రలాల్ రాయ్ గారు, ఎం. ఏ.

గతపదివత్సరములనుండియు హైందవభీమాకంపెనీలు భారతీయుల దేశభక్తిని రేకెత్తించి హైందవభీమాసంస్థలలో తమజీవితములను భీమాచేయించుకొనవలసిన ఆవశ్యకతను బాగుగా నిరూపింపగలిగినవి. అందుచే దేశమునసాగుచున్న జీవితభీమావ్యాపారములో విశేషభాగమును హైందవభీమాకంపెనీలు పొందగలిగినవి. అనగా హైందవ ప్రజాసామాన్యము తనకర్తవ్యమును నిర్వహింపగలుగుచున్నదన్నమాట. అయితే ఇపుడొక ప్రశ్నకలుగుచున్నది. హైందవభీమాకంపెనీలయందు తాము పట్టాలు తీసికొనుచుండుటవలన తామిదివరలకంటె ప్రస్తుతము హెచ్చు సేవాఫలమును వీనినుండి పొందుచుండుటను ప్రజలకు ఈ కంపెనీలు ప్రదర్శింపగలుగుచున్నవా? జీవితభీమా అనగా సేవ. మానవసేవను ప్రధానాదర్శముగగొననిది భీమాకంపెని ప్రజాభిమానమును గోలుపోవుటయే గాక ఇతరకంపెనీలకు అపదూఱుకూడ ఘటించును. ఒక భీమాకంపెనీ ఇన్‌సూరెన్సును గూర్చి బాగుగా ప్రకటించుటచే తనకు తాను [illegible]కొనుటయే గాక ఇతరకంపెనీలవ్యాపారాభివృద్ధికికూడ ఎట్లు తోడుపడునో అట్లే ఒక భీమాకంపెనీ చేయు చెడ్డకార్యముచే తనకు తాను హానిచేసికొనుటయేగాక ఇతరకంపెనీల కీర్తికి గూడ భంగము వాటిల్లజేయును. జీవితభీమాలకంపెనీసంఘములు ఇన్‌సూరెన్సుఇన్‌స్టిట్యూట్సు ఇప్పుడు ఏర్పడి కార్యక్రమమును నిర్వహించుటకు కడంగుచున్నవి. వివిధములగు భీమాకంపెనీలు తమతమపట్టాదారులకు చేయగలంత సేవయును చేయుచున్నవో లేవో కనుగొనుటలో వెంటనే ఈసంఘములు ప్రవేశింపవలయును.

మనదేశమున ప్రభుత్వపుశాఖలన్నియు — పోలీసు, పోస్టలు, రైల్వే — ప్రజాసేవచేయుటకు ఏర్పడినవే. కాని అవి యిప్పుడు నిర్వహింపబడుచున్నపద్ధతిని గమనించితిమేని అవి ప్రజలకు సేవచేయుటకుగాక ఏదియో గొప్పఉపకారముచేయుటకు ఏర్పడినట్లు పొడగట్టును. ఏదైన ఒకపోస్టు ఆఫీసునకు గాని, రైల్వేఆఫీసునకుగాని పొమ్ము. నీవు భారతీయుడవైనచో — ప్రాయికముగానీ కట్టిమర్యాదయు జరుగదు; అగౌరవముగా చూడబడుటయు అరుదుకాదు. విజాతీయప్రభుత్వమునకు గురియైనదేశమున ఇట్టిది సహజమే. భీమాకంపెనీ మాత్రము ఈరీతిప్రజాసేవాసంస్థ కాజాలదు. జీవితభీమావ్యాపారమున అమ్మువానికిని కొనువానికిని గలసంబంధము సన్నిహితమైనదై, తఱచుగా జీవితపర్యంతముండుచుండును. ఇచ్చట కొనువాడనగా పట్టాదారు తాను కొనినవస్తువుయొక్క గుణగణాదులనుగూర్చిన జ్ఞానమునకు ప్రాయికముగా దూరస్థుడును, ఈ కొనుగోలుచే తనకు గలిగిన హక్కులు బాధ్యతలు తెలియనివాడుగను పట్టాదారు ఉండుచున్నాడు.

### సుభాషితము

౬

కొద్దిరాబడిగల సామాన్యసంసారులు తమకుటుంబములను లేమినుండి కాపాడుటకు గాను కొంతఆస్తిని కూడబెట్టుటకైన ఒకఅమోఘసాధనముగ జీవితభీమా ఇపుడు గుర్తింపబడుచున్నది. ఉత్తమమైన రక్షణగా జీవితభీమాకుగల ప్రాముఖ్యమును నేటి ప్రపంచమును కలగుండువెట్టుచున్న దుర్భరదారిద్ర్యదినములు నూటిగా నిరూపించుచున్నవి.

—ది హానరబిల్ కల్నల్,
జి సి హారింగ్టన్.

హోదాగల గవర్నమెంటు ఉద్యోగమునున్న ఒకానొకపెద్దమనుష్యుడు నాతో చెప్పిన ఒక వృత్తాంతము వలన నేను ఈసంగతులను చెప్పగలవాడనైతిని. నేను పేర్కొనిన పెద్దమనుష్యునకు బ్రిటీషు భీమా కంపెనీలో ఒకదానియందును కెనడాదేశపు భీమా కంపెనీయందొకదానియందును, ఇండియన్ భీమాకంపెనీయందొకదానియందును పట్టాలుగలవు. ఆతడు తనకూతురు వివాహము నిశ్చయించుకొని కలకత్తాకువచ్చెను. భీమాకంపెనీలలో తనకు గల పట్టాలపై అప్పుతీసికొని ఆడబ్బుతో పెండ్లికివలసిన సరకులు కలకత్తాలో కొని పట్టుకొని వెళ్ళవలెనని ఆతనియుద్దేశము. తొలుత నాతడు బ్రిటీషుభీమాకంపెనీకి పోయెను. మేనేజరుని కలసి మాట్లాడెను. ఆమేనేజరు మంచివాడును, నేర్పరియు, ఉదారుడును అయి ఉండెను. వెంటనే మేనేజరు తనక్రింది ఉద్యోగస్థునొకనిని పిలచి ఆతనికి వెంటనే అప్పు ఈయవలసినదని చెప్పెను. ఐడెంటిఫికేషను లేనిది సొమ్ము ఇచ్చుటకు క్రిందిఉద్యోగస్థుడు నిరాకరించెను. అందుమీద ఆతడు తిరిగి మేనేజరుకడకుపోయి ఆవిషయము చెప్పెను. మేనేజరు అపుడు ఆతనిపట్టాను, అందుకుసంబంధించిన కాగితములను తెప్పించి చూచెను. వైద్యపరిక్షకునిపత్రమున పేర్కొనబడియున్న ఆతనితొడపైనిగలమచ్చను తానుచూచి తనక్రిందిఉద్యోగస్థునిపిలచి 'నేను ఇతనిని గుర్తుపట్టితిని. వెంటనే ఋణధనమును ఇచ్చివేయుము' అని చెప్పెను. ఖాతాదారుని ఈరీతిని తృప్తిపఱచు పద్ధతిని ఎందరు మేనేజర్లు, బ్రాంచిమేనేజర్లు, కార్యదర్శులు తలపెట్టియుండిరో నాకు తెలియదు. ఆపెద్దమనిషి ఆమేనేజరుచేసినదానికి అత్యంతసంతృప్తి నందెను. ఆ ఆఫీసును వదలులోపుగా నాతడు పదివేలకు ఆకంపెనీలో తిరిగి ప్రపోజల్ చేసెను.

## సుభాషితము.

### ౧౦

కొద్దికాలమునకుపూర్వమువఱకును పలువురు జీవితభీమాసొమ్మును దినవారపుఖర్చులకు సరిపోవుదానిగా తలంచిరి. దరిమిలాను ఈతలంపు మారిపోయినది. జీవితభీమాతో సమర్థులు భార్యలకు సంతానమునకు రక్షణ ఎంతసులభముగ నీయవచ్చునో వారు గ్రహించిరి. గత్యంతరములేనిగాను జీవితభీమా స్వీకరింపబడినది. నేటిపరిస్థితులు జీవితభీమాను క్రొత్తవిలువను గొని వచ్చినవి. ఇతరవిధములైన పెట్టుబడులు ఇచ్చు అన్నిరకముల సౌకర్యములను కలిగించుటకుతోడు జీవితభీమా ఒకవేళ తాము మరణించుచో తమకుటుంబములను పూర్తిరక్షణమొసంగగలదనుట తెలిసికొనబడినది. జీవితభీమా వారిగృహమును పరిరక్షించును, వారిసంతానముయొక్క విద్యాసౌకర్యములకు హామీనిచ్చును, వారుజీవించియుండుచో విశ్రాంతిదశయగువృద్ధాప్యమున అనువగు ఆదాయమును కల్పించును.

—ఇండియన్ పాలసీహోల్డర్సు రెవ్యూ.

భీమాకంపెనీ ఉద్యోగస్థులును, ఏజెంట్లును, గుమాస్తాలును తమకంపెనీపట్టాదారులను సౌహార్దముతోడను, గౌరవముతోడను చూడవలయును. కాన్వాసరు చెప్పిన దానిని నమ్మిన పిమ్మట పట్టాదారుడు తానొకధర్మమును నిర్వహించుచుండినట్లు భావించుచు ప్రీమియములు చెల్లించుచుండును. పట్టాదారైన నాతడు నదువడు అగుటచేతనే తనకు గల బాధ్యతలను గాని హక్కుస్వత్వములను గాని ఆతడు తెలిసికొనజాలడు. ఇట్లు తెలిసికొనజాలకపోవుటచే ఆతడు అపుడపుడు కంపెనీనుండి అసంబద్ధములగు డిమాండ్లను చేయుచుండును. అట్టి సమయములయందు కంపెనీ అధికారులు మిక్కిలి మెలుకువతోడను, మంచినేర్పుతోడను వ్యవహరింపవలయును కాని తెలుచుగా ఇట్టిసమయములయందు పట్టాదారులకు విసుగుపుట్టించు ప్రత్యుత్తరములే ఒసగబడుచుండుట బహుళముని చెప్పవలసియున్నందులకు చింతించుచున్నాను. ఇందుతో ఈవిషయ మెప్పుడును పట్టాదారునిమనమున జాగరితమగుచునే యుండును. హైందవ భీమాకంపెనీలు— గణనకెక్కినవియు, క్రొత్తగస్థాపింపబడినవియు— అన్నియు ఈవిషయమున దోషమొనర్చునవియే అని చెప్పవలసియున్నది. ఈవిషయమున సవరణ ఎంతత్వరలో చేయబడిన అంత మంచిది. చిన్న ఇన్ సూరెన్సుకంపెనీయొకటి దానిపట్టాదారులలో నొకనికి కొన్ని ఉత్తరములు వ్రాయవలసివచ్చుట నాకు తెలియును. పట్టాదారునకు గ్రావ్యాత

కొఱవడినందులకు హెడ్డాఫీసువారు ఉద్రిక్తులై ఇట్లు వ్రాసిరి: "పట్టాలోని నియమములను గాని, మాపలు లేఖలయందలి అంశములను గాని అవగతము చేసికొనుపాటి తెలివి గాని, అవగతముచేసికొనవలయుననుఇచ్ఛ గాని మీకు ఉండినట్లు గనుపించదు. మాటాడక మేము చెప్పినచొప్పున చేయుట మంచిది." గ్రాహ్యతకొఱవడిన ఈపట్టాదారు ఎవరు? రంగపురమునందలి ఆసుపత్రికి అధికారి!

పట్టాదారుల అజ్ఞానమునకు కాన్వాసరే ముఖ్యముగా బాధ్యుడై యున్నాడు. త్వరగ ఈకేసు కాన్వాసుచేసికొని మఱియొక కేసునకై పోవ అతడు ఆతురత చూపుచుండును. ప్రస్తుతమున్న ఏజన్సీపద్ధతులలో ఇది తప్పనిసరియగుచున్నది. విద్యావంతులు పలువురు భీమాఏజెంటువృత్తి నవలంబించుచో క్రమముగా ఈదుస్థితి తొలగిపోయి పట్టాదారులలో గల అజ్ఞానము నశింపగలదు.

దిఇన్సూరెన్సు అండ్ ఫైనాన్సు రెవ్యూ.

## ౯. భీమాకంపెనీలు : ప్రకటనప్రచారము

ఈపుటలయందు గతవత్సరమున భీమావిషయకపత్రికలయందు భీమావ్యాపారసంస్థల ప్రకటనలవలని లాభములను గూర్చియు, ఉపయోగములను గూర్చియు చర్చించి యుంటిమి. భీమావిషయకపత్రికలయందు ప్రకటించుటకై వెచ్చించిన పెట్టుబడికి తగినలాభము పొందునని కొన్ని అమెరికను ఇన్సూరెన్సుఆఫీసులు స్వానుభవముచే కూర్పగలిగిన అంకెలను ప్రచురించియున్నవి. నాటినుండియు మనదేశమునందలి పలుఇన్సూరెన్సుఆఫీసులు ప్రకటనలపూర్వకమగు పెద్దప్రచారమునకు గడంగినవి. కాని ఆర్థికమాంద్యకారణమున తమప్రకటనల బడ్జెట్టును తగ్గించుటకు కంపెనీలు ఆతురతచూపుచుండుట అరుదు కాదు. ఈసందర్భమున స్టేట్సుమెన్ పత్రికలో ప్రచురింపబడిన క్రిందిస్టేటుమెంటు పరిశీలించుట విజ్ఞానదాయకమై యుండగలదు.

"1981-వ సంవత్సరమున వార్తాపత్రికలయందు తమ కంపెనీ ప్రకటనలను యథారీతిని సాగించినవియు, హెచ్చించినవియు నగు ఇరువదియైదు భీమాకంపెనీల వ్యాపారమును—ఆవత్సరమున వార్తాపత్రికలయందు తమతమ కంపెనీ ప్రకటనలను తగ్గించినవి యగు మఱి ఇరువదియైదు భీమాకంపెనీల వ్యాపారముతో పోల్చిచూచినచో ప్రకటనసాగించిన కంపెనీల వ్యాపారము 1930 కంటె 1981 లో నూటికి ఏడువంతులుమాత్రము తగ్గించిన కంపెనీలవ్యాపారము 1930 కంటె 1981 లో నూటికి డెబ్బదిమూడువంతులు తగ్గిపోయినదనియు తేలినది. అమెరికను వార్తాపత్రికా ప్రకటనకర్తలసంఘమువారి ప్రచారకశాఖవారీ లెక్కలను తయారుచేసిరి."

అమెరికనుకంపెనీలకు గలిగిన ఈ అనుభవమునుండి తరుణమున పాఠమును గ్రహించి హైందవభీమాకంపెనీలు ప్రకటనప్రచారోద్యమమును నిర్వహింతురని మేమాశించుచున్నాము. డబ్బు ధారాళముగ ఆడుదినములలో తనంతటతాను కొనగలవస్తువునే డబ్బునకు నిక్కచ్చిగల దినములలో

### సుభాషితము

### ౧౨

తనజీవితమును భీమాచేయుకొనుట యొకపాతకమని ఒకానొకవ్యక్తి పలుకుచుండగా నేను వినియున్నాను. ఈపలుకులను ఉచ్ఛరించినది ఎవరైనను అగుగాక, మహావాక్యములగుట ముమ్మాటికిని సత్యము. అవి సుభాషితములు. అవి సత్యసమ్మతములని నానమ్మకము. ఏమన, భీమా అనగా సహకారము, దానివలన చిత్తశాంతి కలుగును; ఒకనికష్టమును వానితోడివారు పంచుకొనుటయే దానితత్త్వము. ఇట్టియుత్తమఫలములచేకూర్చుటకు సాధనసంస్థను మనమన్నివిధముల ప్రోత్సహింపవలసినదే. కాని ఆప్రోత్సాహము ఎల్లవేళలను కాకూడదు. విజాతీయులమేలునకై విజాతీయులచే చేయబడినప్పుడు — అనేకములగు మంచిసంస్థలైనను— ఇదియుత్తమమంచిలో సగభాగమును కోల్పోవుచున్నది. దేశసంపద ఈడబోవుటకు కారణమగుచున్నది; వర్తకమునకుగల సౌకర్యములను తగ్గించుచున్నది; జాతియొక్క ఆత్మగౌరవమునకు కుందుపాటు కల్గించుచున్నది ఈసత్యమును తన జాతీయులు గుర్తింపప్రయత్నము చేయువాడు తనదేశమునకు గొప్పసేవచేసినవాడగుచున్నాడు

—శరచ్చంద్రచటర్జీ

నచ్చచెప్పినమీదగాని మానవుడు కొనజాలడని వేఱె వచింపనక్కరలేదు. నచ్చచెప్పుటకే ప్రకటన ప్రచారము కావలసియున్నది. ఆర్థికమాంద్యము ప్రబలి యుండుటచే ఈదినములలో వ్యాపారమును యథాస్థితియందునిలుపుటకు వ్యాపారసంస్థలు తమతమ ప్రకటనప్రచారములను తీవ్రతరముగ సాగింపవలయుట అత్యవసరమగుచున్నది. మన దేశపు భీమాకంపెనీలలో కొన్ని దేశావృతమైన ఆర్థికమాంద్యము నతిక్రమించి మంచి వ్యాపారమును చేయగలుగుటకు కారణము అవి సాగించిన తీవ్రతరప్రకటనప్రచారమే. ప్రముఖస్థానమునందున్న భీమాకంపెనీల చరిత్రలను పరికించితిమేని తీవ్రతర ప్రకటన ప్రచారమును గావించినదినములయందే అవి హెచ్చువ్యాపారమును చేసియుండుట కనుగొనవచ్చును. పత్రికలకు ప్రకటనలను కాన్వాసుచేయు నొకడు ఒకానొక ఇన్సూరెన్సుకంపెనీమేనేజరును సందర్శింపగా తనకంపెనీ అర్ధశతాబ్దినాటిదనియు, దేశమునకు బాగుగ ఎఱుకపడియుండుటచే ఎట్టిప్రకటనము అవసరములేదనియు చెప్పెను. దానికిబదులుగా కాన్వాసరు అచ్చుటగల చర్చి నూఱేండ్లనాటిదనియు అయినను అందు ప్రతి ఆదివారము ఉదయము గంటమ్రోగింపబడుచున్నదనియు చెప్పెను ఎన్నివత్సరములనాటిదైనను, ఎంతగ దేశమున ఎఱుకపడియున్నను దాని నామము ఎల్లవేళల ప్రజలమనములనుండి జారిపోకుండుటకై నిరంతర ప్రకటనము వలయును. ఇన్సూరెన్సుపత్రికలు ప్రకటించినకంపెనీకి అర్థప్రచారమిచ్చుటయేగాక ఇన్సూరెన్సు శాఖలో పనిచేయుచున్నవారికిని, జనసామాన్యమునకును భీమానుగూర్చిన విజ్ఞానమును పెంపొందించుచుండుటచే ఇన్సూరెన్సుకంపెనీలకలన హెచ్చుపోషణ మందదగియున్నవి. ఇతరవ్యాపారస్థులుకూడ ఇన్సూరెన్సు పత్రికలయందు తమవస్తువులను ప్రచురించుట మంచిది. ఏమన ఇన్సూరెన్సు పత్రికలను చదువువారు సాధారణముగా ఆర్జనాపరులును, ధనవంతులు అయియుండుటచే వారికొనుగోలుతనమును, వ్యయముచేయుశక్తియు హెచ్చుగనుండును.

—ఇన్సూరెన్సువరల్డు.

## సుభాషితము

౧౧

స్వదేశీభీమాకంపెనీల అభివృద్ధికొఱకు మనమెప్పుడను ప్రభుత్వమువారి సహాయసంపత్తిని అపేక్షింపగూడదు. స్వప్రయత్నములమీదనే మనము ఆధారపడవలెను. హిందూదేశజులు ప్రతిసంవత్సరమును విదేశీభీమాకంపెనీలలో ప్రవహింపచేయుచున్నధనరాశిని ప్రజలే స్వబుద్ధిచేతను, స్వప్రయత్నముచేతను అరికట్టవలెను

—లాలా లజపతిరాయి.






కార్తీక పౌర్ణమినాడు

—చిత్రకారుడు: శ్రీపాద దుర్గారావుగారు, రామారావు ఆర్ట్సు సొసైటీ.







# వివేకానందుడు: స్త్రీ సమస్యలు

## ఆర్యమతమున గృహిణికి గల స్థానము

సంఘమున స్త్రీకిగల స్థానమువిషయమై ఆర్యజాతికిని, ఆర్యేతరజాతికిని ఎప్పుడును ఏకాభిప్రాయము లేదు. ఆర్యేతరజాతులు ప్రార్థనావసరమున ప్రక్కను స్త్రీయుండుట ఏకాగ్రతకు భంగము కలిగించునని గాఢముగ నమ్మిరి; వారిదృష్టిలో స్త్రీమతసంబంధమైన ఎట్టికర్మ చేయుటకును అధికారములేదు. ఆర్యజాతులవారిదృష్టిలో పార్శ్వమున భార్యలేకుండ గృహమేధి మతసంబంధమైన ఎట్టికర్మయు చేయజాలడు. నేడు దేశమున వ్యాప్తమైయున్న మతము పౌరాణికకాలమునాటిది అనగా బౌద్ధయుగమునకు తరువాతిది. వేదోక్తమగు నిత్యాగ్నిహోత్ర కర్మాచరణమునకు భార్యపార్శ్వముననుండుట అవసరమేయయ్యె పురాణోక్తమగు సాలగ్రామపూజావసరమున భార్య సాలగ్రామమును ముట్టనైన అవసరములేకుండవచ్చినదని స్వామి దయానందసరస్వతి పేర్కొనియున్నాడు. కావుననే బౌద్ధయుగమునకు అనంతరకాలముననే సంఘమున స్త్రీ పురుషునితో తనకుగల సమానస్థానమును గోలుపోయినదని చెప్పవచ్చును. అయితే అంతమాత్రమున భారతస్త్రీ పతనమునొందినదను పాశ్చాత్యవిమర్శకుల వాతలను మనము చేకొనరాదు. స్త్రీలను పురుషులు రక్షింపవలసినపరిస్థితులు పలుశతాబ్దులు హిందూదేశమున కలిగియుండినవి. స్త్రీలవెనుబాటున కదికారణము గాని వారితెలివితక్కువ కారణముగాదు. భారతస్త్రీ భర్తకు అర్ధాంగి. నిత్యవ్యవహారమున వైదికుడగు హైందవుడు పలుకర్మలాచరింపవలసియుండును. భార్య పార్శ్వమునలేనిది అందొకట్టిగూడ నాతడు చేయరాదు. పురోహితులు భార్యాభర్తల ఉత్తరీయములకొంగులు ముడివైతురు; ఆదంపతులు దేవాలయమును ప్రదక్షిణముచేతురు; అట్లే వారు కలసి ప్రతి ప్రసిద్ధతీర్థయాత్రయు గావింతురు

## ౫ అమెరికను స్త్రీలకు హైందవస్త్రీలకునుగల అంతరము.

అమెరికనుఅతివలారా! మాహిందూదేశపుస్త్రీలు మీకుగల విజ్ఞానమును కలిగియుండుటను నేనెంతయు వాంఛింతును. అయితే అట్టివిజ్ఞానము నీతిచ్యుతిచే కలుగునదగుచో మాత్రము మాకు వలదు. మీవిజ్ఞానమునకు నేను మిమ్ముల నెంతయు నభినందింతును కాని చెడ్డతనమును గులాబీలచే కప్పివైచి దానిని మంచిగా రూపించు మీపద్ధతిని నేనెంతయు గర్హింతును. విజ్ఞానమొక్కటియె శ్రేష్ఠతమమైనదిగాదు. నైతికజీవితము, పారమార్థికబుద్ధి ఇవి మాప్రధానకాంక్షితములు. మాదేశపుస్త్రీలు మీయంత విజ్ఞానవతులు కారు, కాని మీకంటె పవిత్రశీలలు. తనభర్తకు ఇతరుడైన ప్రతి పురుషుని స్త్రీ పుత్రునివలెగా చూడవలెను. తన భార్యకు ఇతరమైన ప్రతిస్త్రీని పురుషుడు మాతృదేవిగా తిలకింపవలెను. నేనీపరిసరమును గాంచి గాలంటే (స్త్రీవిషయమున పురుషుడు చూపు ఉదాత్తత) అని మీరు పేర్కొనువిషయమును గమనించినతోడనే నాకు అసహ్యము కలుగుచున్నది. లింగభేదమును మఱచి సమానభావముతో సమానాంతరముతో మీరు మీపురుషులచే చూడబడనంతవఱకు మీకు నిశ్చయముగు అభివృద్ధి కలుగజాలదు. అట్టిఅభివృద్ధి కలుగువఱకు వారు ఆటవస్తువులే కాని ఇతరము గాదు. ఇదియంతయు మోసా

# ఆరోగ్యవిజ్ఞానము

### § జనసామాన్యమునకు కొన్ని "వద్దు"లు

**1.** వీధులలోనూ, సందులలోనూ, బజారులలోనూ ఎక్కడబడితే అక్కడ ఉమ్మి వేయవద్దు.

**2.** నీ ప్రక్కనున్నవారి సహ్యాసహ్యములు గమనించకుండా వీధులలో దగ్గి ఉమ్మి వేయవద్దు, చీమిడి చీదవద్దు.

**3.** కొద్దిగా మరుగుగా ఉంటవని వీధులచివర, కాలవకట్టలమీద, సన్ననిగొందులలోనూ అల్పాచిమానము చేయవద్దు

**4.** పిల్లలను వీధులలో బాహ్యమునకు పోనీయవద్దు.

**5.** చెత్త చెదారములను బజారులలో వేయవద్దు.

**6.** రోడ్డుమీది దుమ్ములో పిల్లలను ఆడుకోనీయవద్దు.

**7.** వీధులలో నడచుచు ఏమియు తినవద్దు.

**8.** రోడ్లమీద నడచునప్పుడు కార్లవల్లగలిగినదుమ్ము అణగివదాకా ముక్కులు, నోరు మూసికొనుట మరచిపోవద్దు.

**9.** రోడ్లప్రక్కనఉండు దుకాణములలో కొని తినవద్దు.

**10.** కాఫీహోటళ్ళలో కరుచుకొని త్రాగవద్దు.

**11.** కాఫీహోటేళ్ళలో ఆకులకు బదులు ప్లేటుల నుపయోగింపవద్దు.

**12.** తిరునాళ్ళలో అందిననీరు త్రాగవద్దు.

**13.** అడుక్కొనువాళ్ళకైనను చెడిపోయిన ఆహారము ఇవ్వవద్దు.

**14.** అంటువ్యాధులను దాచవద్దు

**15.** రైలుస్టేషనులలోఉండు మూడవతరగతి ప్రయాణీకులశాలలను పాకీదొడ్డికంటె కనాకష్టముగా ఉపయోగించవద్దు.

**16.** రైలుపెట్టెలో కిటికీవద్దకూర్చుండికూడ, లోపల ఉమ్మివేయుటే గొప్పయని, నాగరికతయని తలచవద్దు.

**17.** నలుగురుగలచోట చుట్ట కాల్చవద్దు.

(వీనిలో చాలావరకు ఆర్. నారాయణస్వామి యమ్. ఎ. గారు ఇండియన్ ఎక్స్‌ప్రెసులో వ్రాసినవి)

— మొదలి వేంకటసుబ్రహ్మణ్యశర్మ.

### §. పురీషస్థానముపై చూపు అశ్రద్ధయే అనారోగ్యమునకు మూలము.

మలమును వెడలించు పెద్దపేగు శరీరమునందలి ముఱుగును గొనిపోవుకాలువ అని చెప్పనొప్పును. ఈ ముఱుగుకాలువవిషయమై విశేషమగు శ్రద్ధను చూపనిచో అది మలినపదార్థములను నిలువచేయు కుళ్ళు గుంటయగును. మలద్వారము శుచిగానుండుచో అతడు ఆరోగ్యవంతుడును, ఉల్లాసవంతుడును అయిఉండును. మలినపదార్థము అందు నిలువయుండుచో అతడు నీరసించిపోవుటకు కారణభూతములగు విషములను అది పుట్టించును; రక్తమును పులియజేసి కుళ్ళజేయును మనస్సును, దానినిబట్టి నరములను నది విషపూరిత మొనర్చును. కారణముగా నతడు మానసికోత్సాహమును గోలుపోయి విచారగ్రస్తుడు, కోపదారి, వ్యాకులుడు అగును. హృదయకోశము నది చెఱచును. ఫలముగా నాతడు నీరసించి ఏవిషయమునుగూర్చియు జాగ్రత్త చూపజాలనివాడగును. దానిధర్మము నది చేయమఱచిన పురీషస్థానము అచిరకాలముననే ఊపిరితిత్తులక్షు

పాడుచేయును. ఊపిరితిత్తులు చెడుటచే నోటియందు భరింపరాని దుర్వాసన బయలువెడలును. అశుచిగా నుండు మలద్వారము జీర్ణకోశమును విషపూరిత మొనరించును. కారణముగా శరీరము లావుపారును, కడుపు ఉబ్బరించును, అజీర్ణసంబంధమైననొప్పులు కలుగును. మఱిగిన మలద్వారము రక్తమును విషపూరిత మొనర్చును. ఫలితము: చర్మము కొంచము పచ్చబాఱుటయో, పాలిపోవుటయో జరుగును; శరీరమంతయు చెమటకాయలు, మచ్చలు పుట్టును పురీషస్థానము యొక్క అపరిశుద్ధస్థితిచే శరీరమునందలి ప్రతి అవయవమును దూషితమగును; అకాలముననే ముదిరూపము ఏర్పడును; కీళ్ళయందు నొప్పులు పుట్టును. చప్పిదవడలు, గుంటలుపడిన కండ్లుఏర్పడును. మానసికోత్సాహము నశించుటచే ఏపనిచేయుటకును యావ గలుగకుండును. జీవితమునందు ఎట్టిమాధుర్యమును లేకుండును.

—ఫిజికల్ కల్చర్.

౬. ఇట్టి అభ్యంజనమువలని లాభమునందుడు.

నీళ్ళతో పిసికిన నల్లరేవడిమట్టి తలకు పట్టించి పది నిముసము లుంచవలెను. తరువాత ఆబురదతో తలను బాగుగా రుద్దుకొనిన మురికిఅంతయు పోవును. సీకాయ, మెంతులు కలిపి ఉడకబెట్టి రుబ్బి దానితో రెండవసారి తలరుద్దుకొనిన తలకు నురుగువచ్చును. ఇది మేహశాంతికరము. ఈరీతి అభ్యంజనముచే వెంట్రుకలు మెత్తపడును; కుదుళ్ళు గట్టిపడును; చుండ్రు, పేలు, మట్టి ఇడిపోయి దృష్టి నిర్మలమగును. శరీరమునకు కొబ్బరినూనె లేక ఆవునేతి నుపయోగించవలెను. తలంటు కుపయోగించునీళ్ళు సాధ్యమైనంత తక్కువవేడిగల విగా నుండవలెను:

—నాగులపాటి వేంకటసుబ్బారావు.

౭. కూరగాయలచే రోగోపశమనము గావించుకొనుము.

కౌశేయము (లీవరు) మందముగనుండినట్లు అనుమానము కలిగినచో ఆహారపదార్థములందు సీమవంకాయలను చేర్చుకొనుము. అజీర్తిచేగాక మఱియెట్టికారణముచేగాని రాత్రులయందు నిద్రపట్టకుండుచో రాత్రి భోజనమున నీరుల్లిపాయలకూర ప్రధానద్రవ్యముగా నొనర్చుకొనుము, రక్తహీనతచే బాధపడుచుండుచో బచ్చలిఆకుతో కూరచేసి పుచ్చుకొనుము. బచ్చలి ఆకులో ఇనుము ఎక్కువగ నున్నదని జ్ఞప్తియుందుంచుకొనుము. శరీరమునందలి దుష్టపదార్థములను తొలగించి దానిని శుభ్రపఱచుటలో కాబేజికూరకు మించినది మఱియొకటి లేదని జ్ఞాపక ముంచుకొనుము. జ్ఞాపకశక్తి తగ్గుచుండుచో బొద్దికూర తఱచు తినుచుండుము. 'బొద్దికూర తినినవాడు బుద్ధిమంతుడగును' అను పెద్దల వాక్యమును మనమున నిలుపుకొనుము. మలబద్ధమును తొలగించుటకు ఆకుకూరలలో తోటకూర సాటిలేనిది. అది మహాశాకము కదా! సుఖవిరేచనము గావించుకొనుటకు చుక్కకూరకు మించినదిలేదు. జీర్ణశక్తి కొఱవడినచో బీటురూటు అను దుంపకూరను మధ్యాహ్న భోజనముతో తీసికొనుము. నరములందు అమితమైన వేడి చేరినచో కారటుదుంపలకూర తినుము గోగుకూరలో తామ్రము మున్నదని తెలిసికొనుము

౮. కాకరయొక్క ఉపయోగము

కాకరాకును, గాకరకాయలును బెక్కుతెఱఁగుల ననుభవింపఁదగును. శరీరమునఁ బైత్యశాంతిని గలిగించును. ఎముకలమూలుగులకుఁ బటుత్వమును గలుగఁజేయు శక్తి కాకరయందు మిక్కిలిగా గలదు. మఱియును దినదినము నయిదేసికాకరాకులను గొంచె ముప్పుతోఁ గలపి ముద్దచేసి ప్రాతఃకాలమున దంతధావనము కాఁగానే వరుసగా నేడుదినములు తిన్నయెడల శరీరము నందేవ్యాధియుఁ బుట్టనేరదు. కాకరాకుల నెండబెట్టి చూర్ణముచేసి యుంచుకొని శరీరమునఁ బైత్య మధికమగునప్పుడు పచ్చడిచేసి గాని, పులుసు వండుకొని గాని తిన్నయెడలఁ బైత్యశాంతి యగును. ముదిరిన కాకర తీఁగముక్క నొకదానిని బ్రయాణములోఁ గాని, కూరగాయలు లభించుట దుష్కరముగానుండు వేసవికాలములోఁ గాని చారులో వేసినయెడల, బనసపండువాసనవంటి గమగములాడు సువాసనను గలిగించును.

—ఆ. వెం. సాంఖ్యాయనశర్మ.

[శ్రీసుబ్బారావు శ్రేష్ఠిగారు గ్రంథాలయోద్యమమునకు జీవమును ప్రసాదించు ఒక ముఖ్య విషయమును ఈవ్యాసమున సూచించియున్నారు. దీనినిగూర్చి పాఠకులు తమ అభిప్రాయములను పంపినచో వైమాసపు ఆంధ్రభూమిలో ప్రచురింతుము. —సంపాదకుడు]



గ్రంథాలయోద్యమము.

# గ్రంథాలయోద్యమము - పతాకము

భారతవర్షమున గ్రంథాలయోద్యమము అతి ప్రాచీనమైనదనియు, అతి పవిత్రవంతమైనదనియు, మిగుల ఫలవంతమైనదనియు, సమస్తోద్యమములకు సోపానమనియు ఎల్లరకు విదితము. దేశకాల పరిస్థితుల ననుసరించి భిన్నభిన్న కాలములందు భిన్నభిన్న రూపములతో ఈ యుద్యమము సాగుచుండినది. కాని యేకాలమందును, ఏరాజులు పాలించుచుండినను, గ్రంథాలయోద్యమము మీ దేశమున మొదలంట నశించియుండలేదని చరిత్రలు విదితపరచుచున్నవి. ప్రభుత్వాదరణ యున్నకాలదియు, ప్రజాపోషణ లభించినకాలదియు, భాషాసేవకులు చూపెట్టు ఆదరణాభిమానములను బట్టియు, యుద్యమముచ్చ నీచస్థితు లందుచువచ్చెను మన దేశ గ్రంథ భాండాగారము లితర దేశీయుల విజ్ఞానౌన్నత్యమునకు, సిరిసంపదలకు, సర్వతోముఖాభ్యుదయమునకు, గోలకర్రలైనవని చరిత్రలు చాటుచుండుట పాఠకుల కెఱుకయే.

మన దేశ, మతసంప్రదాయములను బట్టి భాషకధి దేవత సరస్వతి, సరస్వతి సృష్టికర్తయగు బ్రహ్మదేవుని యర్ధాంగి, పార్వతీ పరమేశ్వరులవలె, లక్ష్మీనారాయణులవలె, సరస్వతీ బ్రహ్మదేవులుకూడ పూజనీయులే. గ్రంథాలయములు సరస్వతీదేవి ఆలయములనియు, గ్రంథాలయములు దేవాలయకోటిలో చేర్పదగినవనియు "ఆంధ్రభూమి" పాఠకుల కీవరకే విన్నవించి యున్నాను.

దేవీనవరాత్రులందు సరస్వతీ వ్రతాచరణము మన పండితుల సంప్రదాయమై నేటికిని యొప్పుచున్నది. గ్రంథకర్తలు, కవీశ్వరులు, పండితశ్రేష్ఠులు, సనాతన ధర్మపరులు, సరస్వతీ ఆరాధన, సరస్వతీ స్తవము, పూజార్చనాధికములు చేయుచుండుట గాంచుచున్నారము.

మన దేశమున శివకేశవులకు ఆలయములు గలవు. పార్వతికి ఆలయములున్నవి. లక్ష్మీదేవికి ఆలయములున్నవి. కులదేవతలకు ఆలయములున్నవి. గ్రామదేవతల కాలయము

లున్నవి, ఈ ఆలయములన్నిటియందును విగ్రహప్రతిష్ఠలు, విగ్రహారాధనలు విధిగా జరుగుచుండుట గాంచుచున్నారము. విగ్రహప్రతిష్ఠ విగ్రహారాధనగల సరస్వతీదేవి ఆలయములు లేకుండుటకు కారణము దురూహ్యముగ నున్నది.

మన భారతదేశ సంపదలతో చేర్పదగిన, మన హిందూదేవాలయ కోటిలో చేర్పదగిన గ్రంథాలయములందుగల గ్రంథసముదాయమే సరస్వతీదేవియొక్క యాకారము. వేదోపనిషదేతిహాస, పురాణ, మహాకావ్య. నవలా, ప్రబంధాదుల వాగ్రహితగానమే యానలువరాణి వీణానాదము. గ్రంథపాఠకులే సరస్వతీదేవి నారాధించు భక్తులు, గ్రంథాలయోప ద్రష్టకుడే సరస్వతీదేవి యర్చకుడు. సరస్వతీదేవి ప్రసన్న కటాక్షవీక్షణజ్యోత్స్నామాత్రమున యజ్ఞానాంధకారము భేధింపబడును. ఆవిద్యాప్రదాయినీ సందర్శనా ఫలితమే జ్ఞానోదయము.

గ్రంథస్వరూపిణియగు సరస్వతీదేవికి ఆలయములై యొప్పుచున్న పవిత్ర గ్రంథాలయములకుకూడా, శివకేశవాలయములకున్న రీతిగా, ధ్వజప్రతిష్ఠ జరుగుటెంతయు యొప్పియుండునని నావినీతాభిప్రాయము.

గ్రంథాలయోద్యమాభిలాషులగు వేటపాలెమునందలి నాయకులలో ఈ సంకల్పముదయింప నీ ఆశ్వయుజ శు ౯ లు మహార్నవమీ పుణ్యదినమున సారస్వత సంకేతన పంచాదశ వార్షికోత్సవ సందర్భమున త్రయాహ్నికముగ ఆచరింపబడుచుండిన సరస్వతీదేవి పూజాదికములతో పాటు సరస్వతీ ధ్వజారోహణము జరుపబడెను. గ్రంథాలయోద్యమ పతాక చిహ్నము లెటులయుండవలయునను సమస్యపై పండితాభిప్రాయములను, నాయకులయభిప్రాయములను గైకొని నిర్ధారించుటకు వ్యవధిలేని కారణమున, తాత్కాలికముగ సరస్వతీప్రతిమ సహిత పతాకమును ప్రతిష్ఠింపజేసితిమి.

ఇయ్యది సమంజసమగునో కాదో? పతాకముపై సరస్వతీ విగ్రహముండిన చాలునా? మరేమైన చిహ్నములుండనోపునా? సరస్వతీవిగ్రహముగాక, అన్ని మతముల వారికిని అన్నిభాషల వారికిని ఆమోదకరముగా నుండునటుల యేయే చిహ్నములు పతాకముపై యుండదగునో, ఉద్యమశ్రేయోభిలాషులు, నాయకశ్రేష్ఠులు తమయభిప్రాయములను పత్రికాముఖంబున వెల్లడింప గోరుదును. చిత్రకారులు తమ సూచనల గావింప గోరుదును.

ప్రపంచమునగల సమస్తరాజ్యములవారికిని, సమస్త మతములవారికిని, సమస్తసంఘములవారికిని, సమస్తోద్యమములకును పతాకములుండుట గాంచుచున్నారము. అట్టితరి ప్రాచీనమై, పవిత్రవంతమై, పునాదియై యొప్పుచుండు గ్రంథాలయోద్యమమునకు కూడ పతాకముండుట శుభావహమని యెంచుచున్నాను. కనుక పెద్దలైన విద్వద్వరేణ్యులు ఈవిషయమై తమతమ యమూల్యాభిప్రాయముల ప్రకటించెదరు గాత.

—ఊటుకూరు వేంకటసుబ్బారావు శ్రేష్ఠి.

# విడ్డూరములు

౧. మగవాడు ఆడదిగ మారుట.

జెరాల్డ్సు అనుపుస్తకవిక్రేతలు ఈమధ్యను నీల్సు హోయర్ అనువారిచే రచియింపబడిన 'మాన్ ఇన్‌టు వుమెన్' అను గ్రంథమును ప్రచురించిరి. ఆగ్రంథమున ఈక్రింది సత్యవృత్తాంతము విపులముగ వర్ణింపబడినది. ఎల్నర్ వెగ్నర్ అను మారుపేరుగల ఆండ్రీస్‌పార్ అను వాడు డెన్మార్కుదేశపు పెయింటరు. పెయింటింగు నందు అతడు ప్రపంచప్రఖ్యాతి నందెను. అతడు గత శతాబ్దియందు తుదిభాగమున జననమందెను. ఇరువది వత్సరముల వయసున అతడు వివాహముచేసికొనెను. భర్తయైన అతడు మానసికముగను, కాయకముగను తనధర్మమును తృప్తికరముగ నిర్వహించెను. ఇట్లుండ కొంతకాలమునకు అతడు తనశరీరమున నొకవింతమార్పు కలుగుచుండుట కనిపెట్టెను. తనశరీరమున నొకస్త్రీ వ్యక్తి పొడగట్టుచున్నటుల తోచెను. శరీరమున క్రమముగా ఆస్త్రీవ్యక్తి హెచ్చుపాలు గొననారంభించెను. దీనికి వింతపడి ఆండ్రీస్ డాక్టరులచే పరీక్షచేయించుకొనెను. వారిది ఫలానారోగమని కాని, మార్పుఅని గాని చెప్పజాలకపోయిరి. తుదకు అతడు డ్రెస్‌డన్ నందలి ఒకసుప్రసిద్ధ జర్మనుడాక్టరుచెంతకు బోయెను అతడు నిశితముగా పరీక్షలు గావించి ఆండ్రీస్ ఆడదిగా మారుచుండుటను నిరూపించెను. కొన్ని ఆపరేషనులను కొనసాగించి అతడు ఆండ్రీస్ స్త్రీత్వమునకు ప్రాముఖ్యమిచ్చెను; పురుషత్వము పూర్తిగ నాశనమయ్యెను. డేనిష్‌ప్రభుత్వమువారు ఆండ్రీస్‌ను స్త్రీగా చేకొని లిల్లీ ఎల్బీ అను నామములో క్రొత్తపాస్‌పోర్టును ఇచ్చిరి. డెన్మార్కురాజు ఆండ్రీస్‌యొక్క పూర్వాశ్రమపువివాహమును రద్దుచేయుచు ప్రకటన గావించెను. ఆండ్రీస్ తనవెనుకటిభార్యను తమ స్నేహితుడగు నొకనితో రోమునగరమున వివాహము గావించుకొన ప్రోత్సహించెను. పురుషుడుగానుండినప్పుడు ఆండ్రీస్‌స్నేహితుడైయుండిన ఒక ఫ్రెంచిపెయింటరు ఇపుడు స్త్రీయైన తనస్నేహితుని కలిసి వివాహము చేసికొనెను. లిల్లీ గృహిణియై మాతృత్వము వహింపగలుగుటకు గాను డ్రెస్‌డన్‌నందలి జర్మను డాక్టరు మరికొన్ని ఆపరేషనులు కావించెను. కాని లిల్లీ బిడ్డలుకను యోగము నోచుకొనలేదు. డ్రెస్‌డన్‌నందే ఆమె హృద్రోగమువలన మరణించెను.

౨ ఒకనెలలో ఆడది మగివాడగుట.

లండనునుండి ప్రచురింపబడు 'పీపుల్' అను పత్రిక ఈవృత్తాంతమును ప్రకటించుచున్నది. మేరీవుడ్సు అని ఒక ఇంగ్లీషుస్త్రీ. ఆమెవయస్సు ఇరువదియెనిమిదివత్సరములు. మోసపునేరమునకై ఆమె అరెస్టుచేయబడి ఒకమాసపుజయిలుశిక్షకు గురియయ్యెను. జయిలులో ఆమె మగవాడగుటకు ప్రారంభమయ్యెను. ఆమె ఇట్లు చెప్పెను. "నేను రిమాండులో నుండగా నా దేహమున జరుగుచున్నమార్పును గుర్తింపగలిగితిని. జయిలుఅధికారిణులతో నేను స్త్రీల ఖైదుకు వెళ్లుటయా, వెళ్ళకుండుటయా అని నాకుగల సందేహమును వెల్లడించితిని. వైద్యపరీక్ష నాసందేహమును బలపరచెను. నన్ను ఇపుడు స్త్రీ అనుటకంటె పురుషుడనుటకు కారణములు హెచ్చుగనున్నవి. నే నిపుడు స్త్రీలచెరసాలలో నిర్బంధింపబడిన పురుషుడనై యున్నాను. నన్ను పరీక్షచేసిన కారాగారపు వైద్యుడు నన్ను పురుషుల కుచితమైన దుస్తులను ధరింపవలసినదిగా సలహా నొసగియున్నాడు." మేరీవుడ్సు అవివాహిత. జయిలులో స్త్రీ పురుషుడుగా మారిన ఈకథ చాలవిచిత్రముగ నున్నది. స్త్రీ పురుషునుగాను, పురుషుడుస్త్రీగాను మారిన వృత్తాంతములు మనము ఈనడుమ తఱుచుగా వినుచున్నాము. అయితే ఆయా

మార్పులు జరుగుటకు చాలకాలము పట్టుచున్నది. కాని ఒక నెలలో లింగభేదము కలుగుట మిక్కిలి విచిత్రమైనది. కారాగారపు వైద్యుడీవిషయమునకు సాక్షీభూతుడై యున్నాడు. గావున ఇదికట్టుకథయని తోసివేయుట కొంతమాత్రమును వీలులేదు.

### ౯. నాలుగు రెక్కల కోడి.

అమెరికా సంయుక్తరాష్ట్రముల రాజధానినగరమగు న్యూయార్కు నంటియున్న ఒకవ్యవసాయక్షేత్రపాలకునికడ క్రొత్తరకపుకోడియొకటి కలదు. ఆకోడికి అన్నిటికివలె రెండురెక్కలుగాక నాలుగు రెక్కలు ఉన్నవి నాలుగురెక్కలువిప్పుకొని యెగురునపుడు అది చిన్న గాలియోడవలె నుండును.

### ౯. గ్రంథాలయమున వలసినగ్రంథమును తెచ్చియిచ్చు యంత్రము.


లండనునందలి అర్థశాస్త్రకళాశాలకు చెందిన పుస్తకభాండాగారమున నొకక్రొత్తయంత్రము నెలకొల్పబడినది కావలసిన పుస్తకమును పేర్కొనినచో ఆయంత్రము బీరువాఅరలనుండి ఆగ్రంథమును గొనివచ్చిఇచ్చును.

### ౯. విద్యార్థికి పడగతో నీడనిచ్చిన త్రాచుపాము.

ఈ వృత్తాంతము పశ్చిమగోదావరిజిల్లా గునుపూడి భీమవరమున వాస్తవముగ జరిగినది. ఒకానొక క్రైస్తవ కుటుంబమునకు చెందిన జార్జియు, అతని సోదరుడును స్కూలుఫైనలుపరీక్షకు చదువుచుండిరి. మార్చి7-వ తేదీ సాయంకాలము నాలుగున్నరగంటలకు సోదరు లిరువురును ఒకతోటలో చెట్టునీడను కూర్చుండి లెక్కలు చేయుటలో మునిగియుండిరి. అట్టి సమయములో హఠాత్తుగా రెండుమూరల పొడవైన త్రాచుపాము వచ్చి కాళ్ళప్రక్కను ముడుచుకొని తలవంచుకొని లెక్కలుచేసికొనుచున్న జార్జిని సమీపించి పడగను బాగుగా విప్పి మూరెడు పైకి లేచి అతనితలమీదుగా ఎడమప్రక్కను ఆడుచుండెను. అది అట్లు ఎంతసేపు ఆడుచుండెనో జార్జి కనిపెట్టలేదు. కొంతసేపటికి జార్జి సోదరుడు తలయెత్తి పామును చూచుట తటస్థించెను. అతడు తెలివైనవాడగుటచే గత్తరబిత్తరచేయక నెమ్మదిగ శబ్దముచేసి సోదరునిదృష్టిఆకర్షించి పామున్నదిక్కునకు కనుసైగ చేసెను. జార్జి అదిచూచి చిత్తమున బెదరియు ఎట్లో ధైర్యమును చిక్కబట్టి నేలవాటుగా రాయివలె దొర్లుచుపోయి సమీపమునయున్న పాడుగోతిలో దుమికెను. అందుమీద ఆసర్పము తన తలను పడగతో రెండుసారులు నేలకు కొట్టుకొని నెమ్మదిగా వెనుకకు సాగి దగ్గరలోనున్న రెండుతాటిచెట్ల మొదళ్లలో దాగెను. తోటలోనివారు పరుగెత్తుకొని అచ్చటకు వచ్చుసరికి ఆపాము అదృశ్యమయ్యెను. ఈవిచిత్రవృత్తాంతము రెండుదినములకు జరుగుననగా తొండయొకటి జార్జిసిరముమీదనుండి పాదములపైకి ముమ్మారుదూకెను. దానిని చంపబోవునంతలో నది పారిపోయి చెట్టెక్కెను.

### ౯. గుండెకాయ కుడితట్టునఉన్నది.

జీవికి ఊపిరితిత్తులు కుడితట్టున, గుండెకాయ ఎడమతట్టున ఉండును. ఇందుకువిరుద్ధముగా ఆ నడుమ విదేశములందు ఒకనికి గుండెకాయ కుడితట్టున ఉన్నదని వార్తాపత్రికలయందు చదివి ఆశ్చర్యపడియున్నాము. అట్టి ఆశ్చర్యమునకు తావలమైన కుడితట్టున గుండెకాయగలవ్యక్తి భారతదేశమునందును నేడు ఒకడు ఉన్నాడనుట తెలియవచ్చుచున్నది. అంబాలాయందు నాజిర్ దిన్ అని పదమూడు వత్సరములబాలుడు స్ప్లీన్ వ్యాధినివారణకై అతడు డాక్టరు రామకిషోర్ ఘోశల అనువానికడకు గొనిరాబడెను రోగియొక్క స్ప్లీన్, గుండెకాయ కుడితట్టునను, లివరు ఎడమతట్టునను ఉండుటకనుగొని ఆడాక్టరు అబ్బురపడెను. పరీక్షార్థము అతని నాడాక్టరు మరి కొందరువైద్యుల కడకుపంపెను. వారును ఘోశలుని అభిప్రాయముతో నేకీభవించి ఈవిడ్డూరమున కొంతయు ఆశ్చర్యపడిరి. ఈవిషయమున తప్ప నాజిర్ దిన్ కడమ అన్నివిషయములందును సామాన్యమానవుని పోలియున్నాడు. సామాన్యమానవునివలె నాబాలుడు పనిచేయును, నడుచును, పరుగెత్తును, భుజించును, నిద్రించును. వానిని పట్టి పీడించుచున్న విడువనిజ్వరముచేతనే అతనిస్ప్లీన్ పెరిగియుండునని డాక్టరులు నిరూపించిరి.




# అరవదేశమునందలి యాంధ్రులు

కర్ణాటాంధ్ర సామ్రాజ్యనిర్మాతయైన కృష్ణదేవరాయల కాలమునుండి ఆంధ్రులు అరవదేశమున వలస నెలకొనుటకు ప్రారంభము చేసి రనవచ్చును. ఇపుడు రంగూను, ఖరగపురము మొదలగు ప్రదేశములకు వలస పోవుచున్న ఆంధ్రులవలె అప్పటిఆంధ్రులు అరవదేశమునకు జీవనాధారములను వెదుకుకొనుచు వెళ్ళియుండలేదు. అరవదేశమును పరిపాలించుటకే వారు వెడలియుండిరనుట సత్యదూరము కాదు.

తంజావూరు, మధుర మొదలగు పట్టణములను రాజధానులుగ చేసికొని అప్పటి ఆంధ్రులు అరవదేశమును నిర్వక్రపరాక్రమమున ఆలించిపాలించిరి. అరవదేశము మధ్యనున్నను వారు ఆంధ్రభాషను ఏమఱలేదు. తాము వేయించిన శాసనములను ప్రాయికముగా ఆంధ్రమునందే వెలయించిరి. ఆంధ్రపండితులను, ఆంధ్రకవులను, ఆంధ్ర గాయకులను పోషించిరి. ఆ కాలమున స్వదేశమునకంటె ఇచ్చటనే హెచ్చుగ ఆంధ్రవాఙ్మయాభివృద్ధి జరిగినది. తంజావూరునాయకులు యక్షగానములను, మధురనాయకులు వచనకావ్యములను ప్రోత్సహించి ఆయాశాఖల సారస్వతమునకు పరిపుష్టినొసంగిరి. చేమకూర వెంకటపతివంటి కవిని, త్యాగరాజువంటి గాయకుని వారు మనకు ప్రసాదించిరి. సాటిలేనిభాషాభిమానముకలిగి వారు పుదుక్కోట రాజవంశమును ఆంధ్ర సరోవరమున తెప్పలు తేలించిరి. తంజావూరు మహారాష్ట్రులుకూడ స్వభాషను విడనాడి తెనుగును రాజభాషగా స్వీకరించిరి.

కాని అది వెనుకటిసంగతి. ఒకప్పుడు రాజభాషగా నుండిన ఆంధ్రభాష ఇపుడా దేశమున కోర్టుభాషగనైన లేదు. సేలముజిల్లా హోసూరుప్రాంతములందును, తదితరప్రదేశములందును అరవదేశమున ప్రస్తుతము ముప్పదియారులక్షలమందికి పైగా ఆంధ్రులు ఉన్నారు. ఉన్న దేశమునుబట్టియు, చేయువ్యవహారమును బట్టియు వారు క్రమముగా స్వభాషను మఱచిపోవుచున్నారు. పరిస్థితులలో కొంతమార్పు జరిగి మనవారి దృష్టి తిరిగి మాతృభాషపై ప్రసరింపనిచో ఒకటిరెండుతరములలో అరవదేశమునందలి ఆంధ్రులు అరవలలో కలసిపోయి తమ జాతీయతను పూర్తిగ గోల్పోవగలరు.

ఇట్టిశోచనీయ పరిస్థితి కలుగకుండుటకును, అరవదేశమునందలి ఆంధ్రులు తమజాతీయతను గోల్పోవకుండ చూచుటకును మదరాసునందు ఐదు, ఆరుసంవత్సరములకు పూర్వము కొంతప్రయత్నము నడచినది. ఈప్రయత్నమునకు శ్రీ సాధు వరదరాజంపంతులుగారు నాయకత్వమును వహించిరి. వారొకచో ఈసమస్య విషయమై నిట్లువ్రాసిరి:

"దాక్షిణాత్యాంధ్రులు నివసించుచుండు రాష్ట్రము ద్రవిడదేశమగుటచేత ఆంధ్రభాష అరవశబ్దములచే నలంకృతమయ్యెను. 'ముందే దుర్బలం దానితో గర్భిణి' అను సామెతవలె అసలేక్షీణించుచున్న ఆంధ్రభాషపై ఆంగ్లేయ పాఠశాలలు వచ్చినవెనుక బొత్తిగా అభిమానము తొలగిపోయెను. ఇచ్చటి ఆంధ్రులు తెలుగుఅక్షరముల స్వరూపములనే మఱచిరి. కనుక వీరికి ఒండొరులతో ఉత్తరప్రత్యుత్తరములు జరుపుకొనుటకు అరవ అక్షరములే శరణ్యములయ్యెను. స్వభాషనుమఱచి జాతీయాభిమానమును మొదలంట నిర్మూలము జేసికొని తమ దుస్థితిని తెలిసికొనజాలక యుండుచున్నారు. ఆంధ్రజాతీ

యాచార వ్యవహార సాంప్రదాయములు మొదలైనవి వీరికి తెలియకుండనే నశించుచున్నవి. దక్షిణమునకు పోను పోను తాము తెలుగువారమని తెలియనివారును చాలమందిగలరు. సోదరులారా! మాతృభాష క్షీణించినమాత్రాన మన దాక్షిణాత్యాంధ్రసోదరులకు ఎట్టి దురవస్థ చేకూరినది? ఇట్టి విపత్తును ఆంధ్రసోదరులందఱు గమనింతురుగాక! ముప్పదియారులక్షల జనసంఖ్యగల దాక్షిణాత్యాంధ్ర సోదరసోదరీ మణులు ఇట్టి దురవస్థకు పాలగుట ఆంధ్రులకు గౌరవమా! శ్రీత్యాగరాజాది ఉత్తమపురుషులు బయలుదేరిన దాక్షిణాత్యాంధ్రుల గతి దుర్గతికావలసినదేనా? యక్షగానములు పాడి జనులను రంజిల్లచేసిన దాక్షిణాత్యాంధ్రశాఖ ఇట్టి దుస్థితి పాలయి క్షీణించుట ఆంధ్రదేశీయులకు గౌరవప్రదము కాదు. ఇట్టి దుస్థితిని తప్పించుకొని తొల్లిటి యౌన్నత్యమును బడయుటకు దాక్షిణాత్యాంధ్రులు మాతృభాషను, తమజాతీయతను సంరక్షించుకొనవలయును, ఇప్పుడే వారు ఇందుకొఱకు తీవ్రముగ కృషిచేయవలయును. ఇట్టి మహత్కార్యమునకు ఆంధ్రదేశీయులుకూడ ఎక్కువగ తోడ్పడవలెను. దాక్షిణాత్యాంధ్రులకు చేయూత ఈయవలసిన బాధ్యత వారిపైగూడగలదు."

దాక్షిణాత్యాంధ్రులకు చేయూతఈయవలసిన బాధ్యత దేశీయాంధ్రులపై గూడగలదను వరదరాజంపంతులుగారి వాక్యమెంతయు సమ్యక్సార్థమైయున్నది. జనసంఖ్యవిషయమున ఇప్పుడాంధ్రభాష భారతదేశీయ భాషలలో తృతీయస్థాన మాక్రమించుచున్నది. ఆంధ్రభాషావాహినికి ఇట్టి సంఖ్యాబలమును కూర్చుచున్నవారిలో అరవదేశమునందలి ఆంధ్రులుకూడగలరనుట మనము మఱువరాదు. అయితే తఱుణమున మేల్కొని కృషిసల్పి అరవదేశమున తెనుగు నిలుపుటకు తీవ్రప్రయత్నములు సాగింపమేని అచటిఆంధ్రులు ఆంధ్రమును మఱచి అరవలలో లీనమై ఆంధ్రభాష వాడువారి సంఖ్యాబలమునకు డిందుపాటు కలిగింపగలరు. కావున ఈసమస్యవిషయమై అత్యవసరముగా ప్రత్యేకశ్రద్ధను దేశీయాంధ్ర నాయకులు చూపవలసియున్నది.

ఏటేట రామేశ్వరయాత్రకని దేశమునుండి పలువురు ఆంధ్రులు అరవదేశమునకు పోవుచుందురు. వారు తమయాత్రా సందర్భమున ఆంధ్రులుఎక్కువగనున్న తంజావూరు, హోసూరు, రాజుపాళెము, సేలము, మధురమున్నగు ప్రదేశములనుగూడ సందర్శించి అచట వలస నెలకొనియున్న ఆంధ్రులతో కలసిమెలసి ఒకటి రెండురోజులుండుచుండుటచే అచటి ఆంధ్రులు మఱచిపోవుచున్న ఆంధ్రసంప్రదాయములుతిరిగి వారిజ్ఞప్తికి వచ్చుచు విస్మృతి గహనము పాలుగాకుండనుండును. అచటి ప్రాథమిక విద్యావిధానమున ఆందోళనముసల్పి తెనుగునకుకూడ అర్హస్థానమిప్పించుట అరవదేశమున ఆంధ్రతాముద్రకు స్థిరత్వముకల్గించు సాధనములలో నొకటి. ఆంధ్రులువిశేషముగాగల తావులయందు గ్రంథాలయములు స్థాపించి అందు ఆంధ్రపత్రికలు, ఆంధ్రగ్రంథములుఉంచి ఆంధ్రవిద్యావ్యాప్తి గావించుట అట్టిసాధనములలో మఱియొకటి. సాధ్యమైనంతతఱచుగా దేశీయాంధ్రనాయకులు ఆప్రాంతములకు పోవుచు ఆంధ్రమున ఉపన్యసించుచు ఆంధ్రకీర్తిని పునశ్చరణము చేయుచుండుట కూడ చాల కార్యకారిగానుండగలదు.

ఈవిషయమై ఏమాత్రము ప్రయత్నముజరిగినను మంచిఫలము వెంటనే కలుగగలదు. ఏమందురా! ఆంధ్రమహాశయుడు త్యాగరాజస్వామి తన అక్షరరమ్యగీతలతో నచ్చట యింటింట పాడుకొనియున్నాడు. మన మీవిషయమైచేయు గోరంతప్రయత్నమును కొండంతగా అతడు చేయగలడు.



# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

## ౩౦ నిరుద్ధ భారతము

దేశమును మఱువని కవులనదగిన శ్రీ మంగిపూడి వేంకటశర్మగారిచే నిది రచియింపబడినది. ఆంధ్రగ్రంథములలో ఒకకూర్పునకు మించిన గ్రంథములు మిక్కిలి తక్కువ. స్థితిఇట్టిదికాగా 'నిరుద్ధభారతము' అను ఈ పద్యకావ్యమునకిది మూడవకూర్పు అనుటచే ప్రజాబాహుళ్యమున నీగ్రంథమునకుగల ప్రచారమును సులభముగ నూహింపవచ్చును. ఆంధ్రదేశమున హరిజనోద్ధరణోద్యమమును హుటాహుటినడలలో నడిపించుచున్న దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారీ మూడవకూర్పును ఉచితముగ ముద్రించి ఇచ్చుటయేగాక గ్రంథమునకు ప్రశస్తతరమగు పీఠికను గూడ వ్రాసియున్నారు. వారి పీఠికనుండి కావ్యమునుగూర్చి కొన్నివాక్యములనిట నుద్ధరించుచున్నాము: 'ఆంధ్రావనియందు హరిజనోద్యమవ్యాపనమునందు శ్రీయుత మంగిపూడి వేంకటశర్మగారి కృతి నిరుద్ధభారతము హరిజనసమస్యయందు పండిత పామరహృదయములను లగ్నముచేసిన విధమునకు గ్రంథమునకు గలిగిన గౌరవవ్యాపకములు ప్రమాణములు. వేంకటశర్మగారు నిరుద్ధభారతమునందు హరిజనుల పరివేదనమును, సవర్ణుల దురాగ్రహములను, మఘయుల ధర్మనిర్వహణమార్గమును రసవంతముగవర్ణించిన పద్యావళి రసానందమును గలుగజేయుచున్నది. శర్మగారి శిలమువలెను కావ్యశైలియును మృదువుగను, సరళముగను, సరసముగను నున్నది. ప్రతిపద్యమును భావగర్భితమైన దైన్యదృశ్యమో, భక్తిదృశ్యమో, కరుణాదృశ్యమో, మహత్త్వదృశ్యమో సాంగోపాంగముగ చిత్రించినటులు కల్పింపబడి భావప్రపంచమునందు సంభ్రమమును గలుగజేయుచున్నది.' తెనుగున ప్రబోధక కవిత్వమునకు దారితీసినవారిలో మంగిపూడి వేంకటశర్మగారొకరు. ఈకావ్యమునందలి పలుపద్యములు చాటుధారలై దేశమున వ్యాపించియుండుట గ్రంథము ప్రజాహృదయమున పాదుకొన్నవిషయమును వ్యక్తీకరించుచున్నది. ఆంధ్రులకు చిరపరిచితమైయున్న ఈగ్రంథమునుగురించి విశేషము వ్రాయుట అనవసరము. ఈ మూడవకూర్పు ముద్రణము సుందరముగనున్నది. క్రౌను సైజున 82 పుటలు. వెల రూ ౦-౫-౦ మాత్రమే. వలయువారు గ్రంథకర్తపేర పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు వ్రాయునది.

## ౩౧ ఆంధ్ర వాఙ్మయ చరిత్రము

శ్రీయుత శేషమళ్ల అచ్యుతరావు (ఎమ్. ఏ., ఎల్. టి.) గారు విజయనగర సామ్రాజ్యమునందలి ఆంధ్రవాఙ్మయ చరిత్రమును మూడుభాగములుగా వ్రాయదొరకొని ప్రస్తుతము ప్రథమభాగమును ప్రచురించిరి విజయనగర సామ్రాజ్యమందలి 1380—1500 సంవత్సరముల నడుమగల ఆంధ్రవాఙ్మయ చరిత్రము ఈప్రథమ భాగమున విపులముగ వివరింపబడినది. విజయనగరరాజ్యారంభమునకుం బూర్వపు ఆంధ్రవాఙ్మయస్థితిని ప్రత్యేక మొక ప్రకరణమున చర్చించిఅచ్యుతరావుగారు ఆసామ్రాజ్యమునకు చెందిన కవులగు నాచనసోమనాథుఁడు; పేరంరాజు జక్కనకవి; పినకొండవల్లభరాయఁడు; దూబగుంట నారాయణ కవి; దగ్గుబల్లి దుగ్గనకవి; పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి; నంది మల్లయ్య, ఘంట సింగయ్య; మనుమంచి భట్టులను పరామర్శించిరి. ఈపరామర్శించుటలో రావుగారొక నూతనమార్గము త్రొక్కిరి. ఇదివఱలో ఆంధ్రకవుల చరిత్రములను రచియించి గురుజాడ శ్రీ రామమూర్తిగారును, కందుకూరి వీరేశలింగముపంతులుగారును ఆయా కవుల దేశకాల నిర్ణయముల విషయమై విశేషశ్రద్ధను చూపిరేగాని ఆయాకవుల 'కవితారీతులు, భావభావనా

శక్తులు, నిమ్నోన్నతావస్థలు, కథాసంధాన చిత్రీకరణములు, ఇత్యాది కావ్యహృదయ పరిస్పందనముల స్పృశింపక యట్టె విడిచిపెట్టిరి.' రావుగారు క్రొత్తపద్ధతి నవలంబించి 'కవికావ్యహృదయామర్మములను' వెలార్చు నుద్దేశముతో 'కథానిరూపణము, శైలీనిర్ణయము, శీల ప్రతిష్ఠాపనము, రసపోషణసంవిధానము, భావభావనా శక్త్యాది విమర్శనము' కూడినంత విపులముగ విమర్శించిరి. ఆంగ్లవాఙ్మయమునందలి జాన్సను కవిపద్ధతి నవలంబించిరనవచ్చును. ఈగ్రంథమునందలి మఱియొక విశేషమేమన ఇందు విమర్శింపబడిన కవులలో వారి వారికి సమకాలికులును గ్రంథనిర్మాణమున సాదృశ్య, సాధర్మ్యములను బొందిన యితరాంధ్రకవులతోఁ జాల వఱకు సరిపోల్చి తారతమ్యములు నిరూపింపబడుటయే. ఈరీతి వాఙ్మయ విమర్శనమునకు విశేషముగ కావలసి యున్నది. శ్రీరావుగారిపద్ధతికి ప్రారంభముగావించినందుల కెంతయు అభినందింపవలసి యున్నది. ఈగ్రంథముయొక్క రెండుమూడు భాగములనుకూడ శ్రీరావుగారు త్వరలో ప్రచురించి ఆంధ్రవిమర్శక వాఙ్మయమును పరిపుష్టి నొందింతురుగాక! గ్రంథము డెమ్మీ సైజున 308 పుటలు. గ్లేజుకాగితము. వెల రూ ౨-౦-౦ విద్యార్థులకు రూ ౧-౮-౦ మాత్రమే దొరకుచోటు. యస్. రామారావుగారు, బి. ఏ, ఇన్నీసు పేట, రాజమండ్రి.

## 3౨. అన్నపూర్ణాదేవి లేఖలు

'నన్ను మరచినను దేశమును మరువవలదు. నేనుస్థిరముగాదు' అని దేవీస్వరూపమున మగనికి దివ్య సందేశమిచ్చిన మాలంటి అన్నపూర్ణాదేవి రాజకీయ జీవితము నెఱిగినంతమంది ఆమె సారస్వత జీవితము నెఱుంగరు. కాని ఆమె గ్రంథములలోనికెల్ల ప్రస్తుతము మనము పరామర్శించుచున్న లేఖలే ఆమె సారస్వత జీవితమును లోకమునకెఱింగించుటలో హెచ్చుగ తోడ్పడగలవు. ప్రసిద్ధపురుషుల లేఖలను ప్రత్యేకమొక వాఙ్మయశాఖగా ఆంగ్లవిమర్శకులు చేకొనియున్నారు. కౌపరు, లేడీవర్ట్లీమాంటేగ్యూ మొదలగువారి లేఖలు ఆంగ్ల సారస్వతమున అనంతగౌరవమునందుచున్నవి. లేఖల సారస్వతము ఆంధ్రమున నింకను ప్రారంభదశయందే యున్నది. అందుచే ఈగ్రంథము ముఖ్యముగా పఠనీయమైనది. దేవిగారి ఆదర్శ జీవితమును వెల్లడించు ఈ లేఖలు ఆంధ్రస్త్రీలెల్లరును చదువవలసినవి. సాహసముచేసి వీనిని ప్రచురించి ఆంధ్రమున లేఖల వాఙ్మయమునకు ప్రారంభముచేసిన శ్రీబాపినీడుగారిని యెంతయు కొనియాడుచున్నాము. గ్రంథముద్రణము సుందరముగ నున్నది. కౌనుసైజు. 250 పుటలు. వెల రు 1-0-0 ఈ పుస్తకము ప్రతులు కావలసినవారు మాగంటి బాపినీడు గారు' ఏలూరు అని వ్రాయవలయును.

## 33. కృపాంభోనిధి

ఆధునికాంధ్రకవిగ్రామణులగు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారిచే 'కృపాంభోనిధీ!' అను మకుటముతో రచియింపబడిన భగవత్ప్రార్థనాత్మకములగు 218 పద్యముల సంపుటము. భక్తిరస ప్రధానములై పద్యములు ధారావేగము గలిగియున్నవి. సర్వకాలములందును, సర్వప్రాంతములందును సత్యములై ప్రకాశింపగల ఉపనిషద్వాక్యములు కొన్ని ఇందు పద్యరూపమునొంది పొంపారుచున్నవి. శ్రీరాజారామమోహనరాయలువారి నిర్యాణశతాబ్దికోత్సవ సందర్భమున ఈ గ్రంథము ప్రచురింపబడుట ఎంతయు ఉచితముగా నున్నది. 'భక్తచింతామణి' వలెనిదియు విశేష ప్రచారమునకు రాగలుగునని నమ్మెదము. 'అనుగ్రయెప్పుడుఁ దోడునీడయయి కన్నెచేయియై ప్రాణమై నను సేవించెననేక వర్షములు' అనుచు కవిగారు దివంగతురాలైన తనభార్యనుగూర్చి వ్రాసిన రెండు మూడు పద్యములు హృదయమును కలంచువిగా నున్నవి. శైలి తెలియుటకై మూడు పద్యములను ఉదాహరించుచున్నాము.

శా. ఆకుంబచ్చల పల్లెరంబులఁ బ్రవా
శాలిన్ నివాళుల్ దగన్
నీకర్పించి, విహంగనాద మనుమే
ళీతంబులంబాడి, తా
మేకాలంబునుఁబూలు కాన్కలిడి తం
డ్రీ! భక్తి వృక్షాంగనల్

నీకాత్మీయా కృతజ్ఞతం దెలిపెడున్
నేర్మిన్ గృపాంభోనిధీ!

మ. ఫలకంబన్నదిలేదు, తూలికయు లో
పంబయ్యెడిన్, లేదు రం
గులసజ్జైయిన, నిరాశ్రయంగు నభో
గోళంబునన్ వర్ణసం
కలనంబందెడు నింద్రచాపమును నా
కంబూని చిత్రించి లో
కులమెప్పించెడి చిత్రకారుని నినుం
గొల్తున్ కృపాంభోనిధీ!

శా. ఐగుద్గ్రంథములన్ రచించితివి గా
యాపఃపురాణంబు భూ
వేదంబున్ గగనేతిహాసము మరుద్ది
వ్యప్రబంధము నా
మోదన్యాచకనామకాగమము స్వా
మీ! యీ ప్రబంధంబులం
గేదానిం గనినన్ భవన్మహిమగా
చే సత్కృపాంభోనిధీ!


క్రౌనుసైజున ముప్పదియారు పుటలు. వలయువారు గ్రంథకర్తపేర రాజమండ్రి వ్రాయునది.

## ౩౮. గృహలక్ష్మి దసరా సంచిక

ఆంధ్రస్త్రీల ఆయురారోగ్య సౌభాగ్యములను పెంపొందుట కేర్పడిన సచిత్రాంధ్రమాసపత్రికయగు గృహలక్ష్మి ఆఱవ దసరాసంచికను కృతజ్ఞతా పూర్వకముగ నందుకొంటిమి. గత ఐదు దసరాసంచికలవలెనే ఇదియు పుటలయందును, పద్యములయందును విస్తృతమును, వినూత్నమును అయి విరాజిల్లుచున్నది. ముఖచిత్రము మనోజ్ఞముగను, లోపలి త్రివర్ణచిత్రములు [illegible] సంచికయొక్క విలువను హెచ్చించుచున్నవి. స్త్రీయొక్క శక్తిస్వరూపమునకు అధునికయుగమున సమగ్ర నిదర్శనమనదగినదని దివంగతురాలైన అనిబిసెంట్ చిత్రము శక్తిపూజాకై ఏర్పడిన దసరాలో ప్రచురింపబడు గృహలక్ష్మియందు చేర్చుట యెంతయు సముచితముగ నున్నది. స్పెయిన్ నారీమణుల నాట్యవిశేషమును చూపు చిత్రము అద్భుతముగనుండి ఆంధ్రస్త్రీల విదేశీయాచార విజ్ఞానమును పెంపొందింప జాలియున్నది. విదేశీయాచారములను పరిచయముచేయు ఇట్టి చిత్రములు స్త్రీలయందు నూతనోత్సాహమును పుట్టించుటయేగాక వారి లోకజ్ఞానమునకు దోహదప్రాయములుగ నుండును. స్త్రీలకొఱకు ప్రత్యేకముగ ఆంధ్రమున పలుపత్రికలు నడుపబడినవి. మల్లాది వేంకటరత్నముగారిచే ప్రారంభింపబడి రాయసము వేంకటశివుడుగారిచే నిర్వహింపబడిన జనానా పత్రిక, వీరేశలింగముపంతులుగారి సతీహితబోధిని, పర్లాకిమిడినుండి ప్రచురింపబడిన బాలిక, పులుగుర్త లక్ష్మీనరసమాంబగారి సావిత్రి, వింజమూరి వేంకటరత్నమ్మగారి అనసూయ, నందిరాజు చలపతిరావుగారి గృహలక్ష్మి, కళ్ళేపల్లి వేంకటరమణమ్మగారి ఆంధ్రలక్ష్మి, బాలాంత్రపు శేషమ్మగారి హిందూసుందరి అట్టివానిలో కొన్ని. వాని యన్నిటికంటె ప్రశస్తరీతిని ఆంధ్రరమణీలోకమును సేవించుచున్న గృహలక్ష్మి నేడు ఆంధ్రగృహములకు లక్ష్మియై యొప్పారుచుండుట వింతగాదు. గృహలక్ష్మిజ్యోతిచే అజ్ఞానాంధకారమును లోధ్రాదీపముచే అమయాంధకారమును దవ్వుగ ద్రోపి తమ్ము అభ్యుద్ధరించుచున్న శ్రీ డాక్టరు కే. యన్. కేసరిగారికి ఆంధ్రస్త్రీలోకమెంతయు ఋణపడియున్నదనుట నిశ్చయము. ఆంధ్రమహాశయులు గృహలక్ష్మికి ఇంకను ఎక్కువగ పోషణ ప్రోత్సాహముల నొసగి దానివలని ఉపయోగమును బహుళమొనర్తురుగాక యని కోరెదము.

## ౩౯. ఆత్మచరిత్రము

శ్రీ రాయసము వెంకటశివుడు, యం. ఏ., యల్. టి, గారి ఆత్మచరిత్రము. ఈ చరిత్రమును గూర్చిన విమర్శనము ఒక్కింత విపులముగ వైమాసపు సంచికలో ప్రత్యేకవ్యాసముగ ప్రచురింపబడగలదు. క్రౌనుసైజున ౨౫౦ పుటలు. వెల రూ ౧-౦-౦ మాత్రమే. ప్రతులకై గ్రంథకర్తపేర గుంటూరు వ్రాయునది.




## సెప్టెంబరు, ౩౩.

౧౭:—సంగం జాగర్లమూడి. ఉన్నతవిద్య గరచుటకై లండను కేగుచున్న క్రొత్త రఘురామయ్య చౌదరి యం. ఏ. యల్. యల్. బి గారికి వీడ్కోలు విందు.

౧౮:—బందరు. కృష్ణాజిల్లా పంచాయితీ ఎన్నికలు జరుపగౌరవోద్యోగిగ నియమింపబడిన శ్రీచల్లపల్లి రాజాగారి ఆహోదాను తొలగించినట్లు ప్రభుత్వమువారు ప్రకటించిరి.

:—నంద్యాల గ్రామములో పికెటింగు చేసినందుకుగాను అరెస్టుచేయబడిన నారాయణానంద స్వామిగారిని ఔకుగ్రామము మకాములో జాయంటు మేజిస్ట్రేటు విచారించి ఆరునెలలు కఠినశిక్ష, డెబ్బదియైదు రూపాయలజుర్మానా, జుర్మానా చెల్లింపనిచో ఏడున్నర నెలల అదనపుశిక్ష విధించిరి. స్వామిగారు జుర్మానా చెల్లింప నిరాకరించిరి.

౧౯:—నెల్లూరుజిల్లా సంగం గ్రామములో ఈయబడిన టీపార్టీ సందర్భము వెంకటగిరి కుమార రాజావారు [illegible] ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణావశ్యకతను [illegible]చిరి.

౨౦:—మదరాసు. డాక్టరు ఆనిబిసెంటు సాయంకాలము 4 గంటలకు చనిపోయెను.

౨౧:—మదరాసు. ఆంధ్రపత్రిక పంచవింశతి వార్షికోత్సవము. రజతోత్సవసంచికా ప్రచురణము.

:—గుంటూరు. జిల్లాబోర్డు మీటింగులో ప్రత్యేకాంధ్రరాష్ట్ర తీర్మానము ఆమోదింపబడెను.

౨౨:—ఒంగోలు శారదామహిళాసంఘము స్థాపింపబడెను.

౨౩:—తుని గోదావరీమండల మహిళామహాసభ. శ్రీమతి పి. ఇందిరాబాయి బి.ఏ గారు ఆహ్వాన సంఘాధ్యక్షురాలు సారంగు సీతాదేవిగారు అధ్యక్షురాలు

:—అంగలూరు. ఉదయము తొమ్మిదిగంటలకు శ్రీయుత యెర్నేని సుబ్రహ్మణ్యముగారి నరెస్టు చేసి పోలీసువారు గుడివాడకు తీసికొనివెళ్లి విడుదలచేసిరి.

:—ఏలూరు. శ్రీయుత సత్తిరాజు రామమూర్తి గారికి ఒక సంవత్సరము విడిఖైదు విధింపబడెను.

౨౪:—కూచిపూడి. శ్రీ సరస్వతీనిలయ వార్షికోత్సవము శ్రీకోటుకూరి వేంకటసుబ్బరాయ శ్రేష్ఠి గారి ఆధిపత్యమున జరిగెను.

౨౫:—గుంటూరు. జిల్లాఎడ్యుకేషనల్ కౌన్సిల్ ప్రెసిడెంటుగా పి. వి. కృష్ణయ్యచౌదరిగారు ఎన్నుకొనబడిరి.

:—నరసాపురము. భరతశాస్త్ర ప్రవీణురాలు, వైణికురాలు, సంఘసంస్కర్త్రి, భక్తురాలు మద్దుల పర్వతవర్ధని మరణము.

౨౬:—బెజవాడ. 20 మాసములనుండి సర్కారువారి ఆధీనములో నుండి తలుపులు తాళములు వేయబడిన కాట్రగడ్డ మధుసూదనరావుగారి ఇల్లు తిరిగి వారికి మొంగలాజపురమునందు స్వాధీనము చేయబడినది.

:—వేటపాలెము. గుంటూరుమండల గ్రంథాలయ సంఘమువారి యాజమాన్యమున సారస్వత నికేతన భవనమున గ్రంథాలయ ప్రదర్శనోత్సవమును శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామీ చౌదరి గారు జరిపిరి

౨౮:—బెజవాడ. ఆంధ్రప్రాంతీయ హిందీ మహావిద్యాలయ ప్రారంభోత్సవము నందిగామ తాలూకాబోర్డు అధ్యక్షులును, జయంతిపురం జమీందారులును అగు శ్రీరాజా వాసిరెడ్డి సదాశివేశ్వర ప్రసాద్ బహద్దరు వారిచే జరుపబడెను

:—ఆంధ్రపేపరుమిల్సు మేనేజింగు యేజంట్సు అయిన బి. సి. లిమిటెడ్ ఫరంవారు డైరెక్టరు బోర్డు సమక్షమున మిల్సు మేనేజిమెంటును ఒప్పగించుకొనిరి

౨౯:—శృంగేరి, శంకరాచార్య స్వాములవారు దర్శన మియ్యనందులకు అంకరాజు సుబ్బరాయశర్మగారు నిరశనదీక్షవహించిరి.

:—కాకినాడ సర్వపరము దేవస్థానపు ట్రస్టీలు, వైశ్యప్రముఖులు గుడిమెట్ల రామచంద్రమూర్తిగారి మరణము.

౩౦:—బందరు శతావధాని చల్లపల్లి వేంకటశాస్త్రిగారి షష్టిపూర్తి ఉత్సవప్రారంభము.

:—వేలూరు. శ్రీయుత బులుసు సాంబమూర్తిగారు విడుదల నొందిరి.

:—కడలూరు. శ్రీయుత పాలుపూడి సత్యనారాయణగారి విడుదల.

:—విశాఖపట్టణము. మ్యునిసిపలు సంఘమువారు ప్రత్యేకాంధ్రరాష్ట్రమునుగూర్చి తీర్మానించిరి.

:—బరంపురము గంజాంవరదల బాధ నివారణకు గాను ప్రభుత్వమువారు రూ 1000 ఇచ్చిరి.

:—నూజవీడు. కృష్ణామండల మహిళాసభ. శ్రీమతి యం. శ్రీ విజయలక్ష్మమ్మ రావు బహద్దరు ఉయ్యూరు రాణిగారు ఆహ్వాన సంఘాధ్యక్షురాలు. శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారు అధ్యక్షురాలు.

అక్టోబరు, 33.

౧:—విశాఖపట్టణము. శ్రీయుత వెంకటసత్యనారాయణగారి సంపాదకత్వము క్రింద 'సరస్వతీ పత్రిక' యను ప్రతి ఆదివారము ప్రచురింపబడు వారపత్రిక వెలువడెను.

౨:—ఏలూరు స్వర్గీయ మాగంటి అన్నపూర్ణాదేవి వష్ఠను వార్షికోత్సవము శ్రీజాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారి అధ్యక్షతను జరిగెను

:—ప్రొద్దుటూరు. నీటికొళాయిలు ఏర్పాట్లు పూర్తియై ప్రజలకు విడువబడెను.

౩:—గుడివాడ. శ్రీ అయినంపూడి శ్రీనివాసులుగారు అయినంపూడి గ్రామములో అరెస్టు చేయబడిరి.

:—రేమిడిచర్ల. (నైజాము) పిడుగుపడి నాలుగిండ్లు కాలిపోయెను.

౫:—రాజమండ్రి. కోటఉరట్ల ఎస్టేటు మైనరు ప్రొప్రయిటరు శ్రీరాజా చింతలపాటి వేంకట సింహాద్రి రాజుగారికి మేనమామయగు శ్రీ పూసపాటి సూర్యనారాయణ వేంకటకృష్ణంరాజుగారిని గార్డియనుగానియమించిరి.

:—ఒరిస్సా కమిటీ సభ్యులు బరంపురము చేరిరి.

౬:—మచిలీపట్నము. కృష్ణాజిల్లా విద్యాసంఘాధ్యక్షులుగ ఆదుసుమల్లి హరిసిడు చౌదరిగారు ఎన్నుకొనబడిరి.

:—డోకిపర్రు. శ్రీసేనుగుప్త గ్రంథాలయ ప్రారంభోత్సవమును దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు జరిపిరి.

:—నెల్లూరు. శ్రీయుత మన్నేపల్లి రామకృష్ణారావు పంతులుగారి సంపాదకత్వమున ప్రతి శుక్రవారము ప్రచురింపబడు నూతనాంధ్రవార పత్రిక వెలువడెను.

౭:—విశాఖపట్టణము. హార్బరులోనికి మొట్టమొదటి ఓడ 'జలదుర్గ' అను పేరుగలది తీసికొని రాబడెను. ఈ ఓడ సింధియా నావిగేషను కంపెనీవారిది

౮:—గుంటూరు 'భక్తిప్రబోధిని' వార్షికోత్సవము దేశభక్త కొండ వెంకటప్పయ్య పంతులుగారి అధ్యక్షతను జరిగెను.

# సంపాదకీయ సమాలోచన

## ధరలు ఎట్లు పెరుగును ?

1873-75 సంవత్సరములలో తెలుగు దేశమును పీడించిన కాటకమునందు గూడ ఇప్పటి విషమపరిస్థితులు లేకుండినవని ఆధాత సంవత్సరపు కఱువులో తేగలుమాత్రము తిని దేహధారణము చేసికొనినవారు చెప్పుచున్నారు. 1893-96 సంవత్సరములలో ఇప్పటివలె ఆర్థికమాంద్యముకూడ లోకావ్యాపకమైనదే. కాని అది అప్పుడు మూడు సంవత్సరములలో తీరిపోయినది నాలుగవ సంవత్సరమునుండియు ధరలు క్రమముగా పెరగనారంభించి ప్రజాహృదయమునుండి భయమేఘములను చెదరగొట్ట దొడంగినవి 1929 లో ప్రారంభమైన ఈ ఆర్థికమాంద్యము ఇప్పటికి నాలుగుసంవత్సరములనాటిదైనను ఇంతలో వదలునట్లు కనిపించదు. ఇతరదేశముల మాట మనము చెప్పజాలము కాని హిందూదేశమును మాత్ర మది ఇంతట అంతట వదలునట్లు లేదు. ఇతర దేశముల ప్రభుత్వమువారు ప్రజాలోకమున కండయై ధరల పెరుగుదలకు విశ్వప్రయత్నము లొనర్చుచున్నారు మన ప్రభుత్వమువారి వక్షమున అట్టి ప్రయత్నలేశమైన కానము. మీదు మిక్కిలి పడిపోయినధరలు హెచ్చకుండజేయు పరిస్థితులను కల్పించినారు. ఒట్టవా ప్యాక్టును హిందూదేశము తలపై రుద్దినారు. ఆప్యాక్టువలన ఈదేశము తనకుమాలినధర్మమును చేయవలసిన దగుచున్నది. ఆంగ్లసామ్రాజ్య క్షేమమునకై మనము జపాను, ఫ్రాన్సు మొదలగు దేశములనుండి దిగుమతిచేయువస్తువులపై హెచ్చు సుంకములను విధించితిమి ఫ్రాంసుదేశమునుండివచ్చు బట్టలపై నూటికి డెబ్బదియైదువంతునను, జలతారుపై నూటికి అరువదిరెండున్నరవంతునను, మోటారుకారులు, రసాయనికవస్తువులు, లోహములు మొదలగువానిపై హెచ్చు సుంకములను ఇచట విధించుటచే హిందూదేశమునుండి పోవు వస్తువులపై ఆదేశమును హెచ్చు సుంకములను ఏర్పఱచినది. ఈదేశమునందలి ముఖ్యమగుపంటలలో నొకటియగు వేరుశనగను ఫ్రాంసుదేశము ఇదివఱకు విశేషముగా కొనుచుండునది ఒక్క మద్రాసు హార్బరునుండి 1932-వ సంవత్సరమున ఒక్క సెప్టెంబరుమాసముననే ఫ్రాంసుదేశము 140 లక్షలు విలువగల 14000 టన్నుల వేరుశనగను కొనియున్నది. కాని ఈసంవత్సరము ఆగష్టుమాసమధ్యమున వేరుశనగపై ఫ్రాంసుదేశమున సుంకమువిధింపబడుటచే ఇపుడు వేరుశనగరవాణా నిలిచిపోయినది. తనవస్త్రములపై హెచ్చుపన్నును విధించుటచే జపాను ఇదివఱకు మనదేశమున కొనుచున్న ప్రత్తిని కొన నిరాకరించినది. కోస్తారవాణా లేక పండినపంటకు విడుదల ఎట్లుండును ? విడుదలకే నోచనివస్తువుల ధరలకు గిరాకి ఎట్లు కలుగును? శమ ఉద్యోగుల జీతములు తగ్గించినట్లే తగ్గించి వెనువెంటనే హెచ్చించి రైతులవద్దనుంచి పన్నునుమాత్రము యధారీతిని వసూలుచేయుచు మన ప్రభుత్వమువారు ప్రజాక్షేమమునకై పాటుపడుచున్నారు !

**ఉత్తర సర్కారులలో వరి, చెఱుకుపంటలు :**

ఉత్తరసర్కారుల భాగ్యమునకు చాల వఱకు కారణభూతమైనవి వరి, చెఱుకు పంటలు. మదరాసురాజధానియందు గత వత్సరము 1,17,100 ఎకరములలో చెఱుకు సాగు చేయబడియుండగా ఈ వత్సరము 1,13,500 ఎకరములలో మాత్రమే సాగు చేయబడియున్నది అనగా నిరుటికంటె ఈ యేడు చెఱుకుపొలము నూటికి మూడువంతులు తగ్గినది. రాజధాని మొత్తముమీద చెఱుకుపొలము తగ్గగా ఉత్తరసర్కారులలో మాత్రము నూటికి పదివంతులు హెచ్చినది. గతవత్సరమున సర్కారులలో 45,390 ఎకరములుమాత్రమే చెఱుకుకు ప్రత్యేకింపబడగా ఈవత్సరమున 49,800 ఎకరములు ప్రత్యేకింపబడినవి. ఇచట పంచదార ఫ్యాక్టరీలు ఏర్పడగలవను నమ్మకమే ఈహెచ్చుదలకు కారణమైయుండునని వ్యవసాయ శాఖానివేదిక తెలుపుచున్నది. ఇకవరిపంట విషయము మదరాసు రాజధానియందు గడచినసాలలో 76,18,000 ఎకరములలోను ఈ సాలున 74,79,000 ఎకరములలోను వరి సాగు చేయబడినది. అనగా నూటికి సుమారు రెండువంతులు తగ్గుదల కన్పించుచున్నది. ఈతగ్గుదల ముఖ్యముగ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలయందే కలదని నివేదికలో కలదు. ఏపంటయైనను ఇపుడన్నిటికిని ధరలు ఒకేరీతిగనే యున్నవి. కావున రైతునకు కలుగగల లాభములో తారతమ్యము విశేషముకాని వరిపంటతగ్గుటచే రైతునకు ఒక నష్టము కలుగుట నిశ్చయము. పశువులకు ప్రధానమైన గ్రాసమగు వట్టిగడ్డియొక్క సరఫరా * వరిపంటయొక్క తగ్గుదలతోబాటు తగ్గిపోగలదు. పంచదారఫ్యాక్టరీలు నిర్మింపబడుటచే చెఱుకుపంటలాభించునని నమ్మిన రైతునకు ఆవిషయమునకలుగు ఆశాభంగమునకు పశుగ్రాసము కొఱవడుటచే కలుగు బెంగతోడుపడి ఆతనిస్థితిని మఱింత శోచనీయము మొనర్పగలదు.

**విశాఖపట్న నౌకాశ్రయము :—**

ప్రకృతిమాత ఆంధ్రునకనుగ్రహించిన వరప్రసాదములలో విశాఖపట్ననౌకాశ్రయమొకటి. అయితే దాని నాతడింతవఱకు పూర్తిగ నుపయోగించుకొనలేక పోయినాడు. సిపాయికలహముల సంవత్సరమగు 1857-వ సంవత్సరముననే విశాఖపట్నమున నౌకాశ్రయమును నిర్మింప ఆలోచనలు సాగినవి కాని కొనసాగలేదు. 1889-లో తిరిగి ఈ ఆలోచనలు తీవ్రమైనవి. కాని అప్పుడును ఆంధ్రుని రేఖ బయలుపడలేదు. ముప్పదియాఱు సంవత్సరములకు తరువాత అనగా మూడు పుష్కరములకు పిమ్మట 1915 లో భారతశాసనసభలో విశాఖపట్న నౌకాశ్రయ నిర్మాణవిషయమై తీర్మానింపబడెను. 1925, 1926 సంవత్సరములు ఆంధ్రుని జాతకములో ఉచ్చమైనవి, ఏమన 1925 లో విశాఖపట్న నౌకాశ్రయ నిర్మాణ ప్రారంభమును, 1926 ఆంధ్రవిశ్వవిద్యాలయ సంస్థాపనమును జరిగినవి. ఆంధ్రవిశ్వవిద్యాలయము రాజమండ్రిలో పుట్టదలచి బెజవాడలోపుట్టి విశాఖపట్నము చేరుకొన్నది. అందుతో విశాఖపట్నము ఆంధ్రమహానగరమగుట సునిశ్చితమైనది. కలకత్తా, మదరాసుల మధ్యనుండి మాంగనీసు అనిసెగింజలు, వేరుశనగ, జనపనార మొదలగు సరకుల రవానాకు హెచ్చువీల్లను కల్పించి ఈ ఆంధ్రనగరి అచిరకాలముననే ఒక పెద్ద పట్నమై ప్రపంచమునకు ఆంధ్రత్వమును చాటు బూరగొమ్మైఅయి వెలయగలదు. కలకత్తావలన వంగదేశస్థులును,

బొంబాయివలన మహారాష్ట్రులును, కరాచీ వలన సింధుదేశీయులును పొందిన, పొందు చున్న అభివృద్ధిని విశాఖపట్నమువలన ఆంధ్రులు పొంది తోడి జాతీయులలో అగ్రస్థానము నందగలరు. విశాఖపట్న నౌకాశ్రయము తెఱువబడిన ఈ అక్టోబరు 7-వ తేది ఆంధ్రులచరిత్రలో నొకముఖ్యదినమై తర తరములకు వెలయగలదు. నౌకాశ్రయమును సంపాదించుకొనిన ఆంధ్రుడిక ఉన్నతన్యాయస్థానమును, రాష్ట్రమును సంపాదింప సత్వరముగ ప్రయత్నించి కృతకృత్యుడగునుగాక!

ఆంధ్రపత్రిక రజతోత్సము:—

పత్రికల రుద్రభూమియను ప్రఖ్యాతి నార్జించిన ఆంధ్రదేశమున ఆంధ్రపత్రిక నిండాఱు ఇరువదియైదువత్సరములు నివ్వటిల్లి నెగడుచుండెననుట యొకయద్భుతవిషయమే. అయితే ఈ అద్భుతవిషయమునకు కారణము ఆంధ్రులాపత్రిక కొసగిన పోషణప్రోత్సాహములుగాక ఆపత్రికాధిపతి అకుంఠితదీక్షయు, అపూర్వత్యాగమును. నాగేశ్వరరావు నిజముగా తెలుగుదేశపు నార్త్క్లిఫ్. మంచిని పొగడుటకాని, చెడును తెగడుట కాని, యెఱుగని విచిత్రదేశమగు తెలుగు దేశమునగాక ఆతడు మఱి యేదేశమునపుట్టి యుండినను ఇంతకంటె హెచ్చు యశోగౌరవముల నందియుండును గృహవిశ్వవిద్యాలయమై ఇరువదియైదువత్సరములుగ తమ్ము నేగించుచున్న ఆంధ్రపత్రికయొక్కయు, దానియొక్క దేశోద్ధారకుని యొక్కయు ఆయురారోగ్యములకై నిత్యము భగవంతుని ప్రార్థించుచుండుట రెండున్నరకోట్ల ఆంధ్రులయొక్కయు విధికృత్యమై యున్నది.

రాయలసీమ: పత్రికలు:—

బళ్లారియందలి శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాలావార్షికోత్సవసందర్భమున ఉపన్యసించుచు శ్రీగాడిచెర్ల హరిసర్వోత్తమ రావుగారు 'రాయలసీమ: పత్రికలు' అను విషయమునుగూర్చి ఇట్లుచెప్పిరి: "వాఙ్మయసంబంధమగు విషయము మఱియొకటి కలదు. అది పత్రికాప్రకటనము. రాయల సీమకు బయటజరుగు పత్రికోద్యమమున మనవారు కొందఱు పాల్గొనినారనుట వాస్తవమే. ఆంధ్రదేశమును కొన్నివారములు ఉఱ్ఱూతలూగించిన స్వరాజ్యపత్రిక కీర్తినిజముగ రాయలసీమకు చెందదగినదే ఆంధ్రమున మొదటిపత్రికయగు 'యక్షిణీపత్రిక' బళ్లారిపురమున వెలువడినదని మాకవిమిత్రులు పప్పూరు రామాచార్యుల వారు ప్రకటించినారు. కాని పత్రికానిర్వహణము నందుమాత్రము రాయలసీమ గర్వపడదగిన ప్రతిభను చూపుటకు కాలేదు. 'ఆంధ్ర చంద్రిక', 'మాతృసేవ', 'పినాకిని', 'సాధన', 'ఇంద్రావతి' మున్నగుపత్రికలు శ్రమశక్తి కొలదిపనిచేసినవి. ప్రోత్సాహము కొఱవడుటను జేసి నిలిచిపోయినవి. ఏతద్విషయమున రాయలసీమ పూనికతోపనిచేసి ఆంధ్రలోకమును తృప్తిచెందింపదగియున్నది." అనేక విషయములందు రాయలసీమ వారివ్యక్తిత్వమును కాపాడుటకు ఈతరుణమున ఒకవారపత్రికయొక్క ఆవశ్యకత యెంతేనిగలదు. రాజకీయ వాతావరణము ఇపుడొకింతచల్లబడినదిగావున అనంతపురమున్నుండి వెలువడుచు రాజకీయకారణమున ఆగిపోయిన 'సాధన' పత్రికను పునరుద్ధరింపనగును. చరిత్రగల రాయలసీమ పత్రికలలో 'సాధన' ఎన్నదగినది. సమర్థతతో నిర్వహింపబడి అది మంచిపలుకుబడిని సంపాదించినది. అట్టిపత్రిక పునరుద్ధరణమునకు రాయలసీమ ప్రజలు వ్యగ్రోత్సాహమున పనిచేయుదురని నమ్ముచున్నాము.